సాహితీ
నవ సాహిత్యపు మలుపులు

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

వరంగల్ : fb.com/vaartha Digital


Published from Warangal, Karimnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

3-4-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 62 పేజీలు: 8+16 వెల: 6.50


16 నుంచి ప్రత్యేక పార్లమెంటు భేటీ

సిఎం పదవికి నితీశ్ రాజీనామా

5



## ప్రజారాజధానికి 'పెద్దలు' సై

పార్లమెంటులో చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతం

**ఉభయసభల ఆమోదంతో ఇక నిర్విఘ్నంగా అమరావతి**

దాదాపు అన్ని పార్టీలు చట్టబద్ధత బిల్లుకు మద్దతు

బిల్లును వ్యతిరేకిస్తూ వైసిపి సభ్యులు వాకౌట్

**విజయవాడ, ఏప్రిల్2, ప్రభాతవార్త ప్రతినిధి:** భారత పార్లమెంట్‌లో ఓ చారిత్రత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. ఆంధ్రప్రదేశ్ కలల రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే క్రమంలో కీలక అంకం పూర్తయింది. రాజ్యసభ గురువారం ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్దతను కల్పించే బిల్లుకు ఆమోదం తెలిపింది. నిన్ననే లోక్‌సభలో ఆమోదం పొందిన బిల్లుకు రాజ్యసభకు నేడు చేరింది.. రాజ్యసభలో బిల్లుపై జరిగిన చర్చలో అమరావతికి తిరుగులేని మద్దతు దక్కింది. బుధవారం లోక్‌సభలో ఆమోదం పొందిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన సవరణ బిల్లును కేంద్రమంత్రి నిత్యానందరాయ్ రాజ్యసభలో ప్రవేశపెట్టారు. సభ్యుల సమ్మతితో రాజ్యసభ ఛైర్మన్ సి.పి.రాధాక్రిష్ణన్ బిల్లుపై చర్చకు ఆమోదం తెలిపారు. అమరావతికి చట్టబద్ధతకు కాంగ్రెస్, భారతీయ జనతాపార్టీ. తెలుగు దేశం, ఆమ్ ఆద్మీ. తృణమూల్, బిజెడి,, జెడియు. >>2

# గ్యారంటీలు పక్కా

## అమలులో సందేహాలుంటే తెలంగాణకు రండి..




కేరళంలో యుడిఎఫ్ మేనిఫెస్టో విడుదల చేస్తున్న సిఎం రేవంత్

కెసిఆర్, విజయన్.. ఇద్దరిదీ అవినీతి పాలనే

కేరళంలో ఇక యుడిఎఫ్ స్వర్ణయుగం

**మేనిఫెస్టో విడుదలలో సిఎం రేవంత్**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్2:** యూడీఎఫ్ ప్రకటించిన గ్యారంటీలపై విమర్శలు చేస్తున్న వారు అవి ఎలా అమలవుతాయో తెలుసుకోవాలంటే తెలంగాణకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో అమలవుతున్న పథకాలను ప్రత్యక్షంగా చూసి.. తమ ట్రాక్ రికార్డు పరిశీలించుకోవచ్చని ఆయన సూచించారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, ఆయన మంత్రులు తెలంగాణకు వస్తే తాము గ్యారంటీలు ఎలా అమలు చేస్తున్నామో ప్రత్యక్షంగా చూపుతామని సీఎం తెలిపారు. కేరళం శాసనసభ ఎన్నికలకు సంబంధించి యూడీఎఫ్ మేనిఫెస్టోను కొచ్చిలో గురువారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కేరళంలో పినరాయి విజయన్ హయాం ముగిసిందని, ఇక యూడీఎఫ్ స్వర్ణయుగం మొదలవుతుందన్నారు.. ముఖ్యమంత్రి పినరాయి విజయన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. దేశాన్ని, కేరళంనూ మోదీ బ్రదర్స్ పాలిస్తున్నారని మోదీ.. విజయన్‌ను ఉద్దేశించి సీఎం వ్యాఖ్యానించారు. దేవుడి స్వంత రాష్ట్రంలో దేవుడి ఆస్తికీ రక్షణ లేదంటూ పరోక్షంగా శబరిమల బంగారం ఉదంతాన్ని సీఎం లేవనెత్తారు. కేరళంలో గత పదేళ్లుగా పినరయి విజయన్ ప్రభుత్వం కొనసాగుతోందని, అలాగే 2014 నుంచి సుమారు >>2



కన్నవారి సంరక్షణలో

## కుమార్తెకూ బాధ్యత

**స్పష్టం చేసిన హైకోర్టు**

**హైదరాబాద్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:** ముఖ్యంగా వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను చూసుకోవడంలో కుమారునితో పాటు, కుమార్తెకు కూడా బాధ్యత ఉంటుందని రాష్ట్ర హైకోర్టు స్పష్టం చేసింది. తల్లిదండ్రుల ఆస్తిపై హక్కులను వినియోగించుకునే విషయంలో కుమారులతో కుమార్తెలకు కూడా సమాన బాధ్యత ఉంటుందని, అదే సందర్భంలో వృధ్యాప్యంలో కూడా ఇవే హక్కులు ఇద్దరికీ ఉంటాయని గురువారం తెలంగాణ హైకోర్టు నొక్కి చెప్పింది. సూర్యాపేట జిల్లాకు చెందిన 66 ఏళ్ల మహిళ తన కుమారుడు తనను నిరక్ష్యం చేస్తున్నాడని ఆరోపిస్తూ న్యాయస్థానాన్ని >>2

## ఇరాన్‌లో అతిపెద్ద బ్రిడ్జి పేల్చివేత



మూడు వారాలు ఇరాన్‌పై తీవ్రస్థాయి దాడులు: ట్రంప్

అమెరికా లొంగిపోయేంత వరకూ దాడులు తప్పవన్న ఇరాన్

**టెహ్రాన్,వాషింగ్టన్, టెల్ అవీవ్, ఏప్రిల్ 1:** మద్యప్రాచ్యంలో యుద్ధం సమీపభవిష్యత్తులో ఆగే పరిస్థితులు కనిపించడంలేదు. రానున్న రెండుమూడు వారాల్లో యుద్ధం మరింత తీవ్రంగా ఉంటుందని, ఇరాన్‌లోని మౌలికవనరులన్నింటినీ ధ్వంసంచేస్తామని ట్రంప్ పేర్కొన్న తర్వాత ఇరాన్ కూడా అంతే వేగంగా స్పందించింది. అమెరికా పూర్తిగా లొంగిపోయేంతవరకూ యుద్ధం కొనసాగుతూనే ఉంటుందని ఇరాన్ మిలిటరీ కమాండ్ స్పష్టంచేసారు. అమెరికా అవమానపడేంతవరకూ కొనసాగిస్తామని చెప్పారు. వ్యూహాత్మక క్షిపణులు, దీర్ఘశ్రేణి డ్రోన్లు, గగనతల రక్షణ వ్యవస్థలు, ప్రత్యేక ఆయుధ ఉత్పత్తికేంద్రాలన్నింటినీ ధ్వంసంచేసామని, ఇరాన్ ఇపుడు పూర్తిగా బలహీనపడిందని ట్రంప్ పేర్కొనడాన్ని ఇరాన్ తీవ్రంగా ఖండించింది. అమెరికా రాతియుగం నాటినేరాలు ఆధునిక కాలానికి తెస్తోందని,చిన్నారుల హత్యలుమానవత్వానికి మచ్చతెచ్చేనేరాలకు పాల్పడుతోందని >>2



హైదరాబాద్‌లో గురువారం వైభవంగా హనుమాన్ శోభాయాత్ర

## వైభవంగా హనుమాన్ శోభాయాత్ర

3



## వడగాడ్పులు పదిరోజులే!

**తూర్పు జిల్లాల్లో ఎక్కువ ఉష్ణోగ్రతలు**

**హైదరాబాద్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:** ప్రస్తుత వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు సాధారణ పరిధిలోనే ఉంటాయని ఆ శాఖ సూచించింది. ఏప్రిల్ నుండి జూన్ మధ్య కాలానికి సంబంధించిన ఉష్ణోగ్రతలు, వడగాలుల ముందస్తు అంచనాలను తాజగా విడుదల చేసింది. గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిలో లేదా కంటే కొంచెం తక్కువగానే ఉంటాయని వివరించింది. అయితే, కనిష్ట ఉష్ణోగ్రతలు (రాత్రిపూట ఉష్ణోగ్రతలు)మాత్రం సాధారణ >>2

## మూసీపై ఎన్‌జిటిలో సర్కార్‌కు ఊరట

గాంధీ సరోవర్‌ను వ్యతిరేకిస్తూ కార్తీక్‌రెడ్డి వేసిన పిటిషన్ డిస్మిస్

ప్రాజెక్టుకు తొలగుతున్న అడ్డంకులు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్2:** తెలంగాణలోని మూసీ నది పునరుజ్జీవం ప్రాజెక్టుకు అడ్డంకులు తొలుగుతున్నాయి. మూసీనది సుందరీకరణ విషయంలో తెలంగాణ ప్రభుత్వానికి నేషనల్ గ్రీన్ ట్రెబ్యునల్ (ఎన్‌జీటీ) ఊరటనిచ్చింది. పర్యావరణ అనుమతులు లేకుండా గాంధీసరోవర్ నిర్మాణం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ నేత పటోళ్ల కార్తీక్ రెడ్డి తమిళవాడు రాష్ట్రంలోని చెన్నైలోని నేషన్ గ్రీన్ ట్రెబ్యునల్ (ఎన్‌జీటీ)లో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ గురువారం డిస్మిస్ చేసింది. ఈ పిటిషన్‌ను విచారించిన ట్రెబ్యునల్ పిటిషనర్ తన వాదనలకు సంబంధించి ఎటువంటి సాంకేతిక, శాస్త్రీయ ఆధారాలను సమర్పించలేదని పేర్కొంది. కేవలం అనుమానాలతో ప్రాజెక్టును అడ్డుకోలేమని, పర్యావరణ ఉల్లంఘనలు జరుగుతున్నాయని నిరూపించడంలో పిటిషనర్ విఫలమయ్యారని ట్రెబ్యునల్ అభిప్రాయపడింది. గాంధీ సరోవర్, మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు సంబంధించి అన్ని రకాల అనుమతులు తీసుకున్న తర్వాతే ముందుకెళ్తామని ప్రభుత్వ న్యాయవాది ఎన్‌జీటీ దృష్టికి తీసుకెళ్లారు. ప్రాజెక్టు సమగ్ర నివేదిక పూర్తి అవుతోందని, గాంధీ సరోవర్‌కు సంబంధించి తుది నిర్ణయాన్ని తీసుకోవాల్సి ఉందని అన్నారు. అటు తర్వాత పర్యావరణానికి ఏమైనా నష్టం వాటిల్లుతుందా అన్న అంశాన్ని కూడా విశ్లేషిస్తామని ఎన్‌జీటీకి హామీ ఇచ్చారు. దీంతో ఈ దశలో పటోళ్ల కార్తీక్ రెడ్డి పిటిషన్‌ను విచారించలేమని ఎన్‌జీటీ స్పష్టం చేసింది. మూసీ పునరుజ్జీవంలో భాగంగా ఇప్పటికే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంచిరేవుల వద్ద ఓంకారేశ్వరాలయానికి భూమి పూజ కూడా చేసింది. ఈ క్రమంలో సుమారు రూ.50వేల కోట్లతో భారీ ప్రాజెక్టును చేపట్టింది. గాంధీ సరోవర్‌కు సంబంధించి నేషల్ గ్రీన్ ట్రిబ్యూనల్‌లో కొంత ఊరట లభించడంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మూసీ సుందరీకరణ పనుల్లో వేగం పెంచే అవకాశం ఉంది. మూసీ నదిలో మురుగు నీరు కలవకుండా ఎస్‌టీపీల నిర్మాణం, నది పరివాహక ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్స్, చెక్ డ్యామ్‌ల ఏర్పాటు వంటి పనులపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. మూసీ నది అభివృద్ధిలో భాగంగా ఎవరినీ నిరాశ్రయులను చేయమని గతంలో సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.మూసీ పరిధిలో ఉన్న బాధితులందరికీ పునరావాసం కల్పిస్తామని >>2



## ఉద్యోగుల్లో ఎఐ నైపుణ్యం పెరగాలి

**కర్మయోగి సాధనా సప్తాహ్‌ను ప్రారంభించిన ప్రధానిమోడీ**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:** ఎన్డీయే ప్రభుత్వం నాగరిక్ దేవో భవ అనే ప్రధానమైన పాలనా మంత్రంతో పని చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా భారత్ దూసుకెళ్తోందని, ఈ తరుణంలో ప్రజా సర్వీసులనూ అప్‌డేట్ చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. నాగరిక్ దేవో భవ మంత్రంతో పౌర కేంద్ర ప్రజా సర్వీసులను తమ సర్కారు విస్తరిస్తోందన్నారు. గురువారం న్యూఢిల్లీలో జరిగిన >>2

## కెసిఆర్ కుటుంబానికి కాళేశ్వరం ఎటిఎం?

లక్షకోట్ల ప్రజాధనాన్ని కెసిఆర్ యధేచ్ఛగా ఖర్చు చేశారు..

7 మండలాల విలీనానికి ఒప్పుకొన్నది ఆయనే..

కేంద్రమంత్రి వ్యాఖ్యలు రికార్డుల నుంచి తొలగించాలని బిఆర్ఎస్ ఎంపి సురేష్‌రెడ్డి డిమాండ్

**ఇద్దరి మధ్య తీవ్రస్థాయి వాగ్వాదం.. చరిత్రను వక్రీకరిస్తున్న కిషన్: హరీష్‌రావు**



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్2:** రాజ్యసభలో కాళేశ్వరం ప్రాజెక్టుపై దుమారం చెలరేగింది. ఈ అంశంపై గురువారం సురేశ్‌రెడ్డి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సీఆర్ పాటిల్ వ్యాఖ్యలపై సురేశ్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. సీఆర్‌పాటిల్ తన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని స్పీకర్‌ను కోరారు. సురేశ్‌రెడ్డి వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. మేడిగడ్డ ప్రాజెక్టు పనికిరాకుండా పోయిందని నిపుణుల కమిటీ చెప్పిందని, కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ కుటుంబం ఒక ఏటీఎంగా వాడుకున్నదని విమర్శించారు. కనీసం ఇంజినీర్లను కూడా అడగకుండా కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారని ఆరోపించారు.లక్షకోట్ల ప్రజాధనాన్ని కేసీఆర్ ఇష్టమొచ్చినట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. కాలేశ్వరం వల్ల ఉగయోగం లేదని నివేదికలు చెప్పాయని తెలిపారు. కాళేశ్వరం ప్రజల డబ్బుతో కట్టారా? లేక కేసీఆర్ సొంత >>2

'సర్' అధికారులను నిర్బంధిస్తారా?

మమత సర్కార్‌పై సిజెఐ ఆగ్రహం

3

రోదసీయాత్రకు బయలుదేరిన వ్యోమగాములు

కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి ప్రయోగం

## అర్ధరాత్రి ఈదురు గాలులు!



అకాల వర్షంతో అల్లాడుతున్న రైతులు

పొట్టదశలో వరిపైరు..

కంకిదశలో మొక్కజొన్న

మరోనాలుగు రోజులు ఇదే వాతావరణం

**హైదరాబాద్, ఎప్రిల్ 2, ప్రభాతవార్త:** అన్నదాతలను అకాల వర్షాల భయం వెంటాడుతోంది. ఉదయం, పగలు ఎండకాస్తూ రాత్రిళ్లలో ఈదురుగాలులతో కురుస్తున్న వడగళ్ల వర్షాలకు పొట్ట దశలో ఉన్న వరి, కంకిముదిరే దశలో ఉన్న మొక్కజొన్న పంటలతోపాటు మామిడి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. మార్కెట్ యార్డులకు తీసుకొచ్చిన పసుపు తడిసిపోతోంది. వారం, పది రోజులుగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అర్ధరాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షాలు దంచికొడుతున్నాయి. దీంతో అర్ధరాత్రి విరుచుకుపడుతున్న అకాల వర్షానికి పంటలు అతలాకుతలమవుతున్నాయి. ఎన్నో ఆశలతో సాగు చేసిన పంటలు నిమిషాల వ్యవధిలో విరుచుకుపడుతున్న అకాల వర్షాలకు బలవుతున్నాయి. వరి, మొక్కజొన్న పంటలు నేలవాలుతుండగా మామిడికాయలు నేలరాలుతున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా వరి పంట పొట్ట దశలో ఉంది. ఈదురుగాలులతో కూడిన >>2





## రవివర్మ పెయింటింగ్ రూ.167 కోట్లు

**ముంబై, ఏప్రిల్ 2:** ప్రఖ్యాత చిత్రకారుడు రాజా రవివర్మ గీసిన బొమ్మ భారీ ధర పలికింది. యశోద, కృష్ణుడు ఉన్న ఫోటో సుమారు 167 కోట్లకు అమ్ముడుపోయింది. భారతీయ ఆర్ట్‌వర్క్ ఆ ధరకు అమ్ముడుపోవడం ఇదే మొదటిసారి. వేలంలో కొత్త వరల్డ్ రికార్డు స్థాపించినట్లు చెబుతున్నారు. రవివర్మ గీసిన ఆయిల్ పెయింటింగ్‌ను సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా స్థాపకుడు డాక్టర్ సైరస్ ఎస్ పూనావాలా సొంతం చేసుకున్నారు. ఏప్రిల్ ఒకటో తేదీన జరిగిన ఆర్ట్స్ స్ప్రింగ్ లైవ్ ఆక్షన్‌లో ఆ బొమ్మ అమ్ముడుపోయింది. 1890 దశకంలో రవివర్మ ఆ పెయింటింగ్ వేసినట్లు భావిస్తున్నారు. రవివర్మ ఆ సమయంలో తన కెరీర్‌లో అగ్రస్థానంలో ఉన్నారు. తల్లి యశోదమ్మతో కన్నయ్య ఉన్న ఆ ఫోటో ఆర్ట్స్ లవర్స్‌ను విశేషంగా ఆకర్షిస్తోంది. రవివర్మ వేసిన యశోద, కృష్ణుల ఫోటోను సొంతం చేసుకోవడం అద్భుతంగా భావిస్తున్నట్లు డాక్టర్ పూనావాలా తెలిపారు. ఇది జాతీయ సంపద అన్నారు. గతంలో భారతీయ చిత్రకారుడు ఎంఎఫ్ హుస్సేన్ వేసిన గ్రామ్ యాత్ర పెయింటింగ్ 118 కోట్లకు వేలంలో అమ్ముడుపోయిన విషయం తెలిసిందే.

## రెండో దశలో జిల్లాకో మండలంలో సమీకృత భూభారతి

### -మంత్రి పొంగులేటి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్2:** రాష్ట్రంలో ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను 45రోజుల పాటు పరిశీలించి తర్వాత అవసరమైన మార్పులు, చేర్పులతో జిల్లాకొక మండలంలో ప్రవేశపెడతామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. గురువారం నాడు రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండలంలోని మిఠాయిపల్లి గ్రామంలో జరిగిన గ్రామసభలో ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను మంత్రి పొంగులేటి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్బంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రెవెన్యూ శాఖలో విప్లవాత్మక సంస్కరణలు చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఈరోజున(గురువారం) ఈ అమనగల్ మండలంతోపాటు ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, నారాయణపేట జిల్లా కొస్గి మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

## ఎన్‌జిటిలో సర్కార్‌కు ఊరట

>> తెలిపారు. మెరుగైన జీవన విధానానికి కావాల్సిన ప్రమాణాలు, విద్య, వైద్య సదుపాయాలు కల్పించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. మూసీ పరివాహకంలో ఉన్న అందరికీ తగిన న్యాయం చేస్తామని శాసన మండలిలో ప్రకటించారు. రెచ్చగొట్టే వారి ఉచ్చులో పడవద్దని మూసీ ప్రాంత ప్రజలను కోరుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## కాళేశ్వరం ఎటిఎం?

>> డబ్బుతో కట్టారా అంటూ ప్రశ్నించారు. రూ.లక్ష కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని నిలదీశారు. కేసీఆర్‌ను జైల్లో పెడతానన్న రేవంత్‌రెడ్డి ఇప్పటివరకు ఏం చేశారని ప్రశ్నించారు. ఆనాడు 7 మండలాల విలీనానికి కేసీఆర్ ఒప్పుకున్నారని,దస్త్రాలు పట్టుకుని సోనియాగాంధీ ఇంటికి కెసిఆర్ వెళ్లారని పేర్కొన్నారు.ఏపీ అమరావతి రాజధానికి చట్టబద్ధత బిల్లు ఆమోదంపై గురువారం రాజ్యసభలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడారు. కాళేశ్వరం గురించి కేంద్రమంత్రి ఏకపక్షంగా వ్యాఖ్యలు చేశారని సురేశ్‌రెడ్డి తెలిపారు. రూ.లక్ష కోట్లు నదిలో కొట్టుకుపోయాయని కేంద్రమంత్రి మాట్లాడారని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే కేవలం ఒక్క డ్యామ్ మాత్రమే కాదని, ఒక్క డ్యామ్‌లో రెండు పిల్లర్లు మాత్రమే కుంగితే మొత్తం ప్రాజెక్టు వృథా అన్నట్లుగా మాట్లాడారని అన్నారు. తెలంగాణలో సాగు, తాగు నీరు సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఒక్క రూపాయి ఇవ్వకున్నా కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి వరి ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణను దేశంలోనే నంబర్ వన్ గా నిలిపిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. అలాంటి కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు కూతలు కూసిన కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే సభాహక్కుల ఉల్లంఘన నోటీసు ఇస్తామని హెచ్చరించారు.

హైదరాబాద్ నగరం ఏపీ వాళ్లతో పాటు ఎంతోమందికి గమ్యస్థానంగా ఉందని పేర్కొన్నారు. కాగా రాజ్యసభలో కిషన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు మాజీ మంత్రి,డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు కౌంటర్ ఇచ్చారు.తెలంగాణ ఉద్యమంలో రాజీనామా చేయక వెన్నుచూపి పారిపోయిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పార్లమెంట్ సాక్షి గా మరోసారి ద్రోహానికి పాల్పడ్డారని మండిపడ్డారు. రాజ్యసభలో కిషన్ రెడ్డి పచ్చి అబద్ధాలతో, చరిత్ర వక్రీకరణలతో తన లోపలి వికృతత్వాన్ని బయట పెట్టుకున్నారని ఆరోపించారు ప్రపంచంలోనే అతి పెద్ద బహుళ దశల ఎత్తిపోతల ప్రాజెక్టుగా కాళేశ్వరం నిర్మించడం అబద్ధమా? 148 మీటర్ల దిగువ ప్రాంతం నుంచి 618 మీటర్ల ఎత్తుకు నీటిని ఎత్తిపోయడం అబద్ధమా?.

మండుటెండల్లో సైతం కాళేశ్వరం ప్రాజెక్ట్ కాల్వల ద్వారా జలాలు రైతుల పొలాలకు చేరుతుండటం అబద్ధమా? ఏది అబద్ధం కిషన్ రెడ్డి? అంటు ప్రశ్నించారు. పంట పొలాల్లో పారుతున్న కాళేశ్వరం జలాలను చూపించేందుకు నేను సిద్ధం. వచ్చేందుకు మీకు దమ్ముందా? అంటూ సవాల్ విసిరారు.

## కుమార్తెకూ బాధ్యత

>> ఆశ్రయించింది. తన ఆస్తి పత్రాలను తిరిగి ఇవ్వాలని, సంక్షేమ రక్షణ కల్పించాలనే ఆదేశాలను అమలు చేయాలని కోరుతూ దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై జస్టిస్ బి. విజయసేన్‌రెడ్డి విచారణ చేశారు. ప్రస్తుతం తన కుమార్తెతో కలిసి నివసిస్తున్న ఆమె, తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల నిర్వహణ, సంక్షేమ చట్టం కింద డిసెంబర్ 2025లో జారీ చేసిన ఉత్తర్వును స్థానిక అధికారులు అమలు చేయడంలో విఫలమయ్యారని కోర్టుకు తెలిపారు. పోలీసు, పరిపాలనా సహాయం కోసం రెవెన్యూ డివిజనల్ అధికారి ఆదేశాలు జారీ చేసినప్పటికీ, తదనంతరం చేసిన విజ్ఞప్తులకు ఎటువంటి స్పందన రాలేదని ఆమె పేర్కొన్నారు. ఈ ఆరోపణలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం వివరణ సమర్పించాలని సూర్యాపేట అధికారులను ఆదేశించారు. ఈ విచారణ సందర్భంగా, వయోవృద్ధుల చట్టం కింద కోర్టుకు చేరుతున్న వివాదాల సంఖ్య పెరుగుతుండటంపై జస్టిస్ ఆందోళన వ్యక్తం చేశారు. తమ సొంత పిల్లలకు వ్యతిరేకంగా ఉపశమనం కోరుతూ వృద్ధ తల్లిదండ్రులు దాఖలు చేస్తున్న పిటిషన్లతో కోర్టు నిండిపోతోందని, అలాగే తమ ఆస్తుల నుండి పిల్లలను ఖాళీ చేయించాలని తల్లిదండ్రులు కోరుతున్న కేసుల సంఖ్య పెరుగుతుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. మారుతున్న కుటుంబ సంబంధాలను ప్రతిబింబించే దీనిని ఆయన ఒక తీవ్రమైన సామాజిక సమస్య గా అభివర్ణించారు. తదుపరి విచారణను ఏప్రిల్ 15కు వాయిదా వేసింది.

## ఎఐ నైపుణ్యం పెరగాలి

>> కర్మయోగి సాధనా వారోత్సవం 2026 ప్రారంభోత్సవాన్ని ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. ఉత్తరాది నుంచి దక్షిణాది వరకు యావత్ దేశంలోని అన్ని స్థాయుల సివిల్ సర్వెంట్లు పౌర కేంద్ర ప్రజా సర్వీసులనే అందిస్తున్నారని ఆయన తెలిపారు. నాగరిక్ దేవో భవ మంత్రంతోనే వారంతా ప్రజల విన్నపాలకు స్పందిస్తున్నారని, సహాయాన్ని అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతీ ప్రభుత్వ ఉద్యోగి పని సామర్థ్యాన్ని పెంచేందుకు కర్మయోగి సాధనా వారోత్సవం దోహదం చేస్తుందని మోదీ చెప్పారు. ప్రజా సర్వీసులను మరింత మెరుగ్గా మార్చడానికి, ప్రజలకు ఉపయోగకరంగా మల్చడానికి నిత్యం తమ ప్రభుత్వం శ్రమిస్తోందని వెల్లడించారు. గురువారం నుంచి 8వ తేదీ వరకూ ఈ కర్మయోగి వారోత్సవం జరుగుతుందన్నారు. నిరంతర అవగాహన, తర్ఫీదు ద్వారా ప్రభుత్వ ఉద్యోగుల్లో సామర్థ్యం పెంచుకోవడంతోపాటు విజ్ఞాన సముపార్జనకు కర్మయోగి వారోత్సవం దోహదంచేస్తుందని చెప్పారు.

## వారం - వర్జ్యం

03-04-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, రేవతి కార్తె
పాడ్యమి ఉ.8.44
చిత్త రా.7.27
వర్జ్యం : రా.1.33-రా.3.18
దు.ఉ.8.28-ఉ.9.17, 2) మ.12.35-మ.1.24
శుభసమయం:ఉ.9.40-10.10
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** సమయస్ఫూర్తితో నిర్ణయాలు తీసుకోగలుగుతారు. కారణం లేని చికాకు, అప్రశాంతత చోటుచేసుకుంటాయి.

**వృషభం:** కీలక సమయంలో కీలక నిర్ణయాలు కలిసివస్తాయి. పనులు నెమ్మదిగా పూర్తికాగలవు. వస్త్రలాభం.

**మిథునం:** గృహ నిర్మాణ యత్నాలలో తొందర పాటు వద్దు. జీవిత భాగస్వామి సాయం అందుకుంటారు. వాహనసౌఖ్యం.

**కర్కాటకం :** భూ వివాదాలు, కోర్టుకేసులు పరిష్కార దశకు చేరుకుంటాయి. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం లభిస్తుంది.

**సింహం:** వ్యాపారాలలో నిదానంగా వ్యవహరించడం మంచిది. స్నేహితులను కలుసుకుంటారు. ఉద్యోగస్తులకు అనుకూలం.

**కన్య :** ఉద్యోగులకు బదిలీ అయ్యే అవకాశం వుంది. వృత్తులలో ఉన్న వారికి మంచి అవకాశాలు వస్తాయి.ధనలాభం.

**తుల:** మీలో ఉన్న చిన్న లోపాన్ని పెద్దది చేసి మీ ప్రతిష్ఠను భంగ పరచాలనుకునే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది.

**వృశ్చికం:** చిన్న పనులు కూడా చేయలేని అభద్రతా భావం కలుగుతుంది. ఆత్మ స్థైర్యాన్ని కూడగట్టుకోండి.

**ధనుస్సు:** సంఘంలో కీలక స్థానాలలో ఉన్న వారు మీకు వెన్నుదన్నుగా నిలుస్తారు. వృత్తిలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు.

**మకరం:** ఎవరిని నమ్మాలో ఎవరిని నమ్మకూడదో తెలియని పరిస్థితి. భగవంతునిపై భారం వేస్తారు.వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.


**కుంభం:** పరిష్కారం లేని సమస్యలను కాలానికి వదిలివేస్తారు. దీర్ఘకాలిక సమస్యల నుండి బయటపడతారు.

**మీనం:** గృహ నిర్మాణ ఆలోచనలు ఫలిస్తాయి. కొత్త వ్యాపారాలు ప్రారంభిస్తారు. అతి కష్టం మీద మానసిక ఒత్తిడి నుండి బయటపడతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ప్రజారాజధానికి 'పెద్దలు' సై

>> ఆర్‌జెడి., బిఆర్ ఎస్. ఉద్ధవ్ శివసేన పార్టీల ఎంపీలు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తెలుగు ప్రజలందరికి ఇవాళ చరిత్రాత్మకమైన రోజు అని అన్నారు. "బిల్లు ప్రవేశపెట్టడాన్ని తెలుగు ప్రజలంతా గర్వంగా భావిస్తున్నారు. ప్రజా రాజధాని అమరావతి చరిత్రలో గుర్తుంటుంది. సంక్షోభాలను అవకాశాలుగా మలచుకోవడం మా నాయకుడు నేర్పించారు. ఆంధ్ర ప్రదేశ్ రాజధాని గురించి ప్రజలకు స్పష్టత ఇస్తున్నాం. రాజధాని కోసం ఉద్యమించిన రైతులు, మహిళలకు సరైన న్యాయం దక్కింది. విభజన సమయంలో ఒక రాష్ట్రానికి రాజధాని ఉంది, మరో రాష్ట్రానికి లేదు అని వెల్లడించారు. సభ్యులు అడ్డుకున్నారు. మహిళా రిజర్వేషన్లపై 30 ఏళ్ల పాటు ఏం చేశారని ఖర్గే ప్రశ్నించారు. బిల్లు ప్రవేశపెట్టడం రైతుల విజయమని రేణుకా చౌదరి అన్నారు. ఉద్యమ సమయంలో రైతులను, మహిళలను తీవ్రంగా హింసించారన్నారు. రాజధానిపై 12 ఏళ్లుగా అస్పష్టతగా ఉందని వెల్లడించా రు. అస్పష్టత వల్ల పెట్టుబడులు వెనక్కి వెళ్లాయని తెలిపారు. గత సీఎం మూడు రాజధానుల పేరుతో రాజధాని లేకుండా చేశారన్నారు. విభజన సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. దుగరాజపట్నం పోర్టు ఇస్తామని హామీ నెరవేర్చలేదని తెలిపారు. విభజన హామీలన్నీ అమలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ఇప్పటివరకు హామీలు ఎందుకు నెరవేర్చలేదో చెప్పాలని ప్రశ్నించారు. హామీలు అమలు చేయనందుకు పరిహారం ఇవ్వాలని కోరారు. 12 ఏళ్ల తర్వాత ఆస్తుల పంపకం పూర్తి కాలేదన్నారు. తెలుగు ప్రజలందరికి ఇవాళ చరిత్రాత్మకమైన రోజు అని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. బిల్లు ప్రవేశపెట్టడాన్ని తెలుగు ప్రజలంతా గర్వంగా భావిస్తున్నారు. ప్రజా రాజధాని అమరావతి చరిత్రలో గుర్తుంటుంది. సంక్షోభాలను అవకాశాలుగా మలచుకోవడం మా నాయకుడు నేర్పించారు. తెలుగు ప్రజలకు చంద్రబాబు ఎన్నో ఆకాంక్షలు, విజన్ కల్పించారు. సంక్షోభాలను అవకాశంగా మలుచుకొని ముందుకెళ్లారు. రాజధాని నిర్మాణానికి స్వచ్ఛందంగా ముందుకొచ్చి రైతులు భూములిచ్చారు. గత వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల నాటకమాడింది. రాజధాని కోసం ఉద్యమించిన రైతులను తీవ్రంగా హింసించారు. గర్భిణీలు అని కూడా చూడకుండా లాఠీలతో కొట్టించారు. అమరావతి మహిళలకు సాష్టాంగ నమస్కారం చేస్తున్నా. 2014లోనే అసెంబ్లీలో అమరావతిపై ఏకగ్రీవ తీర్మానం జరిగింది. చరిత్రలో ఏ రాజధాని చూసినా నదీ తీర ప్రాంతాల్లోనే విలసిల్లాయి. కృష్ణా నది తీరంలో అమరావతి నిర్మించాలని



గురువారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీని సత్కరించి జ్ఞాపికను అందజేస్తున్న ఏపి మంత్రి లోకేష్

ప్రభుత్వ నిర్ణయం. ఐకానిక్, వరల్డ్ క్లాస్ రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దాలని లక్ష్యం అని వెల్లడించారు. రాజధాని కోసం 29 వేలమంది రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారని బీజేపీ సభ్యుడు కె.లక్ష్మణ్ తెలిపారు. ఖిభవ్య రాజధాని సాకారం కోసం ఏపీ ప్రజలు కలలు కన్నారు. ప్రధాని మోదీ వికసిత్ భారత్ సంకల్పం తీసుకున్నారు. వికసిత్ భారత్ సాకారం కోసం వికసిత్ ఆంధ్ర నిర్మాణం ఆవశ్యకం. వికసిత్ ఆంధ్రప్రదేశ్ కోసం వికసిత్ రాజధాని అవసరం ఉంది. రాజధాని కోసం సుదీర్ఘంగా పోరాడిన మహిళలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా. అమరావతి బిల్లు ఆమోదం కోసం దేశం మొత్తం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఘన చరిత్ర ఉన్న తెలుగుజాతికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నా. అమరావతికి చట్టబద్ధత బిల్లుకు ఆప్ మద్దతు తెలిపింది. చంద్రబాబు విజనరీ లీడర్ అని సంజయ్‌సింగ్ తెలిపారు. ఇప్పుడు అధికారం చంద్రబాబు చేతుల్లోనే ఉంది. కేంద్రం నుంచి ఎంత రాబట్టుకుంటారో రాబట్టుకోండి. రాష్ట్రాలను మోసం చేసిన చరిత్ర బీజేపీది. బీజేపీ విషయంలో టీడీపీ జాగ్రత్తగా ఉండాలి. అనేక పార్టీలను మోసం చేసిన చరిత్ర బీజేపీది. కేంద్రం నుంచి నిధులు సాధించి అమరావతిని అభివృద్ధి చేయాలి.. అని స్పష్టం చేశారు. అమరావతికి చట్టబద్ధత బిల్లుకు మద్దతిస్తున్నామని ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఖిఅమరావతిని రాజధాని చేయడం ప్రజలందరికీ ఆమోదయోగ్యం. అమరావతికి పూర్తిగా మద్ధతు ఇస్తున్నా. అమరావతి ఏపీకి మధ్యలో ఉంటుంది.

అమరావతి పాలనాపరంగా సౌలభ్యంగా ఉంటుంది. అమరావతి అభివృద్ధికి చంద్రబాబు తీవ్రంగా కృషిచేస్తున్నారు. పవిత్ర భూమిలో రాజధాని తప్పనిసరిగా వర్ధిల్లుతుంది. అందరికీ ఆమోదయోగ్యమైన రాజధానిని అందరూ సమర్థించాలి అని తెలిపారు.

**రాజ్యసభ నుంచి వైఎస్సార్సీపీ వాకౌట్**

అమరావతికి చట్టబద్ధత బిల్లుపై వైఎస్సార్సీపీ రాజ్యసభ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ," రాజధాని రైతులకు ప్లాట్లు ఎప్పుడు ఇస్తుందనే దానిపై బిల్లులో స్పష్టత లేదు. రైతులకు ప్లాట్లు ఎప్పుడు ఇస్తారో కూడా చెప్పాలి. ఏపీకి ప్రత్యేక హోదా విషయంపై బిల్లులో ప్రస్తావన లేదు. ప్రత్యేక హోదాపై ప్రస్తుత అధికార పార్టీ ఎప్పుడో మరచిపోయింది. ప్రత్యేక హోదాపై వైఎస్సార్సీపీ మాత్రం నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటుంది. అమరావతి రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు. వేలకువేల ఎకరాలు తీసుకున్నారు, ఏమాత్రం అభివృద్ధి చేయలేదు. ఇప్పటివరకు ఒక్క ప్లాటు కూడా అమరావతి రైతులకు ఇవ్వలేదు. ఈ భూములు చాలదన్నట్లు కొత్తగా మళ్లీ భూముల సేకరణ మొదలుపెట్టారు. అమరావతి రైతుల వేదన చంద్రబాబుకు పట్టట్లేదు. రెండేళ్లలోనే సుమారు రూ.3 లక్షల కోట్లు అప్పు చేశారు." అని ఎంపీ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. అనంతరం అమరావతి చట్టబద్ధత బిల్లుపై చర్చ సమయంలోనే వైఎస్సార్సీపీ వాకౌట్ చేసింది. ఇక అమరావతి చట్టబద్ధత బిల్లుపై చర్చలో 11 పార్టీల ఎంపీలు మాట్లాడారు. చర్చలో 17 మంది సభ్యులు పాల్గొన్నారు. వైఎస్సార్సీపీ మినహా అమరావతికి 10 పార్టీలు మద్దతు తెలిపాయి. ఎలాంటి సవరణలు లేకుండా ఉభయ సభల్లో అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదం పొందింది. ఆంధ్రప్రదేశ్‌కు కొత్త రాజధానిగా అమరావతి ఏర్పాటైన నేపథ్యంలో రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. వికసిత్ భారత్ లక్ష్యాలను చేరడంతో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషించేలా అమరావతి అభివృద్ధి సాధించాలని ఆకాంక్షి ంచారు. బిల్లుకు సభ్యులందరి మద్దతు ఉంది కనుక పాస్ చేయాలని రాజ్యసభ ఛైర్మన్‌ను కోరారు. అనంతరం సభ్యులందరి సమ్మతితో అమరావతికి చట్టబద్ధత బిల్లుకు రాజ్యసభ ఛైర్మన్ సి.పి.రాధాక్రిష్ణన్ ఆమోదముద్ర వేశారు. సభ్యుల జై అమరావతి, జై భారత్ నినాదాలు సభలో మార్మోగాయి. వేంకటేశ్వరుడి ఆశీస్సులతో అమరావతి, ఆంధ్రప్రదేశ్ ప్రజలు వర్ధిల్లాలని ఉపరాష్ట్రపతి రాధాక్రిష్ణన్ ప్రార్థించారు.

లోక్‌సభ ఎంపీలు, ముఖ్య నేతలతో కలిసి గ్యాలరీలో కూర్చొని ఆసక్తిగా వీక్షి ంచారు. చర్చ ముగిసి బిల్లు ఆమోదం పొందగానే అంతా లేచి కరతాళధ్వనులతో హర్షం వ్యక్తం చేశారు.



గురువారం ఫ్యూచర్ సిటీలో నిర్మాణాల పురోగతిని పరిశీస్తున్న సిఎం రేవంత్

## ఫ్యూచర్ సిటీలో నిర్మాణాలను పరిశీలించిన సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్2:** కేరళం పర్యటన ముగించుకొని గురువారం సాయంత్రం హైదరాబాద్ వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీలో నిర్మాణాల పురోగతిని పరిశీలించారు. ఫ్యూచర్ సిటీ(ఎఫ్‌సిడిఏ) కార్యాలయం నిర్మాణం, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ నిర్మాణ పనులను సీఎం పరిశీలించారు. ఫ్యూచర్ సిటీ, స్కిల్ యూనివర్సిటీ కార్యాలయాల భవన సముదాయాలను త్వరగా పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు.

## అర్థరాత్రి ఈదురు గాలులు!

>> అకాల వర్షాలకు వరి నేలవాలుతోంది. ఇక అక్కడక్కడా కురుస్తున్న వడగళ్లు రైతులను కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. మొక్కజొన్న కొనుగోళ్లు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను ఆదేశించినా ఆ సంస్థ ఆలస్యంగా కొనుగోళ్లు చేపడుతోంది. దీంతో మొక్కజొన్నను మార్కెట్‌కు తీసుకొచ్చిన రైతులు రోజుల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో అకాల వర్షాలకు మార్కెట్ యార్డుల్లోనే మొక్కజొన్న రాశులు తడిసి ముద్దవుతున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలో రానున్న అయిదు రోజులపాటు అకాల వర్షాలు కురుస్తాయన్న హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరికలు రైతుల గుండెల్లో రైళ్లు పరుగెట్టిస్తున్నాయి.

**ఏడోతేదీ దాకా అకాల వర్షాలు...**

హైదరాబాద్ వాతావరణ కేంద్రం విడుదల చేసిన తాజా బులెటిన్ ప్రకారం శుక్రవారం రాష్ట్రంలో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది. ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు (గాలి వేగం గంటకు 3040 కి.మీ)తో కూడిన వర్షాలు కురిస్తాయి. అదేవిధంగా శనివారం రాష్ట్రంలో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు (గాలి వేగం గంటకు 3040 కి.మీ)తో కూడిన వర్షాలు ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్ జిల్లాలలో అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది. ఈ జిల్లాలకు హెచ్చరికలు జారీ అయ్యాయి.

## ఇరాన్‌లో అతిపెద్ద బ్రిడ్జి పేల్చివేత

>> ఇరాన్ ఆరోపించింది. ఇదిలా ఉంటే యుద్ధంలో తాము చేరే ప్రశ్నేలేదని స్పష్టంచేసిన బ్రిటన్ హార్ముజ్ అంతర్జాతీయ జలసంధిని పునరుద్ధరించేందుకు 35 దేశాలతో భేటీని ఏర్పాటుచేసింది. ప్రధాని కీర్‌స్టార్మర్ చొరవచూపించడంతో దేశాలుముందుకువచ్చాయి. ఈ చర్చల దేశాల్లో భారత్‌సైతం సంసిద్ధత వ్యక్తంచేయడం పట్ల బ్రిటన్‌ప్రధాని హర్షం ప్రకటించారు. ట్రంప్ రోజుకో మాట మాట్లాడుతున్నారని, యుద్ధాన్ని మూడు వారాల్లోపే ముగిస్తామని చెపుతుండటం వెనుక ఈలోపు ఇరాన్‌పై భూతల దాడులుచేయడమే లక్ష్యంగా కనిపిస్తోంది. ఇదిలా ఉంటే ఇజ్రాయెల్ కీలకనగరాలపై దాడులు కొనసాగిస్తూనే ఉంది. అగ్రరాజ్యం నియంతృత్వదాడితో దెబ్బతిన్న ఇరాన్‌ను పూర్తిస్థాయిలో పునర్‌నిర్మించుకుందామని ఇరాన్ సుప్రీం కమాండర్ మొజ్తబా ఆలిఖమైనీ ఇచ్చిన పిలుపుతో ఖమైనీ తాను సజీవంగానే ఉన్నానని అమెరికాకు తెలియజేసినట్లయింది. ఇదిలా ఉంటే ఇరాన్‌పై చేస్తున్న యుద్ధం అసమంజసమని ప్రపంచదేశాలు పేర్కొంటున్నాయి. బ్రెజిల్ అధ్యక్షుడు లులా డిసిల్వా అయితే ఇరాన్‌పై అబద్దాలను ప్రచారంచేసి అమెరికా యుద్ధంచేసిందని ఆరోపించారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోని అల్బనీస్ స్పందిస్తూ ఇరాన్‌పై దాడిచేయడానికి ఇక ఏం మిగిలి ఉందని ప్రశ్నించారు.

## ఇద్దరు ఐఎఎస్ అధికారుల బదలీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్2:** రాష్ట్రంలో ఇద్దరు సీనియర్ ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పర్యాటక క్రీడాశాఖలకు ప్రత్యేకప్రధాన కార్యదర్శులను నియమించింది. సీనియర్ ఐఏఎస్ అధికారిణి వాణి ప్రసాద్‌ను పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఐటీ,పరిశ్రమల శాఖలో సుదీర్ఘ అనుభవం ఉన్న జయేశ్ రంజన్‌ను క్రీడా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బదిలీ చేశారు. బదిలీ అయిన ఇద్దరు అధికారులు తక్షణమే తమ కొత్త బాధ్యతలను స్వీకరించనున్నారు.

## గ్యారంటీలు పక్కా

>> పదేళ్ల పాటు కేసీఆర్ తెలంగాణను పాలించారన్నారు. పినరయి కుటుంబ పాలన, అవినీతి, అసమర్థ పాలన విషయంలో పినరయి విజయన్, కేసీఆర్‌ల మధ్య అనేక పోలికలు ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. 2023లో తెలంగాణలో మాదిరి మార్పే ఈసారి కేరళంలో చోటుచేసుకుంటుందని సీఎం అన్నారు. పినరయి విజయ్ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దింపుతారని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. 'పో మోనే విజయా' వ్యాఖ్యపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... విజయన్ తమకు రాజకీయ ప్రత్యర్థి అని, మోదీలా మాట్లాడటం తనకు సాధ్యం కాదని, విమర్శించకుండా ఉండటం తన స్వభావం కాదని స్పష్టం చేశారు. అవినీతి నియంత్రణ, ఆదాయానికి గండిపెట్టే అంశాలను నియంత్రించడం, కేంద్ర పథకాల గరిష్ట వినియోగం, రాష్ట్రానికి రావలసిన నిధుల సాధన, తమ ప్రాధాన్య అంశాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కరుణ కాదని, అది ప్రజల హక్కు అనే విషయం ప్రజలకు తెలియజేస్తామని సీఎం తెలిపారు. యూడీఎఫ్ కార్మికుల కూటమి అని, కూటమిలో నిజాయితీగల నాయకులు ఉన్నారని సీఎం వ్యాఖ్యానించారు. కేరళంలో యూడీఎఫ్ గ్యారంటీలు అమలు సాధ్యమా అని కొందరు సందేహాలు వ్యక్తం చేస్తున్నారని, దానికి సమాధానం తెలంగాణ రాష్ట్రమే అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి క్యాబినెట్ సమావేశం నుంచే గ్యారంటీలను విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. 25 లక్షల రైతు కుటుంబాలకు చెందిన రూ.21 వేల కోట్ల రుణాలను తాము మాఫీ చేశామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. సాగు చేసుకునే రైతులకు ఎకరాకు రూ.12 వేలు చొప్పున ఏడాదికి రూ.18 వేల కోట్లు రైతు భరోసా కింద అందజేస్తున్నామని సీఎం తెలిపారు. 67,173 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, వివిధ శాఖల్లో నియామకాలు పూర్తి చేయడంతో పాటు ప్రజల సమక్షంలో ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశామని సీఎం వివరించారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని, 10 వేల బస్సులు, 50వేల సిబ్బందితో ఉన్న ఆర్టీసీని నష్టాల నుంచి లాభాల్లోకి తీసుకువచ్చామని సీఎం తెలిపారు. ఈకార్యక్రమంలో కేపీసీసీ ప్రెసిడెంట్ సన్నీ జోసెఫ్, కేరళ సీఎల్పీ నేత వి.డి.సతీషన్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి దీప్ దాస్ మున్షీ, యూడీఎఫ్ కన్వీనర్ ఆదూర్ ప్రకాష్, ఐయూఎంఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి పి.కె.కున్హాలికుట్టి తదితరులు పాల్గొన్నారు.

## వడగాడ్పులు పదిరోజులే!

>> స్థాయి కంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉందని పేర్కొంది. ఫలితంగా, పగటిపూట వాతావరణ పరిస్థితులు మితంగా ఉంటాయని భావిస్తున్నప్పటికీ, రాత్రులు మాత్రం కొంత ఉక్కపోతగా లేదా తేమగా అనిపించవచ్చని వెల్లడించింది. రాష్ట్రంలోని నిర్దిష్ట వాతావరణ పరిస్థితులను విశ్లేషిస్తూ, ఏప్రిల్, జూన్ కాలంలో తెలంగాణలోని చాలా ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిలోనే ఉంటాయని తెలిపింది అయితే, తూర్పు జిల్లాలైన మూడింటిలో మాత్రం ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే కొంచెం ఎక్కువగా ఉంటాయని అంచనా వేసింది. ఏప్రిల్ నెలలో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిలోనే ఉంటాయని, అయితే కొన్ని పశ్చిమ జిల్లాల్లో మాత్రం సాధారణ స్థాయి కంటే ఒకింత తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. కనిష్ట ఉష్ణోగ్రతల విషయానికి వస్తే, మధ్య తెలంగాణ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే కొంచెం తక్కువగా ఉంటాయని అంచనా వేసింది. ఇతర ప్రాంతాల్లో మాత్రం సాధారణ స్థాయి నుండి సాధారణ స్థాయి కంటే కొంచెం ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.

# క్రైస్తవ సోదరులకు సీఎం రేవంత్‌రెడ్డి గుడ్‌ఫ్రైడే శుభాకాంక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 2:** తెలంగాణలోని క్రైస్తవ సోదరులకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గుడ్ ఫ్రైడే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యేసు క్రీస్తు త్యాగం, ధైర్యం సీఎం గుర్తు చేసుకున్నారు. యేసు ప్రభు ప్రేమ, కృప కటాక్షాలు ఎల్లప్పుడూ ప్రజలపై ఉండాలని అభిలాషించారు. శాంతి,కరుణ సందేశాలతో పాటు క్రీస్తు నేర్పిన సేవ, దయ, సోదరభావం ఇప్పటికీ ఎప్పటికీ మానవాళికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రపంచానికి ప్రేమతత్వం బోధించిన దయామయుడు, సిలువపై యేసుక్రీస్తు త్యాగం మహోన్నతమైనదని ‘గుడ్ ఫ్రైడే సందేశం సందర్భంగా సీఎం వెల్లడించారు. యేసు క్రీస్తు త్యాగాలకు జ్ఞాపకంగా జరుపుకునే గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవ సోదర సోదరీమణులందరూ ఘనంగా జరుపుకోవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షి ంచారు.




# గనులపై పర్యావరణ రక్షణ కోసం కేంద్ర బృందం పరిశీలన

## రామకృష్ణాపూర్‌లో పర్యటన

**క్యాతన్‌పల్లి, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:** మంచిర్యాల జిల్లా మందమర్రి ఏరియా రామకృష్ణాపూర్‌లో చేపడుతున్న పర్యావరణ పరిరక్షణ చర్యలను కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ (మోఫ్) ఉన్నతాధికారుల బృందం గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించింది. కేంద్ర పర్యావరణ శాఖ సలహాదారు తరుణ్, పర్యావరణ అధికారుల బృందం, సింగరేణి కార్పొరేట్ ఎన్విరాన్మెంట్ జనరల్ మేనేజర్ సైదులు, మందమర్రి ఏరియా జి.ఎం రాధాకృష్ణలతో కలిసి వివిధ ప్రాంతాలను సందర్శించారు. రామకృష్ణాపూర్ ఓపెన్ కాస్ట్ గని పరిసర ప్రాంతాలను అధికారులు సందర్శించి, అక్కడ అమలు చేస్తున్న కాలుష్య నివారణ చర్యలను అడిగి తెలుసుకున్నారు. హరితహారం ప్లాంటేషన్, ట్రావెలింగ్ రోడ్ల వెంబడి చేపట్టిన ఎవెన్యూ ప్లాంటేషన్, గనుల పరిసరాల్లో పెరిగిన పచ్చదనాన్ని చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఏరియాలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలు, గనుల వద్ద ఉన్న ఫిల్టర్ బెడ్లను తనిఖీ చేశారు. నీటి శుద్ధి ప్రక్రియ పునర్వినియోగంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఎస్.డి.టి.సి కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో, మందమర్రి ఏరియాలో పర్యావరణ సమతుల్యత కోసం తీసుకుంటున్న చర్యలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పర్యావరణ నిబంధనల అమలులో యాజమాన్యం ప్రదర్శిస్తున్న చొరవను కేంద్ర అధికారులు అభినందించారు. ఈ పర్యటనలో ఎస్.ఓ. టు జి.ఎం జి.ఎల్. ప్రసాద్, రామకృష్ణాపూర్ ఉపరితల గని మేనేజర్ పంకజ్, ఎన్విరాన్మెంట్ అధికారి వెంకటరెడ్డి, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.



# రేపు పుదుచ్చేరిలో కాంగ్రెస్ భారీ బహిరంగ సభ

## ఖర్గే, భట్టి, పొన్నం ముఖ్య వక్తలు

**హైదరాబాద్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:** కేంద్రపాలిత ప్రాంతమైన పుదిచ్చేరి ఓర్లిన్‌పేట్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఈనెల 4న కాంగ్రెస్ భారీ బహిరంగసభను ఏర్పాటు చేసింది. గురువారం తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రవాణాశాఖ మంత్రి పొన్నంప్రభాకర్‌లు ఆ సభకు చేయాల్సి న జనసమీకరణ అంశంపై స్థానిక కాంగ్రెస్ నాయకులతో సమావేవమైనారు. ఈ సమావేశంలో ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నంలు ముఖ్యవక్తలుగాపాల్గొంటారు. పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో స్థానిక ఎన్నికల ప్రచారం, సభల నిర్వహణ, ఎన్నికల వ్యూహం పై స్థానిక నేతలతో కలిసి గురువారం చర్చించారు. భారీ బహిరంగ సభ జరగనున్న నేపథ్యంలో ఆ ఏర్పాట్లను సైతం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మంత్రి పొన్నం ప్రభాకర్ అక్కడే ఉండి పరిశీలిస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మోత్కుపల్లి నర్సింహులు

# జనాభా దామాషా ప్రకారం మాదిగలకు సీట్లు కేటాయించాలి

**హైదరాబాద్ (సైఫాబాద్), ఏప్రిల్ 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ, రాజ్యసభ సీట్లలో మాదిగలకు ఒక సీటు కూడా కేటాయించకుండా అన్యాయం చేసిందని మాజీ మంత్రి, మాదిగ మహాశక్తి సంఘం అధినేత మోత్కుపల్లి నర్సింహులు ఆరోపించారు. ఒక్కొక్కరి ఇంట్లో రెండు, మూడు పదవులు పొందుతున్నారని, మాదిగలకు జరుగుతున్న అన్యాయాలపై సిఎం రేవంత్‌రెడ్డిని కలిసి మాట్లాడేందుకు ప్రయత్నించినా అవకాశం లభించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాదిగలు రాజకీయ శక్తిగా ఎదిగేందుకు ‘మాదిగ మహాశక్తి సంఘం’ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మాదిగలు తమ ఓట్లను మాదిగలకే వేయాలని ఆయన సూచించారు. మాదిగలకు న్యాయం జరిగేలా ప్రభుత్వంపై వత్తిడీ తీసుకువస్తానని, తాను కా ంగ్రెస్ పార్టీలోనే ఉన్నానని స్పష్టం చేశారు. ఈ నెల 5వ తేదీన మాజీ ఉప ప్రధాని డా.బాబుజగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ప్రెస్‌క్లబ్‌లో సంఘం జెండా ఆవిష్కరణ జరుగుతుందని, ప్రతి మాదిగ వారి ఇంటిపై జెండాను ఎగరవేయాలని పిలుపునిచ్చారు. జనాభా దామాషా ప్రకారం మాదిగలకు అసెంబ్లీ, పార్లమెంట్, శాసన మండలిలలో తగినన్ని సీట్లు కేటాయించాలని, మాదిగ స్త్రీలకు కూడా ప్రాధాన్యత కల్పించాలని, వర్గీకరణ కోసం ప్రాణాలను అర్పించిన అమరుల కుటుంబాలకు ఒక్కొక్కరికి కోటి రూపాయలు ఆర్థిక సహాయం అందించాలని ఆయన కోరారు.

# హైదరాబాద్‌లో వైభవంగా హనుమాన్ శోభయాత్ర

## గౌలిగూడ నుంచి తాడ్‌బండ్ వరకు భారీ ర్యాలీ

## జైశ్రీరామ్ నినాదాలతో పులకించిన జంటనగరాలు



**హైదరాబాద్ (గోషామహల్), ఏప్రిల్ 2, ప్రభాతవార్త:** హనుమాన్ జయంతి శోభయాత్ర కన్నుల పండువగా ప్రారంభమైంది. వేలాదిమంది భక్తులు జైశ్రీరామ్.. జైజైశ్రీరామ్ నినాదాలతో శోభయా త్ర ప్రారంభించారు. గౌలిగూడ రామమందిరంలో ముందుగా గోవింద్‌గిరిజీ స్వామి అంజ నేయ స్వామికి ప్రత్యేకపూజలు చేసి శోభయాత్రను ప్రారంభించారు. అంతకు ముందు నగర పోలీసు కమిషనర్ విసి సజ్జనార్ గౌలిగూడ రామ మందిరానికి శోభయాత్రకు జంటనగరాల నుంచి వేలాదిమంది హనుమాన్ భక్తులు ర్యాలీని పరిశీలించారు. జంట నగరాలకు చెందిన హిందీనగర్, ఆర్యనగర్, విద్యానగర్, మహంకాళినగర్, అణుశక్తి, విశ్వకర్మనగర్, వాయు పుత్రనగర్ జిల్లాలతోపాటు పాతబస్తీలోని దూల్‌పేట్, బేగంబజార్, మంగళహాట్, పురానాపూల్, షాలిబండ, చార్మినార్, బహుదూర్‌పురా, అత్తాపూర్‌లతో పాటు జాంబాగ్, గన్‌ఫౌండ్రి, సుల్తాన్‌బజార్, బషీర్‌బాగ్ తదితర ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు బైక్ ర్యాలీలు నిర్వహించారు. పలు ప్రాంతాలనుంచి వచ్చిన ర్యాలీలతో గురువారం మధ్యాహ ్నం 12 గంటల 20 నిమిషాల సమయంలో గౌలిగూడ రామమందిరం ప్రధాన రహదారి నుంచి శోభయాత్ర ప్రత్యేక వాహనాన్ని ఆలకరించి హనుమాన్ విగ్రహాన్ని పెట్టి ప్రారంభమైంది. పుత్లీబౌలి చౌరస్తా, ఆంధ్రబ్యాంకు చౌరస్తా మీదుగా కాచిగూడ, నారాయణగూడ, ముషీరాబాద్, చిక్కడపల్లి నుంచి తాడ్‌బంద్ హనుమాన్ ఆలయానికి తరలివెళ్లింది. నగర కమిషనర్ వి.సి సజ్జనార్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.

**ప్రపంచమంతా జైశ్రీరామ్ నినాదమే: గోవింద్‌గిరిజీ మహారాజ్**

**హైదరాబాద్ (బేగంబజార్):** హనుమాన్ జయంతి శోభయాత్రకు భాగ్యనగర్‌కు విచ్చేసిన గోవింద్‌గిరిజీ మహారాజ్ ఆంజనేయస్వామి అనుగ్రహం తో ధర్మపరిరక్షణ జరుగుతుందని అన్నారు. ఆంధ్రబ్యాంకు చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన స్వాగత వేదికపై నుంచి హన్‌మాన్ భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ హిందువులకు ఉజ్వల భవిష్యత్తు రోజురోజుకు బలపడుతున్న హిందు సంఘటనపై ఆనందం వ్యక్తం చేశారు. తర్వాత ఈ దేశం సుభిక్షంగా ఉండాలంటే రామరాజ్యం సాధించాలని అందుకు అంజ నేయస్వామి ఆశీస్సులు తప్పక అవసరమన్నారు. హిందు ధర్మ పరిరక్షణ కోసం నేటి యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కాగా అనేకచోట్ల భక్తులకు అన్నప్రసాదాలు, మజ్జిగ అల్పహారాన్ని అందచేశారు.

# ‘సర్’ అధికారులను నిర్బంధిస్తారా?

## ‘సుప్రీం’ అధికారానికే ఇది సవాల్

## మమత సర్కార్‌పై సిజెఐ సూర్యకాంత్ ఆగ్రహం

## సిఎస్, డిజిపిలకు నోటీసులు

## ఘటనపై సిబిఐ లేదా ఎన్‌ఐఎతో విచారణ జరపండి

## పాలన నా చేతుల్లో లేదు.. ఆ ఉదంతం తెలియదు: సిఎం మమత





**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:** ఓటర్ల జాబితా నుంచి తమ పేర్లను తొలగించారని ఆగ్రహించిన ప్రజలు పశ్చిమ బెంగాల్‌లోని మాల్దాలో ‘సర్’ విధుల్లో ఉన్న ఏడుగురు న్యాయాధికారులను గంటల తరబడి బందీలుగా పట్టుకున్న ఘటనపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. ఇది కేవలం న్యాయాధికారులను భయపెట్టే ప్రయత్నమే కాదు, సుప్రీంకోర్టు అధికారానికే సవాల్ విసిరేలా ఉందని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సిబిఐ లేదా ఎన్‌ఐఏతో విచారణ జరిపించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. దర్యాప్తును తామే పర్యవేక్షిస్తామని స్పష్టం చేసింది.

వివరాల్లోకి వెళితే.. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా తమ పేర్లను తొలగించారంటూ ఆగ్రహించిన కొందరు నిరసనకారులు.. మాల్దాలో ముగ్గురు మహిళలు సహా ఏడుగురు జ్యుడీషియల్ అధికారులను బుధవారం మధ్యాహ్నం ఘెరావ్ చేశారు. దాదాపు 9 గంటల పాటు వారిని నిర్బంధించారు. అర్ధరాత్రి 1 గంట సమయంలో భారీ పోలీస్, పారామిలటరీ బలగాలు రంగంలోకి దిగి వారిని సురక్షితంగా విడిపించాయి. అధికారులను అక్కడి నుంచి తరలిస్తుండగా వారి వాహనాలపై రాళ్లు, కర్రలతో దాడులు జరిగాయి. ఈ ఘటనలో ఓ కారు అద్దాలు ధ్వంసమయ్యాయి.

ఈ ఘటనను సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ‘సాయంత్రం 5 గంటలకు అధికారులను నిర్బంధిస్తే, రాత్రి 11 గంటల వరకు వారికి సహాయం అందలేదు. ఇది సాధారణ ఘటన కాదు. న్యాయాధికారుల మనో ధైర్యాన్ని దెబ్బతీసి, కొనసాగుతున్న ప్రక్రియను అడ్డుకోవడానికి ఉద్దేశపూర్వకంగా, ప్రణాళికాబద్ధంగా చేసిన దాడిలా కనిపిస్తోంది’ అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. కోలకత్తా హైకోర్టు చీఫ్ జస్టిస్ స్వయంగా డిజిపి, హోం సెక్రటరీకి ఫోన్ చేయాల్సి వచ్చిందని ఆయన గుర్తుచేశారు. ఈ ఘటనలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తన విధిని నిర్వర్తించడంలో పూర్తిగా విఫలమైందని కోర్టు అభిప్రాయపడింది. అధికారులకు భద్రత కల్పించడంలో ఎందుకు విఫలమయ్యారో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఇకపై అభ్యంతరాల స్వీకరణ సమయంలో ఇద్దరు, ముగ్గురి కంటే ఎక్కువ మందిని అనుమతించరాదని, విచారణ కేంద్రాల వద్ద ఐదుగురి కంటే ఎక్కువ మంది గుమికూడరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ సమయంలో బెంగాల్ అడ్వొకేట్ జనరల్ జోక్యం చేసుకోగా, సిజెఐ తీవ్రంగా స్పందించారు. “దురదృష్టవశాత్తు మీ రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ రాజకీయ భాషలోనే మాట్లాడతారు. దేశంలోనే అత్యంత ధ్రువీకరించబడిన రాష్ట్రం మీది. అర్ధరాత్రి 2 గంటల వరకు నేనే స్వయంగా పరిస్థితిని పర్యవేక్షించాను. ఆ దుండగులు ఎవరో మాకు తెలియదనుకుంటున్నారా? ఇది చాలా దురదృష్టకరం’ అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. న్యాయవ్యవస్థపై దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

**ఆ అధికారుల నిర్బంధం తెలియదు.. పాలన నా చేతుల్లో లేదు: మమతాబెనర్జీ**

మాల్దా జిల్లాలో ‘సర్’ విధుల్లో ఉన్న ఏడుగురు జుడీషియల్ అధికారులను నిర్బంధించిన విషయం తనకు తెలియదని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తెలిపారు. సాగర్‌దిఘిలో నిర్వహించిన ఎన్నికల సభలో ఆమె మాట్లాడుతూ, అధికారుల నిర్బంధం తనకు తెలియదని, ప్రస్తుతం పాలన తన చేతుల్లో లేదని స్పష్టం చేశారు. అధికారుల నిర్బంధానికి బాధ్యులు ఎవరో తనకు తెలియదని ఆమె స్పష్టం చేశారు. ఈ విషయమై తనకు ఎవరూ సమాచారం కూడా ఇవ్వలేదని చెప్పారు. పరిపాలన తన చేతుల్లో లేదని, శాంతిభద్రతలను ఎన్నికల సంఘం నియంత్రిస్తోందని తెలిపారు. వారంతా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మాట వింటున్నారని అన్నారు. అధికారులను కూడా కేంద్రం మార్చిందని ఆరోపించారు. తన అధికారాలన్నీ ఇసి చేతిలోకి వెళ్లాయని అన్నారు.

# రోదసీయాత్రకు బయలుదేరిన వ్యోమగాములు

## కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి ఆర్టిమిస్ ప్రయోగం

**ఫ్లోరిడా, ఏప్రిల్ 2:** ఆర్టెమిస్2 వ్యోమనౌకను నాసా గురువారం ప్రయోగించింది. సుమారు 50 ఏళ్ల తర్వాత మళ్లీ చంద్రుడి వద్దకు వ్యోమగాముల్ని నాసా పంపుతోంది. చరిత్రాత్మకమైన ఆ ట్రిప్‌లో నలుగురు వ్యోమగాములు ఉన్నారు. పది రోజుల పాటు రోదసిలో ఆ ఆస్ట్రోనాట్స్ ప్రయాణం చేస్తారు. ఫ్లోరిడాలోని కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి నింగిలోకి రాకెట్ ఎగిరింది. రీడ్ వైజ్‌మాన్, విక్టర్ గ్లోవర్, క్రిస్టినా కోచ్‌తో పాటు జెర్మీ హాన్సెన్ ఆ మూన్ రాకెట్‌లో ఉన్నారు.

పది రోజుల జర్నీలో భాగంగా ఆస్ట్రోనాట్స్.. చంద్రుడిని చుట్టి వస్తారు. జాబిలిని సర్కిల్ వేసిన తర్వాత మళ్లీ భూమి పైకి వ్యో మగాములు రాను న్నారు. ఓరియన్ క్యాప్సూల్‌లో వాళ్లు ల్యాండ్ అవుతారు. 1972లో చేపట్టిన అపోలో 17 మిషన్ తర్వాత లో ఎర్త్ ఆర్బిట్‌లో చేపట్టిన మొదటి మిసన్ ఇదే కావడం గమనార్హం. ఏప్రిల్



ఆరవ తేదీన ఓరియన్ క్యాప్సూల్.. చంద్రుడి చుట్టూ తిరగనున్నది.

చరిత్రలో తొలిసారి ఆస్ట్రోనాట్స్ భూమికి దూరంగా ప్రయాణం చేయనున్నారు. గతంలో అపోలో 13 మిషన్‌లో భాగంగా ఆస్ట్రోనాట్స్ 400,171 కిలోమీటర్ల దూరం ప్రయాణించారు. అయితే ప్రస్తుతం ఆర్టెమిస్ 2లో వెళ్తున్న వ్యోమగాములు ఆ దూరాన్ని బ్రేక్ చేయనున్నారు.

# కేరళంలో బిజెపికి మద్దతు పెరుగుతోంది

## వచ్చేది కూడా మా ప్రభుత్వమే: ప్రధాని మోడీ



**తిరువనంతపురం, ఏప్రిల్ 2:** కేరళలో బీజేపీకి మద్దతు పెరుగుతుందని తిరువనంతపురం స్థానిక సంస్థల ఎన్నికల్లో సాధించిన విజయం ఇందుకు నిదర్శన మన్నారు ప్రధాని నరేంద్ర మోడీ. ఈ సారి కేరళ కేవలం కొత్త ప్రభుత్వాన్నే కాకుండా, కొత్త వ్యవస్థను కూడా ఎన్నుకుంటోందని స్పష్టమవుతోందని అన్నా రు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గురువారం కేరళలోని బీజేపీ బూత్ కార్యకర్తలతో వర్చువల్‌గా సమావేశమై ప్రసంగించారు. ఈ ఎన్నికల్లో బీజేపీ ఎన్‌డీఏకు మద్దతు పెరుగుతోంది. తిరువనంతపురం ఒక కొత్త ఒరవడిని సృష్టించింది. ఇప్పటివరకు ఎలాంటి దుష్పరిపాలన జరిగినా, అధికారాన్ని పంచుకోవచ్చని వామపక్ష, కాంగ్రెస్ పార్టీలు రెండూ భావించేవి. ఆ భావనను తిరువనంతపురం బద్దలుకొట్టింది. దీని ఫలితంగానే యూడీఎఫ్, ఎల్‌డీఎఫ్ ఇప్పుడు ఒకరిపై ఒకరు కాకుండా బీజేపీపైనే తమ దాడులను కేంద్రీకరిస్తున్నాయి. యూడీఎఫ్, ఎల్‌డీఎఫ్‌ల దోపిడీలతో ప్రజలు విసిగిపోయారని ఆయన అన్నారు. ప్రధాని మోడీ కేరళ బ్యాటర్ సంజు శాంసన్‌ను ప్రస్తావించారు. సంజు శాంసన్ ప్రదర్శనల్లో మనం దీనిని తరచుగా చూస్తుంటాం. ప్రపంచ కప్ సమయంలో, టోర్నమెంట్ కీలకమైన నాకౌట్ దశకు చేరుకున్నప్పుడు అతడి ప్రదర్శన పతాక స్థాయికి చేరింది. ఆరంభం నుంచి ముగింపు వరకు అతడి ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం మరింత బలపడ్డాయి. ఇవి ఒక నిజమైన క్రీడాకారుడి లక్షణాలు. ఒక గొప్ప ఆటగాడు తన జట్టుకు అత్యంత అవసరమైనప్పుడు ఎల్లప్పుడూ రాణిస్తాడు. ఈ సమయంలోనే మీ అంకితభావం అత్యంత ముఖ్యం. విజయాన్ని సాధించడానికి మీరు అదనపు గంటలు పనిచేయాల్సి రావచ్చని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు.

# డోర్నకల్-గద్వాల కొత్త రైల్వేలైన్ కోసం పాదయాత్ర చేస్తా

## నాగర్‌కర్నూల్ వెనకబడ్డ ప్రాంతం: ఎంపి మల్లు రవి

**హైదరాబాద్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:** డోర్నకల్ - గద్వాల కొత్త రైల్వే లైన్ కోసం పాదయాత్ర చేస్తానని నాగర్‌కర్నూల్ ఎంపి మల్లు రవి ప్రకటించారు. గురువారం ఢిల్లీలో తెలంగాణభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ నాగర్ కర్నూల్ వెనకబడ్డ ప్రాంతం అని, రైల్వే నెట్‌వర్క్ ఎంతో అవసరం ఉందని వ్యాఖ్యానించారు. కల్వకుర్తి- మాచర్ల రైల్వే లైన్ ఏర్పాటు చేస్తే రెండు తెలుగు రాష్ట్రాలకు ఉపయోగంగా ఉంటుందని వివరించారు.

నేను మూడోసారి ఎంపి అయిన తర్వాత డోర్నకల్ నుంచి గద్వాల వరకు కొత్త రైల్వే లైన్ గురించి ప్రతి పార్లమెంట్ సెషన్‌లో మాట్లాడుతూనే ఉన్నాను, రైల్వే మంత్రికి విజ్ఞప్తులు చేస్తూనే ఉన్నాను మన ముఖ్యమంత్రి ద్వారా రైల్వే మంత్రికి లేఖ రాయించా ఇలా అనేకసార్లు జరిగాయనీ తెలిపారు. ఇటీవల కూడా రైల్వే మంత్రిని కూడా వ్యక్తిగతంగాకలిసి డోర్నకల్ గద్వాల్ రైల్వే లైన్ నాగర్ కర్నూలు జిల్లాకి లైఫ్ లైన్ లాంటిదని వివరించానని ఆయన తెలిపారు. ఈ లైన్ రావడం వల్ల నాగర్ కర్నూల్ పార్లమెంటు రైల్వే నెట్వర్క్‌తో కనెక్ట్ అవుతుందనీ, అభివృద్ధి చెందుతుందనీ ఈ లైన్ నాగర్ కర్నూల్ పార్లమెంట్‌లోని కల్వకుర్తికి వచ్చి ఆ తర్వాత వనపర్తి నుంచి గద్వాలకి కనెక్ట్ అవుతుందని ఆయన రైలుమార్గం తీరును వివరించారు. ఇప్పుడు ఇవాళ కూడా రైల్వే బోర్డు దగ్గరికి వెళ్ళి, రైల్వే బోర్డ్ డైరెక్టర్ అభిషేక్‌ను కలిశాను ఈ రైల్వే లైన్ కోసం సర్వే చేసిన మ్యాప్ ని, సౌత్ సెంట్రల్ రైల్వే రైల్వే బోర్డు పంపించిన డిపిఆర్‌ను తీసుకున్నానని ఆయన తెలిపారని చెప్పారు. వారం, పది రోజుల్లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ట్రాఫిక్) ఇంకా మిగిలిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్స్ అందరూ మీటింగ్ పెట్టి పూర్తిస్థాయి డిపిఆర్ సిద్ధం చేసి కేబినెట్‌కు పంపించే ప్రక్రియను మొదలు పెడతామని రైల్వే బోర్డు డైరెక్టర్ చెప్పారు.

రైల్వే శాఖ మంత్రి, డైరెక్టర్, చైర్మన్ అందరితోనూ ఈ రైల్వే లైన్ ని బ్యాక్వర్డ్ ఏరియా డెవలప్మెంట్ రాయల్ ప్లాంట్ కింద తీసుకోవాలని జనరల్ రాయల్ ప్లాన్ కింద తీసుకుంటే మళ్లీ దానికి రెవెన్యూ రిటర్న్ లేవనే ఇబ్బందులు వస్తాయనీ విన్నపం చేశానని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం రూ. 2.93 లక్షల కోట్లు బడ్జెట్ రైల్వే శాఖకు వచ్చింది. అందులో ఈ ప్రాజెక్టుకు కూడా బడ్జెట్ మంజూరు చేసి పనులు ఈ ఏడాదే మొదలు పెట్టాలనేదే డిమాండ్ అని ఆయన చెప్పారు.

కల్వకుర్తి నుంచి ఆంధ్రప్రదేశ్ లోని మాచర్ల వరకు మరో లైన్ ఏర్పాటు చేయాలని కోరానని తెలిపారు. ఇది రెండు రాష్ట్రాలను కలుపుతుందని తెలిపారు. స్వాతంత్రం వచ్చిన తర్వాత ఎన్నో రైల్వే లైన్లు ఏర్పాటు చేశారు. కానీ అత్యంత వెనుకబడిన ప్రాంతంగా ఉన్న నాగర్కర్నూల్ జిల్లాకు మాత్రం రైల్వే లైన్ వేయలేదనీ ఈరోజు జీరో అవర్‌లో కూడా లోక్‌సభలో మాట్లాడినాని ఆయన తెలిపారు..

# రాజకీయ అవసరాల కోసం ఆంధ్రకు విభజన హామీలు అమలు

## రాజ్యసభలో ఎంపి రేణుకా చౌదరి

**హైదరాబాద్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:** రాజకీయ అవసరాలకోసం ఆంధ్రప్రదేశ్‌కు విభజన హామిలు అమలుచేస్తున్నారని రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి ఆరోపించారు. తెలంగాణకు ఇచ్చిన హామిలను కేంద్రం విస్మరించిందని రేణు కాచౌదరి ఆగ్రహం వ్యక్తంచేశారు. రాజ్యసభలో కేంద్రమంత్రి నిత్యానందరాయ్ ఆంధ్ర రాజధాని చట్టబద్దత బిల్లును ప్రవేశపెట్టగా గురువారం రేణుకాచౌదరి అమరావతికి మద్దతుగా మాట్లాడారు. కాంగ్రెస్‌పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతోందని స్పష్టం చేశారు. 12 ఏళ్ళతరువాత ఈ బిల్లు తెరపైకి మళ్లీ రావడం బాధకరం అని ఆవేదన చెందారు.

# ఢిల్లీ కోర్టు జడ్జి తీర్పులో 29 అక్షరాల పదం

## నెట్టింట వైరల్ అయిన ‘ఫ్లాక్సినాసిని హిలపిలఫికేషన్’



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:** ఢిల్లీ కోర్టు జడ్జి గురువారం ఓ కేసు తీర్పులో ఏకంగా 29 అక్షరాల పొడవైన పదాన్ని ఉపయోగించారు. ఈ పదం అర్థం ఏమిటా అని నెటిజన్‌లు ఇంటర్నెట్‌లో జోరుగా వెతుకుతున్నారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పై దాఖలైన పరువునష్టం కేసు విచారణ సందర్భంగా ఢిల్లీ కోర్టు న్యాయమూర్తి ఉపయోగించిన ఆ ఇంగ్లీష్ పదం ఇప్పుడు తెగ ట్రెండ్ అవుతోంది. నిర్మలా సీతారామన్‌పై ఆమ్‌ఆద్మీ పార్టీ నేత సోమనాథ్ భారతి భార్య లిపికా మిశ్రా గతంలో పరువు నష్టం దావా వేశారు. 2024 ఎన్నికల సమయంలో ఓ మీడియా సమావేశంలో నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ తనపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. తమ వైవాహిక విభేదాలను ప్రస్తావిస్తూ పరువుకు భంగం కలిగేలా మాట్లాడారని దావాలో పేర్కొన్నారు. అయితే ఈ పిటిషన్‌ను ఢిల్లీ కోర్టు కొట్టేసింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ఫ్లాక్సి నాసినిహిలపిలఫికేషన్ అనే పదాన్ని ప్రయోగించారు. లిపికా మిశ్రా ఆరోపణల్లో నిజం లేదని, ఈ పిటిషన్‌కు ఎలాంటి అర్హత లేదని జడ్జి అన్నారు.

కాగా ఈ ఫ్లాక్సి నాసిని హిలపిలఫికేషన్ అనే పదాన్ని ఏదైనా ఒక విషయాన్ని నిరుపయోగమైనదిగా పరిగణించే సమయంలో ఉపయోగిస్తారు. అంటే ఆ విషయం అంతగా విలువ లేనిదని, పనికిరానిదని అర్థం. లాటిన్ మూలాల నుంచి ఈ పదం వచ్చింది. ఫ్లాక్సీ, నాసీ, నిహిలి, పిలి అనే నాలుగు పదాలను కలిపి దీన్ని రూపొందించారు. వీటన్నింటి అర్థం విలువ లేదు అని పరిగణిస్తారు. అయితే చూడటానికి చాలా పొడవుగా పలకడానికి చాలా క్లిష్టంగా ఉండటంతో రోజువారీ సంభాషణల్లో దీన్ని ఎక్కువగా ఉపయోగించడం లేదు.

# రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఎసిబి దాడులు

## అక్రమంగా రిజిస్ట్రేషన్లు వాస్తవమే

## పూర్తి విచారణ అనంతరమే అధికారులపై చర్యలు

**వరంగల్ క్రైం, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:** హనుమకొండ జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు తనిఖీలు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. గురువారం సాయమకాలం నాలుగు గంటలు జరిగిన సోదాల్లో విస్తుపోయే నిజాలు అవినీతి బయట పడ్డట్టు అధికారులు వెల్లడించారు. తనిఖీల సమయంలో కార్యాలయంలోని పత్రాలు, రిజిస్ట్రేషన్ ఫైళ్లు, ఇతర రికార్డులను అధికారులు పరిశీలించారు. అధికారిక వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో అక్రమంగా రిజిస్ట్రేషన్లు జరిగాయి, డబ్బులు ఇవ్వని దస్తావేజులు గత నెలలుగా అధికారుల టేబుల్లో ఉన్నట్లు తెలిపారు. సుమారు 204 దస్థావేజులు రిజిస్ట్రేషన్ అయ్యాక అధికారులు వద్ద ఎందుకు ఉంచుకున్నారో విచారణ చేపడుతున్నామని వెల్లడించారు. డాక్యుమెంట్ రైటర్ల వద్ద దొరికిన నగదు అనుమాన స్పద దస్తావేజులు స్వాదీనం చేసుకున్నారు. విచారణ తధనంతరం సంబంధిత అధికారులపై శాఖపరమైన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా తెలిపారు.

వార్త

వ్యక్తులను బట్టి సమాజం తీరు ఉంటుంది. ముందు వ్యక్తి మంచి ఆలోచనలకు, మంచి అలవాట్లకు మారాలి. అప్పుడే సమాజం బాగుంటుంది.

న- లావోసు

## 'గిగ్'కు శుభసూచకం!

అసంఘటిత కార్మికులను ఆదుకునే వారుండరు. అసత్రం భోజనం మఠం నిద్రలా వారి జీవితం వెళ్లిపోతుంది. వారికీ ఆశలూ, ఆకాంక్షలూ ఉంటాయి. కానీ తీర్చేదారే కనుచూపు మేరలో కనబడదు. నిజానికి 'గిగ్ ఎకనామీ'లో యువత ఎక్కువ మందే ఆసక్తి చూపుతున్నారు. ఫుడ్ డెలివరీ, రైడ్ షేరింగ్, ఫ్రీలాన్సింగ్ వంటి రంగాల్లో పనిచేసే 'గిగ్' వర్కర్లకు ఇప్పుడిప్పుడే సమస్యలు ఎదురవుతున్నాయి. గిగ్ వర్కర్ల హక్కులు, భద్రత, బాధ్యతల విషయంలో ప్రభుత్వాలు ఎప్పటి కప్పుడు ఆదేశాలిస్తున్నా అవి అమలయ్యే దారి కనప డదు. తాజాగా వారి హక్కులు, భద్రత విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఒక కీలక అడుగు ముందుకు వేసింది. గిగ్ వర్కర్ల భద్రతే ప్రధానంగా తీసుకొచ్చిన బిల్లులో వారిని పట్టించుకోకపోతే అగ్రిగేటర్లకు రూ. 50వేల పెనాల్టీ వేస్తారు. వారి కోసం ప్రత్యేక సంక్షేమ నిధి ఏర్పాటు, ఫిర్యాదుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ కూడా ఉంటుంది. గిగ్ వర్కర్లు రిజిస్ట్రేషన్ చేసుకోగానే యూనిక్ ఐడి వస్తుంది. వారందరికీ ఈ బిల్లులోని సంక్షేమ ఫలాలన్నీ అందుతాయి. ప్రభుత్వ పథకాలు నేరుగా అందుతాయి. అగ్రిగేటర్లు నిర్వహించే లావాదేవీ లలో 1-2 శాతం నిధులతో సంక్షేమ నిధి ఏర్పరుస్తారు. ఈ నిధి నుంచే కార్మిక బీమా, పెన్షన్, గిగ్ కార్మికుల రిజిస్ట్రేషన్, పర్యవేక్షణకు సామాజిక భద్రత సంక్షేమ బోర్డునొక దానిని ఏర్పాటు చేస్తారు. మహిళలు దివ్యాం గులు సైతం ఇందులో భాగస్వాములే. ప్లాట్‌ఫారం ఆధారిత కార్మికులందరూ సభ్యులే. యాజమాన్యాలకు, కార్మికులకు మధ్య వివాదాలను పరిష్కరించే ప్రత్యేక ఏర్పాటు ఉంటుంది. గిగ్ వర్కర్ల సమస్యలన్నిటినీ క్రోడీకరిస్తూ వాటి పరిష్కారం కూడా అందులోనే చూపే విధంగా గిగ్ వర్కర్ల నమోదు, సామాజిక భద్రత, సంక్షే మ బిల్లును తెలంగాణ అసెంబ్లీ ఆమోదించింది. వారి భద్రత కోసం నిర్దేశించిన బిల్లులో గిగ్ వర్కర్‌లలో ఆశ ఏర్పడింది. వారి సంక్షేమార్థం గతంలో ఎలాంటి చట్టం రూపుదిద్దుకోలేదు. అందుచేత ఈ బిల్లు వారికి చీకట్లో వెలుగు రేఖ వంటిది. దేశవ్యాప్తంగా గిగ్ వర్కర్లు ఉంటా రని అంచనా. తెలంగాణలో అయితే నిర్దిష్టంగా 4 లక్షల మంది వర్కర్‌లు ఉంటారు. వీరి కోసం నిర్దిష్టమైన వ్యవస్థ లేనందున వారికి ప్రత్యేక చట్టం అవసరమైంది. కాగా ఈ బిల్లులో ఉద్యోగులను తొలగించాలంటే యాజమాన్యానికి కేవలం 7రోజుల వ్యవధి నిర్ణయించా రు. ఈ వ్యవధిని మరికొంత కాలం పెంచాల్సి న అవస రముంది. కార్మిక శాఖమంత్రి ఛైర్మన్‌గా, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి లేదా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు భారత ప్రభుత్వం కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ నుంచి ఒకరు సభ్యులుగా సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తారు. ఆర్థిక రంగ నిపుణులు, పౌర సంఘాల నుంచి ఇద్దరు ఇలా కార్మికుల సంక్షేమాన్ని కాంక్షించే వర్గాలప్రాతి నిధ్యం కూడా ఇందులో ఉంటుంది. గిగ్ వర్కర్ల సమస్య లపై ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక అధికారి, అప్పిలేట్ అథారిటీని కూడా ఏర్పాటు చేస్తారు. స్విగ్గీ, జొమాటో, ర్యాపిడో, ఉబర్ వంటి అగ్రిగేటర్‌లు గిగ్ వర్కర్‌ల యూని యన్‌లతో సమావేశమై ఉభయపక్షాల నుంచి సేకరించిన సలహాలు, అభిప్రాయాల అనంతరం ఈ బిల్లు రూపొం దించారు. 20మందితో సంక్షేమ బోర్డును ఏర్పాటుచేయ డం విశేషం. అందులో ప్రభుత్వ అధికార్లు, అగ్రిగేటర్లు, వర్కర్స్ యూనియన్ మెంబర్లకు భాగస్వామ్యం కల్పి స్తారు. ప్రత్యేకించి వర్కర్‌లకు తక్కువ వడ్డీతో రుణాలు కల్పించడం, ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేసే వర్కర్ల రిజిస్ట్రేషన్ ఫీజులో రాయితీ కల్పిస్తారు. గిగ్ వర్కర్లంటే అసంఘటిత కార్మికులు తప్ప మరొకరు కాదు. తాజాగా కేంద్ర ప్రభుత్వం వీరికి ఎంప్లాయిస్ ప్రావిడెండ్ ఫండ్ ఎంప్లాయిస్ స్టేట్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ వంటిసామాజిక భద్రతా ప్రయోజనాలను కల్పించే అంశాన్ని పరిశీలిస్తోంది. అసంఘటిత రంగకార్మికులకు పింఛన్ సౌకర్యం కల్పించే ప్రయత్నాలకు నాంది పలికారు. తుదిరూపం దిద్దుకున్నాక ప్రకటించడమే తరువాయి. ప్లాట్‌ఫామ్‌కు కార్యకలాపాలు, అల్గారిథమిక్ నిర్వహణ పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకోవడమూ చట్టపరిధిలోకేవస్తుంది. ఒక అసంఘటితమైన వ్యవహారానికి ఎంతో కట్టుదిట్ట మైన బిల్లుగా రూపొందించినట్లు అర్థమౌతుంది. కాలక్ర మేణ ఎదురైన సమస్యలకు పరిష్కారాలు అందించేందు కు వీలుగా న్యాయమైన ఒప్పందాలు, నిబంధనలు, ప్రామా ణిక పారితోషిక రేట్లు కూడా చట్టబద్ధంగా ఖరారవుతా యి. గిగ్ వర్కర్లకు అన్ని రకాల భద్రత చేకూరినట్లే. గిగ్ వర్కర్లకు సమయం వారి చేతిలో ఉంటుంది. కానీ స్థిర మైన ఆదాయం కనిపించదు. కాలూ చెయ్యీ ఆడితేనే రోజు గడుస్తుంది. అయినా ఐదంకెల ఆదాయం కష్టమే. అందుకే వారు తప్పనిసరిగా భద్రత, బీమా వంటి సౌక ర్యాలు ఆశిస్తారు. తాజాగా తెలంగాణప్రభుత్వం వారికోసం చట్టాన్ని తెచ్చినా కనీస వేతనం, ఆరోగ్య భద్రత, బీమా వంటి అంశాల్లో మరెంతో చేయాల్సి న అవసరం కనబడుతోంది. గతంలో వీరికోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని రచించకపోయినా సోషల్ సెక్యూరిటీకోడ్2020 పేరిట కొంతలోకొంత భాగస్వామ్యం కల్పించింది. ఆరోగ్య బీమా, ప్రమాద బీమా వృద్ధాప్య పింఛన్ వంటి ప్రయోజనాలు కల్పించారు కానీవాటి గురించి పెద్దగా ఎవరూ పట్టించుకున్నట్లు కనపడదు. తాజాచట్టం గిగ్ వర్కర్స్‌కు విస్తృతమైన భద్రత కల్పిస్తుంది. ఇదేస్ఫూర్తితో కేంద్రంఅన్ని రాష్ట్రాలకు వర్తించేవిధంగా గిగ్‌వర్కర్స్ కోసం ప్రత్యేకించి చట్టంచేయడం ప్రయోజనకరంగా ఉంటుంది. గిగ్ వర్కర్లకు చట్టపరమైన గుర్తింపు లభించడం ఒక ముందడుగే. ఇది కార్యరూపం దాల్చడం ఎంతో అవసరం.



వాగ్దానం చేయడానికి వెనుకాడే వ్యక్తి, చేసిన వాగ్దానాన్ని తప్పక నిలబెట్టుకుంటాడు.

డబ్ల్యు ఎమర్సన్



అంతరాయాలు కలుగుతున్న కొద్దీ సంకల్పాన్ని దృఢతరం చేసుకుంటూ పోవాలి.

శ్రీరమణ మహర్షి

## ప్రజావాక్కు

### యుద్ధంలో ప్రపంచమే పరాజిత

అమెరికా, ఇజ్రాయెల్ కలిసిఇరాన్‌తో చేస్తున్న యుద్ధంలో ఆయా దేశాలు, ప్రాంతాలు వారివారి మిత్రదేశాలే కాదు యావత్ ప్రపంచమే పరాజయం పాలవుతుంది. ఇజ్రాయెల్ పంతానికి అమెరికా అహంకారం తోడవ్వగా ,ఇరువురూ ఇరాన్ అంతు చూడడం సులువని భావించారు. ఒక వైపు దౌత్య పరమైన చర్చలు సాగుతుండగానే ఇరాన్ పై దాడి చేసి ముఖ్యనేతల్ని మట్టుపెట్టారు. పెద్ద తలకాయలు లేనిఇరాన్ గందరగోళానికి గురై కాళ్లబేరానికి రాక తప్పదని భావించారు. వారి ఆలోచనలకు భిన్నంగా ఇరాన్ నిలబడి గల్ఫ్‌లో అమెరికా మిత్రదేశాలపై దాడులు తీవ్రం చేసింది. తన ఆధీనంలో ఉన్న చమురు, సహజ వాయువుల రవాణా మార్గం హోర్ముజ్ జలసంధిని మూసివేసింది. ఫలితంగా ప్రపంచ దేశాల ఇంధన భద్రత ప్రమాదంలో పడింది. యుద్ధం మొదలై నెలరోజులు దాటుతున్నా ఇరువైపులా సేనలు తగ్గడం లేదు.

- డా.డి.వి.జి.శంకరరావు, విజయనగరం

### పసిపిల్లలపై స్మార్ట్ ఫోన్ ప్రభావం

నేటి భారతంలో పసిపిల్లల తల్లిదండ్రులు పిల్లలు ఊరికే ఏడుస్తున్నారనో, అన్నంతినట్లేదనో, ఆడుకోవట్లేదని చాలా అరుదుగా ఇవ్వాల్సి న మొబైల్ ఫోన్‌ను తల్లిదండ్రుల విలాసవంతం కొరకు, విరామ సమయం కొరకు పసిపిల్లల కు ఫోన్ ఇవ్వడం అలవాటుగా మార్చేశారు. వాళ్లకు భౌతిక ఆటలను, భౌతిక మాటలను దూరం చేయడమే గాక చిన్నవయస్సులోనే వారికంటిచూపు, ఏకాగ్రత, ఆరోగ్యం పాడవుతుందనే విషయాలని గ్రహించవలసిన అవసరం ఎంతైనా ఉంది. చీటికిమాటికి స్మార్ట్ ఫోన్ ఇవ్వడం అలవాటుగా మార్చొద్దు. తల్లిదండ్రులారా మీ పసిపిల్లలను భౌతికంగా ఎదగనివ్వండి.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### పెరుగుతున్న వాయుకాలుష్యం

పట్టణాలు నగరాల్లో రోజురోజుకు పెరుగుతున్న వాయు, ధ్వని, నీటి, ఆహారకాలుష్యం ప్రణాంతకమవుతున్నాయి. పెరుగుతున్న నగర జనాభాతోపాటు విపరీతంగా పెరుగుతున్న ప్రాణాంతక జబ్బులకు కారణం కాలుష్యంవాహనాలు వాయు కాలుష్యానికి ముఖ్యకారణం. దానికి తోడు వాహనాల నుండి విడుదల అయ్యే పొగ మీద సరైన నియంత్రణ లేకపోవడం. వీధుల్లో వ్యర్థాలను తగుల బెట్టడం మరో ముఖ్యమైన కారణం.

-టి. మురళీమోహన్, హైదరాబాద్

### మహిళలకు రిజర్వేషన్

భారతదేశ ప్రజాస్వామ్య దేశంగా ప్రపంచానికి ఆదర్శంగా నిలిచింది. అయినప్పటికీ, సమాజంలోని ప్రతి వర్గానికి సమాన ప్రతినిధిత్వం కల్పించడంఅనే లక్ష్యం ఇంకా పూర్తిగా సాధ్య పడలేదు. ముఖ్యంగా మహిళల రాజకీయ ప్రతినిధిత్వం విషయంలో మనం ఇంకా వెనుకబడి ఉన్నాం. ఈ నేపథ్యంలో చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించే అంశం మరోసారి ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇది కేవలం ఒక చట్టపరమైన మార్పు మాత్రమేకాదు, సమాజంలో సమానత్వాన్నినెలకొల్పేఒక చరిత్రాత్మక అడుగు. భారతదేశంలో మహిళలు జనాభాలో సుమారు సగం శాతం ఉన్నప్పటికీ, లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలలో వారి ప్రతినిధిత్వం చాలా తక్కువగా ఉంది. పురుషాధిక్య భావజాలం, కుటుంబ బాధ్యతలు, ఆర్థిక పరిమితులు వంటి కారణాల వల్ల మహిళలు రాజకీయాల్లోకి ప్రవేశించడంలో వెనుకబడుతున్నారు.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### పదవీ విరమణ వయసు తగ్గించాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల, ఉపాధ్యాయులు పదవీ విరమణ వయస్సుగురించి తీసుకున్న నిర్ణయం ఆహ్వానించదగ్గది. ప్రభుత్వ ఉద్యోగులు ఉపాధ్యాయులు పదవి విరమణ వయస్సు గతంలో ఏభై ఎనిమిది సంవత్సరాలు ఉండేది. తర్వాత అరవై సంవత్సరాలుగా మార్చారు. ఓల్డ్ పెన్షన్ స్కీంలో పెన్షన్స్ ఇవ్వలేని కారణంగా అరవై రెండు సంవత్సరాలుగా మాజీ మంత్రి పెంచారు. పదవి విరమణ వయస్సు ఓల్డ్ పెన్షన్ స్కీంవలన ప్రభుత్వానికి భరించడానికి ఇష్టం లేని ఆర్థిక భారం అవుతుంది. ఆర్టీసీ బస్ డ్రైవర్లు ,ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న డ్రిల్ మాస్టర్లలను ఏభై సంవత్సరాలకే రిటైర్ చేస్తే సరిపోతుంది.

- వి. భాస్కర్ రావు, బొబ్బిలి

### సబ్‌ప్లాన్ అమలు చేయలి

వికలాంగుల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్రంలో వారికి ప్రత్యేకంగా వికలాంగుల సబ్ ప్లాన్ అమలు చేయాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వార్షిక బడ్జెట్ లో వారి జనాభా నిష్పత్తి ప్రకారం నిధులు కేటాయించాలి. ప్రతి మంత్రిత్వశాఖవికలాంగుల సంక్షేమం కోసం కృషి చేయాలి. ఉద్యోగ వికలాంగుల సమస్యల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేయాలి. వికలాంగులపై రోజురోజుకు వివక్షత, దాడులు, దౌర్జన్యాలు, ఈసడింపులు. వికలాంగుల భూములు ఆక్రమించే కబ్జాలు చేసే వారిపై కఠినంగా శిక్షించి న్యాయం చేయాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# మార్కుల వేటలో మేధస్సుకు సంకెళ్లు!

**మార్కులు విజయానికి ఒక మెట్టు మాత్రమే కానీ, అవే అంతిమ లక్ష్యం కాదని గుర్తించాలి. పిల్లల ప్రత్యేక ప్రతిభను గుర్తించి, వారిని ఆ దిశగా ప్రోత్స హించడమే తల్లిదండ్రులు ఇచ్చే గొప్ప ఆస్తి. భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన దేశం. ఇది మనకు లభించిన ఒక అపూర్వమైన అవకాశం. కానీ ఈ యువశక్తికి ఆధునిక నైపుణ్యాలు అందకపోతే, అది దేశానికి ఒక పెద్ద సమస్యగా పరిణమించే ప్రమాదం ఉంది. ప్రపంచం ఏఐ దిశగా జెట్ వేగంతో దూసుకుపోతున్న తరుణంలో, మనం ఇంకా ఎద్దులబండి వేగంతో సాగే పాత విద్యా విధానాలను పట్టుకుని వేలాడటం ఆత్మహత్యాసదృశ్యం. మార్కుల కోసం కాకుండా, మేధో వికాసం కోసం విద్యార్థులు శ్రమిం చాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయాలకు అతీతంగా విద్యా సంస్కరణల కోసం ఏకం కావాలి. ఆలస్యం చేసే ప్రతి నిమిషం రాబోయే తరాల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్ట డమే. వికసిత్ భారత్ లక్ష్యం సాకారం కావాలంటే, మన తరగతి గదులు ఆధునిక దేవాలయాలుగా మారాలి.**



ఎల్లబోయిన వెంకటేశ్వర్లు

మానవ చరిత్రలో పారిశ్రామిక విప్లవం ఒకప్పుడు శారీరక శ్రమను యంత్రాలకు బదిలీ చేసి ఉత్పత్తి రంగంలో పెనుమార్పులు తెచ్చింది. నేడు మనం అటువంటిదే, అంతకంటే శక్తివంతమైన మరొక విప్లవ ముంగిట ఉన్నాం. అదే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ)విప్లవం. ఇది కేవలం శ్రమను మాత్రమే కాదు, నేరుగా మానవ మేధస్సునే యంత్రాలతో అనుసంధానిస్తోంది. ఈ పరిణామం కేవలం సాఫ్ట్‌వేర్ కంపెనీలకో లేదా టెక్నాలజీ రంగాలకో పరిమితం కాలేదు. ఇది విద్య, ఉపాధి, ఆర్థిక వ్యవస్థలు దేశాల సార్వభౌమాధికారాన్ని కూడా ప్రభావితం చేసే స్థాయికి చేరుకుంది. ఇలాంటి కీలక సమయంలో ప్రపంచ దేశాలు తమ విద్యా విధానాలను సమూలంగా మార్చుకుంటుంటే, భారత్ మాత్రం ఇంకా పాతకాలపు మార్కులు, ర్యాంకులు, ఎంట్రన్స్ పరీక్షల చట్రంలోనే బందీ అయి ఉండటం ఆందోళన కలిగించే అంశం. ప్రపంచవ్యాప్తంగా అగ్రరాజ్యాలు ఏఐని కేవలం ఒక సాంకేతికతగా కాకుండా, భవిష్యత్తును శాసించే ఆయుధంగా చూస్తున్నాయి. ముఖ్యంగా మన పొరుగు దేశమైన చైనా ఈ విషయంలో చాలా ముందుచూపుతో వ్యవహరిస్తోంది. 2021లో చైనా అమలు చేసిన డబుల్ రిడక్షన్ విధానం విద్యా రంగంలో ఒక సాహసోపేతమైన అడుగు. విద్యార్థులపై హోంవర్క్ ఒత్తిడిని తగ్గించి, ప్రైవేట్ ట్యూషన్ల సంస్కృతిని నియంత్రించడం ద్వారా వారుపరీక్షల ఆధారిత విద్య నుంచి సృజనాత్మకత ఆధారిత విద్య వైపు మళ్లారు. కోడింగ్, డేటా అనాలిసిస్, రోబోటిక్స్ క్రిటికల్ థింకింగ్ వంటి ఆధునిక అంశాలను ప్రాథమికస్థాయి నుంచే పాఠ్యాంశాల్లో చేర్చారు. అక్కడ టెక్నాలజీ అనేది ఒక సబ్జెక్టు కాదు, అది ఒక జీవన విధానం. ఫలితంగా, రేపటి ఏఐ ప్రపంచాన్ని శాసించే నిపుణులను వారు పాఠశాల స్థాయి నుంచే సిద్ధం చేస్తున్నారు. భారత్ పరిస్థితిని గమనిస్తే పూర్తి విరుద్ధమైన దృశ్యం కనిపిస్తుంది. ప్రతి సంవత్సరం లక్షలాది మంది ఇంజనీర్లు, పట్టభద్రులు కళాశాలల నుంచి బయటకు వస్తున్నారు. కానీ, వారిలో పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కేవలం 2025 శాతం మందిలోనే ఉంటున్నాయని పలు సర్వేలు చెబుతున్నాయి. దీనికి ప్రధాన కారణం మన విద్యా వ్యవస్థ ఇంకా 'రొట్టె చదువుల' మీదే ఆధారపడి ఉండటం. ఒక విద్యార్థి ప్రతిభను కేవలం అతను సాధించిన మార్కుల ఆధారంగానే అంచనా వేయడం వల్ల, అసలైన విశ్లేషణాత్మక ఆలోచన, సమస్య పరిష్కార సామర్థ్యం మరుగునపడిపోతున్నాయి. సిలబస్‌లు మారుతున్నా, బోధనా పద్ధతుల్లో మార్పు రాకపోవడం అతిపెద్ద లోపం. భారత విద్యా వ్యవస్థను పట్టిపీడిస్తున్న మరో ప్రధాన సమస్య కోచింగ్ సంస్కృతి. హైదరాబాద్‌లోని అశోక్ నగర్ నుంచి రాజస్థాన్‌లోని కోటా వరకు, విద్య అనేది ఒక అన్వేషణలా కాకుండా ఒక క్రూరమైన పోటీ పందెంలా మారిపోయింది. ఐఐటీలు, నీట్ వంటి ప్రతిష్టాత్మక పరీక్షల్లో ర్యాంకులు సాధించడమే పరమావధిగా మారడంతో, విద్యార్థులు తమ సహజ ఆసక్తులను, సృజనాత్మకతను కోల్పోతున్నారు. ర్యాంకుల వేటలో పడి ఏఐ, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్ వంటి అభివృద్ధి చెందుతున్న



రంగాల పట్ల కనీస అవగాహన పెంచుకునే సమయం విద్యార్థులకు ఉండటం లేదు. మార్కెట్‌లో వీటి డిమాండ్ పెరుగుతున్నా, మన కోచింగ్ సెంటర్లు మాత్రం దశాబ్దాల నాటి ఫార్ములాలను బట్టీ పట్టించడంలోనే నిమగ్నమై ఉన్నాయి. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ విద్యా విధానం 2020 మార్పుకు మంచి పునాది వేసింది. పరీక్షల ఒత్తిడిని తగ్గించడం, వృత్తి విద్యా కోర్సులను ప్రవేశపెట్టడం వంటివి కాగితం మీద అద్భుతంగా ఉన్నాయి. అయితే, క్షేత్రస్థాయిలో దీని అమలు ఇంకా మందకొడిగానే సాగుతోంది. కేవలం విధాన పత్రాల్లో మార్పులు చేస్తే సరిపోదు, తరగతి గది నాలుగు గోడల మధ్య జరిగే బోధనలో మార్పు రావాలి. ప్రాథమిక స్థాయి నుంచే డిజిటల్ లిటరసీని ఒక తప్పనిసరి అంశంగా మార్చాలి. సమస్యలను పరిష్కరించే ప్రాజెక్ట్ ఆధారిత విద్యను ప్రోత్సహించాలి. ఏఐ విప్లవంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకం. ఏఐ అంటే కేవలం కంప్యూటర్ సైన్స్ ఉపాధ్యాయులకు సంబంధించిన విషయం అనే భ్రమ నుంచి బయటకు రావాలి. భాషలు, సామాజిక శాస్త్రం, గణితం ఇలా ప్రతి సబ్జెక్టులోనూ ఏఐని ఎలా ఉపయోగించాలో ప్రతి ఉపాధ్యాయుడికి తెలిసి ఉండాలి. బోధనా ప్రక్రియలో సాంకేతికతను ఒక సాధనంగా మలుచుకునేలా ప్రభుత్వాలు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలి. ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా మారినప్పుడే విద్యార్థులు ఆవిష్కర్తలుగా ఎదగగలరు. భారతదేశం లాంటి విస్తారమైన దేశంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య డిజిటల్ వ్యత్యాసం చాలా ఎక్కువగా ఉంది. నగరాల్లోని కార్పొరేట్ పాఠశాలల్లో లభించే ఏఐ ల్యాబ్‌లు, హైస్పీడ్ ఇంటర్నెట్ సౌకర్యాలు గ్రామీణ ప్రభుత్వ పాఠశాలల్లో కలల మాటగానే ఉన్నాయి. ఈ వ్యత్యాసాన్ని వెంటనే తొలగించకపోతే భవిష్యత్తులో సామాజిక అసమానతలు మరింత పెరుగుతాయి. ప్రతి గ్రామీణ పాఠశాలలోనూ డిజిటల్ మౌలిక వసతులు, వర్చువల్ లెర్నింగ్ సాధనాలను అందుబాటులోకి తీసుకురావడం ప్రభుత్వాల తక్షణ కర్తవ్యం. అప్పుడే మన 'డెమోగ్రాఫిక్ డివిడెండ్' (యువశక్తి) దేశానికి ఆస్తిగా మారుతుంది. నేటి విద్యావ్యవస్థ విద్యార్థులను 'ఉద్యోగార్థులు'గా తయారు చేస్తోంది. కానీ ఏఐ యుగంలో మనకు కావాల్సింది 'ఉద్యోగ సృష్టికర్తలు'. స్టార్టప్ సంస్కృతిని, పరిశోధనాభిరుచినిస్కూల్ స్థాయి నుంచే ప్రోత్సహించాలి. వైఫల్యాలను తప్పుగా చూడకుండా, వాటినుంచి నేర్చుకునేలా విద్యార్థులను సిద్ధం చేయాలి. పరిశ్రమలు విద్యాసంస్థల మధ్య బలమైన అనుసంధానం ఏర్పడాలి. విద్యార్థులు చదువుతున్నప్పుడే వాస్తవ ప్రపంచంలోని సమస్యలకు పరిష్కారాలు కనుగొనేలా ఇంటర్న్‌షిప్‌లను ప్రోత్సహించాలి. కేవలం విద్యా వ్యవస్థ మాత్రమే మారితే సరిపోదు, సమాజం, తల్లిదండ్రుల ఆలోచనా ధోరణిలో కూడా సమూల మార్పు రావాలి. పక్కింటి అబ్బాయికి వచ్చిన మార్కులు, ర్యాంకులతో తమ పిల్లలను పోల్చడం ఆపాలి. ఏఐయుగంలో యంత్రాలు చేయలేని పనులుఅంటే కరుణ, సృజనాత్మకత, నైతికత వంటి మానవ విలువలకు ప్రాధాన్యత పెరగనుంది. మార్కులు విజయానికి ఒక మెట్టు మాత్రమే కానీ, అవే అంతిమ లక్ష్యం కాదని గుర్తించాలి. పిల్లల ప్రత్యేక ప్రతిభను గుర్తించి, వారిని ఆ దిశగా ప్రోత్సహించడమే తల్లిదండ్రులు ఇచ్చే గొప్ప ఆస్తి. భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన దేశం. ఇది మనకు లభించిన ఒక అపూర్వమైన అవకాశం. కానీ ఈ యువశక్తికి ఆధునిక నైపుణ్యాలు అందకపోతే, అది దేశానికి ఒక పెద్దసమస్యగా పరిణమించే ప్రమాదం ఉంది. ప్రపంచం ఏఐ దిశగా జెట్ వేగంతో దూసుకుపోతున్న తరుణంలో, మనం ఇంకా ఎద్దులబండి వేగంతో సాగే పాత విద్యా విధానాలను పట్టుకుని వేలాడటం ఆత్మహత్యాసదృశ్యం. మార్కులకోసం కాకుండా, మేధో వికాసం కోసం విద్యార్థులు శ్రమించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయాలకు అతీతంగా విద్యా సంస్కరణల కోసం ఏకం కావాలి. ఆలస్యం చేసే ప్రతి నిమిషం రాబోయే తరాల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టడమే. వికసిత్ భారత్ లక్ష్యం సాకారం కావాలంటే, మన తరగతి గదులు ఆధునిక దేవాలయాలుగా మారాలి.

# 'ఆహారభద్రత'ను హరిస్తున్న యుద్ధం!

డా. చిట్యాల రవీందర్

ప్రస్తుత ప్రపంచ గమనంలో యుద్ధం అనేది కేవలం సరిహద్దులకు, సైనికులకు పరిమితమైన తుపాకీ గుళ్ల పోరాటం మాత్రమే కాదు అది సగటు సామాన్యుడి వంటగదిపై, అతడు తినే పళ్లెంలోని ఆహారంపై నేరుగా దాడి చేసే ఆర్థిక విపత్తు. రష్యా, ఉక్రెయిన్ సంక్షోభం నుంచి పశ్చిమ ఆసియాలో రగులుతున్న యుద్ధ జ్వాలల వరకు ప్రతి సంఘర్షణ కూడా అంతర్జాతీయ సరఫరా గొలుసును చిన్నాభిన్నం చేస్తూ, సామాన్యుడిని ఆకలి కోరల్లోకి నెడుతున్నాయి. యుద్ధం ప్రారంభం కాగానే ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు ఆకాశాన్ని తాకడం మనం చూస్తున్నాం. రవాణా వ్యయం పెరగడం వల్ల నిత్యావసర వస్తువుల ధరలు రెట్టింపు అవుతాయి. ముఖ్యంగా ఎల్‌పిజి వంటి వంట గ్యాస్ ధరలపై దీని ప్రభావం అత్యంత తీవ్రంగా ఉంటుంది. సహజ వాయువు ఉత్పత్తిలో రష్యా వంటి దేశాలు అగ్రగామిగా ఉన్నప్పుడు, అక్కడ యుద్ధం సంభవిస్తే సరఫరాలో అంతరాయం ఏర్పడి, దిగుమతులపై ఆధారపడే భారత్ వంటి దేశాల్లో సిలిండర్ ధరలు సామాన్యుడి భారానికి మించిపోతాయి. ఇది కేవలం గ్యాస్ ధరతోనే ఆగదు, ఎరువుల తయారీకి అవసరమైన అమ్మోనియా వంటి రసాయనాల ధరలు పెరగడంవల్ల వ్యవసాయ రంగం కుదేలవుతుంది. రైతులు పండించే పంటల పెట్టుబడి పెరిగి, చివరికి మార్కెట్‌కు వచ్చేసరికి కూరగాయలు, ధాన్యాల ధరలు సామాన్యుడికి అందనంతఎత్తుకు చేరుతాయి. ఉక్రెయిన్ ప్రపంచానికే 'బ్రెడ్ బాస్కెట్' వంటిది, అక్కడి నుంచి గోధుమల సరఫరా ఆగిపోతే ప్రపంచవ్యాప్తంగా పిండి ధరలు పెరిగి పేదవాడి రొట్టె ముక్కను కూడా దూరం చేస్తాయి. యుద్ధం కొనసాగితే సముద్ర మార్గాల్లో రవాణా స్తంభించిపోతుంది. ఎర్ర సముద్రం వంటి కీలక ప్రాంతాల్లో ఉద్రిక్తతలు పెరిగితే కార్గో నౌకలు దారి మళ్లించాల్సి వస్తుంది, దీనివల్ల ఇన్సూరెన్స్ ప్రీమియంలు పెరిగి ప్రతి వస్తువుపై అదనపు భారం పడుతుంది. యుద్ధం వల్ల కరెన్సీ విలువ పడిపోవడం మరో పెద్ద ముప్పు. రూపాయి బలహీనపడితే మనం దిగుమతి



చేసుకునే వంట నూనెలు (పామాయిల్, సన్‌ఫ్లవర్‌ఆయిల్) ధరలు ఒక్కసారిగా పెరుగుతాయి. భారత్ తన వంట నూనెల అవసరాల్లో సగానికి పైగా దిగుమతులపైనే ఆధారపడుతుంది. కాబట్టి నల్ల సముద్రం ప్రాంతంలో యుద్ధం జరిగితే ఇక్కడ మన ఇళ్లలో పోపుడబ్బా ఖాళీ అవుతుంది. భవిష్యత్తులో యుద్ధం ఇలాగే కొనసాగితే ఆహార భద్రత అనేది పెద్ద ప్రశ్నార్థకంగా మారుతుంది. దేశాలు తమ ఆహార నిల్వలను బయటకు పంపడానికి నిరాకరిస్తాయి (ప్రొటెక్షనిజం), దీనివల్ల కృత్రిమ కొరత ఏర్పడి ఆకలి చావులు సంభవించే ప్రమాదం ఉంది. యుద్ధం వల్ల కలిగే ద్రవ్యోల్బణం కేవలం అంకెల్లో ఉండదు. అది సామాన్యుడి పళ్లెంలో తగ్గుతున్న ముద్దల్లో కనిపిస్తుంది. శక్తి వనరుల కొరత వల్ల పరిశ్రమలు మూతపడి నిరుద్యోగం పెరగడం, ఆదాయం తగ్గి ఖర్చులు పెరగడం అనే విషవలయంలో సామాన్యుడు చిక్కుకుపోతాడు. రష్యాపై ఆంక్షలు విధిస్తే అది ప్రపంచ ఇంధన మార్కెట్‌ను కుదిపేస్తుంది, పశ్చిమ ఆసియాలో యుద్ధం వస్తే పెట్రోల్, డీజిల్ ధరలు లీటరుకు ఊహించని స్థాయికి చేరుతాయి. ఈ ప్రభావంవల్ల పాలు, గుడ్లు, మాంసం వంటి ప్రతి ప్రోటీన్ ఆధారిత ఆహారం ధర పెరుగుతుంది ఎందుకంటే పశుగ్రాసం రవాణా కూడా ఖరీదైనదిగా మారుతుంది. యుద్ధం అంటే కేవలం ప్రాణ నష్టం మాత్రమేకాదు, జీవన ప్రమాణాల విధ్వంసంకూడా. ఇది ఒక దేశపు ఆర్థిక వ్యవస్థను దశాబ్దాల వెనక్కి నెట్టేస్తుంది. శాంతి లేని లోకంలో ఆహార భద్రత ఉండదు. సామాన్యుడి పళ్లెంలో యుద్ధం చిమ్ముతున్న విషం ధరల పెరుగుదల రూపంలో వస్తోంది. మానవాళి తన స్వార్థ ప్రయోజనాల కోసం చేస్తున్న పోరాటాల్లో చివరకు బలయ్యేది పేదవాడి ఆకలి మాత్రమేనని మనం గుర్తించాలి. అంతర్జాతీయంగా డిజిటల్ కరెన్సీలు, క్రిప్టోలు ఎన్ని వచ్చినా, యుద్ధం వస్తే బంగారం, చమురు, ఆహారం మాత్రమే అసలైన ఆయుధాలుగా మారుతాయి. సామాన్యుడు ఈ పరిస్థితులను తట్టుకోవాలంటే పొదుపు మంత్రం ఒక్కటే సరిపోదు, ప్రభుత్వాలు ప్రత్యామ్నాయ ఇంధన వనరులను స్థానిక ఆహార ఉత్పత్తిని పెంచాల్సి న అవసరం ఎంతైనా ఉంది. యుద్ధం కొనసాగితే గ్లోబలైజేషన్ పతనం ప్రారంభమై, ప్రతి దేశం తన సొంత అవసరాల కోసం సరిహద్దులను మూసివేసే ప్రమాదం ఉంది. ఇది ప్రపంచవ్యాప్త ఆహార సంక్షోభానికి దారితీస్తుంది. కాబట్టి సామాన్యుడి పళ్లెంపై యుద్ధ ప్రభావం అనేది ఒక మౌనమైన సునామీ లాంటిది. అది నెమ్మదిగా మన వంటగదిలోకి ప్రవేశించి మన కడుపు మాడ్చే అవకాశాలున్నాయి.

# వెండితెర వెలుగులో యువత.. నీలి నీడల్లో భవిత

మద్రాపు వసుంధరా దేవి

స్మార్ట్‌ఫోన్ ఒకప్పుడు కమ్యూనికేషన్ సాధనంమాత్రమే. నేడు అది విశ్వవీక్షణానికి యువతకు దగ్గర దారి అయింది. నిద్రలేచిన క్షణం నుంచి నిద్రపోయే వరకూ చేతిలో ఉండేది పుస్తకం కాదు, స్క్రీన్. సంభాషణల స్థానంలో స్టేటస్‌లు, అనుభవాల స్థానంలో రీల్స్, ఆలోచనల స్థానంలో ఆల్గోరిథమ్స్ యువత దైనందిన జీవితాన్ని మలుస్తున్నాయి. సోషల్ మీడియా యువతకు అవకాశాల ద్వారమా? లేక అదుపు తప్పిన ప్రభావాల వలయమా? ఈ ప్రశ్నకు సమాధానం తెలుసుకోవాలంటే గణాంకాలనూ, వాస్తవ జీవితానుభవాలనూ కలిసి చూడాల్సిందే. భారతదేశంలో ఇంటర్నెట్ వినియోగదారులు 2024 నాటికి సుమారు 850 మిలియన్లకు చేరినట్టు వివిధ పరిశ్రమ అంచనాలు సూచిస్తున్నాయి. వీరిలో గణనీయమైన శాతం 18–30 ఏళ్ల మధ్య వయస్సు గల యువత. కొన్ని సర్వేల ప్రకారం భారత యువత రోజుకు సగటున 3నుంచి 5 గంటల వరకు సోషల్ మీడియా వేదికలపై గడుపుతున్నారు. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, ఫేస్‌బుక్, షార్ట్ వీడియో యాప్లు ఇవి యువజీవితంలో ప్రధాన సమయాన్ని ఆక్రమిస్తున్నాయి. ప్రపంచ స్థాయిలో చూసినా 16–24 ఏళ్ల యువత రోజుకు సగటున 4 గంటలకుపైగా సోషల్ మీడియాలో గడుపుతున్నారని గ్లోబల్ డిజిటల్ నివేదికలు చెబుతున్నాయి. సోషల్ మీడియా వల్ల వచ్చిన మార్పుల్లో కొన్ని సానుకూల అంశాలు స్పష్టంగా కనిపిస్తాయి. సమాచార ప్రాప్తి విస్తరించింది. గ్రామీణ ప్రాంత యువతకు కూడా ఆన్లైన్ కోర్సులు, స్కిల్ డెవలప్మెంట్ వీడియోలు, ఉద్యోగ సమాచారం అందుబాటులోకి వచ్చాయి. చిన్న వ్యాపారాలు ప్రారంభించడానికి, కంటెంట్ క్రియేటర్‌గా ఎదగడానికి అవకాశాలు పెరిగాయి. సామాజిక ఉద్యమాలు, పౌర చైతన్యం, రాజకీయ చర్చలు యువతలో చురుకుదనం తెచ్చాయి. ఒక పోస్టు దేశవ్యాప్తంగా చర్చకు దారితీసే స్థాయికి చేరింది. అయితే ఇదే వేదిక మరోవైపు మానసిక ఆరోగ్య సమస్యలకు కారణమవుతోందనే పరిశోధనలు కూడా పెరుగుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం 15–29 ఏళ్ల యువతలో ఆత్మహత్య ప్రధాన మరణ కారణాల్లో ఒకటి. మానసిక ఒత్తిడి, డిప్రెషన్, ఆందోళన వంటి సమస్యలు పెరుగుతున్నాయి. సోషల్ మీడియా వినియోగం ఎక్కువగా ఉన్న యువతలో ఒంటరితనం, తక్కువ ఆత్మవిశ్వాసం, శరీర రూపంపై అసంతృప్తి వంటి భావనలు అధికమవుతున్నాయని అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి. లైక్స్" సంఖ్యే స్వీయ గౌరవాన్ని నిర్ణయించే ప్రమాణంగా మారుతోంది. వాస్తవ జీవితంతో పోలిస్తే సోషల్ మీడియాలో కనిపించే పర్ఫెక్ట్ జీవితం యువతలో అసహజ పోటీ భావనను పెంచుతోంది. విద్యా రంగంలో కూడా దీని ప్రభావం గణనీయమే. తరగతి గదిలో దృష్టి కేంద్రీకరణ తగ్గడం, చదువుపై ఆసక్తి తగ్గడం వంటి అంశాలు ఉపాధ్యాయులు గమనిస్తున్నారు. కొన్ని అధ్యయనాల ప్రకారం రోజుకు 4 గంటలకు మించిన స్క్రీన్ టైమ్ ఉన్న విద్యార్థుల అకడమిక్ పనితీరు గణనీయంగా పడిపోతుంది. నిద్రలేమి మరో పెద్ద సమస్య. స్క్రీన్ లైట్ ప్రభావంతో నిద్ర చక్రం దెబ్బతింటోంది. నిద్రలేమి మానసిక ఆరోగ్యానికే కాక శారీరక ఆరోగ్యానికీ హానికరం. సోషల్ మీడియా యువతను రాజకీయంగా చైతన్యవంతులను చేస్తున్నప్పటికీ, అదే సమయంలో ఫేక్ న్యూస్ వ్యాప్తికి వేదికగా మారింది. భారతదేశంలో ఇంటర్నెట్ వినియోగదారుల్లో గణనీయ శాతం నిజానిజాలు ధృవీకరించకుండా సమాచారాన్ని పంచుకుంటున్నారని కొన్ని సర్వేలు చెబుతున్నాయి. యువత ఈ సమాచారం ప్రవాహంలో తేలిపోతున్నారు. విమర్శనాత్మక ఆలోచన కంటే తక్షణ స్పందనకు ప్రాధాన్యం పెరిగింది. దీని ఫలితంగా సామాజిక విభజనలు, విద్వేష ప్రసంగాలు, ఆన్లైన్ వేధింపులు పెరుగుతున్నాయి. ఆర్థిక కోణంలో చూస్తే, సోషల్ మీడియా కొత్త వినియోగ సంస్కృతిని సృష్టించింది. ఇన్ఫ్లుయెన్సర్ మార్కెటింగ్, బ్రాండ్ ప్రమోషన్లు యువతలో వినియోగ ఆకాంక్షను పెంచుతున్నాయి. తక్షణ సంతోషం కోసం ఖర్చు చేసే అలవాటు పెరుగుతోంది. మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాల్లో కూడా ట్రెండ్ అనుసరించాలనే ఒత్తిడి ఆర్థిక భారాన్ని పెంచుతోంది. మహిళా యువతపై ప్రభావం మరింత క్లిష్టం. ఒకవైపు సోషల్ మీడియా వారికి అభిప్రాయ వ్యక్తీకరణ వేదికగా మారింది. మరోవైపు సైబర్ బుల్లీయింగ్, ఆన్లైన్ వేధింపులు, శరీర రూపంపై ఒత్తిడి ఎక్కువగా ఎదురవుతోంది. బాలికలలో ఆన్లైన్ వేధింపుల అనుభవం శాతం గణనీయమని పలు అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇది వారి మానసిక ఆరోగ్యానికీ, విద్యా కొనసాగింపుకీ ప్రతికూల ప్రభావం చూపుతుంది. అయితే సమస్య సోషల్ మీడియా ఉనికిలో కాదు, దాని వినియోగ విధానంలో ఉంది. డిజిటల్ లిటరసీ లోపం ప్రధాన కారణం. భారతదేశంలో డిజిటల్ సాక్షరత శాతం పెరుగుతున్నప్పటికీ, విమర్శనాత్మక ఆలోచన, మీడియా లిటరసీ ఇంకా పరిమితంగానే ఉన్నాయి. స్క్రీన్ టైమ్ నియంత్రణ, ఫ్యాక్ట్ చెకింగ్ అలవాటు, వ్యక్తిగత గోప్యతపై అవగాహన యువతకు బోధించాల్సి న అవసరం ఉంది. సోషల్‌మీడియా యువతకు శక్తి. అదే సమయంలో అది బలహీనతగా మారే ప్రమాదం కూడా ఉంది. అవకాశాలనువినియోగించుకోవడం, ప్రభావాలను నియంత్రించుకోవడం ఈ రెండింటి మధ్య సమతుల్యత అవసరం. కుటుంబాలు, విద్యాసంస్థలు, ప్రభుత్వం కలిసి డిజిటల్ బాధ్యతను పెంపొందించాలి. లేకపోతే స్క్రీన్ వెలుగులో మెరిసే ప్రపంచం వెనుక, మౌనంగా పెరుగుతున్న మానసిక చీకట్లు సమాజాన్ని ఆవరించే ప్రమాదం ఉంది. యువత చేతిలో ఉన్న ఫోన్ కేవలం యంత్రంకాదు, అది భవిష్యత్తును మలిచే సాధనం. ఆ సాధనం మనల్ని నడిపించాలా, లేక మనమే దాన్ని నియంత్రించాలా అన్నది నేటి తరానికి, సమాజానికి పెద్ద ప్రశ్న.

## తోటి విద్యార్థుల వేధింపులతో వైద్య విద్యార్థిని ఆత్మహత్య

**బెంగళూరు, ఏప్రిల్ 2:** కర్ణాటకలోని మల్లాడ హల్లిలో దారుణం జరిగింది. తనకు పాఠాలు చెప్పే ప్రొఫెసర్‌తో సంబంధం ఉందని తోటి విద్యార్థులు అవమానించడంతో వైద్య విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటక, మల్లాడిహల్లిలోని రాఘవేంద్ర ఆయుర్వేద కళాశాలలో నిఖిత (22) అనే విద్యార్థిని బిఎఎంఎస్ ఫైనల్ ఇయర్ చదువుతోంది. అదే కళాశాలలో పనిచేస్తున్న డా. రాజు అనే ప్రొఫెసర్‌తో నిఖితకు మంచి సన్నిహిత సంబంధం ఉండేది. అయితే దీన్ని తప్పుగా అర్థం చేసుకున్న ఆమె క్లాస్‌మేట్స్ ఇద్దరి మధ్య ఎఫైర్ ఉందని భావించారు. కళాశాలలో ప్రచారం జరిగింది. చివరకు వారి వేధింపులు భరించలేక నిఖిత తన స్వగ్రామం లోని ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడింది. సూసైడ్ నోట్ రాసింది. ఈ ఘటనపై యువతి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తోటి విద్యార్థులు నిఖితను మానసికంగా వేధిస్తూ, అవమానాలకు గురి చేశారని కంప్లైంట్‌లో పేర్కొన్నారు.

# 16 నుంచి ప్రత్యేక పార్లమెంటు

### మూడు రోజులు సమావేశాలు జరిగే అవకాశం

**మహిళా రిజర్వేషన్, సీట్ల పెంపు బిల్లులు**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:** మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లు కోసం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగానే బడ్జెట్ సమావేశాలు వాస్తవ షెడ్యూల్ ప్రకారం, ఏప్రిల్ 2వ తేదీ గురువారంతో ముగియాల్సి ఉండగా, నిరవధికంగా వాయిదా పడలేదు. కొద్ది రోజులు విరామం తర్వాత తిరిగి 16 నుంచి పార్లమెంట్ సమావేశాలు నిర్వహించాలని యోచిస్తున్నట్లు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లుతోపాటు లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలు పెంపు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులు తీసుకురావడానికి ఏప్రిల్ మూడో వారంలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తోంది. లోక్‌సభ సీట్లను 816కు పెంచనున్నట్లు ఇటీవలే కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో లోక్‌సభ స్థానాలు 816కు పెంచే బిల్లులో 273 స్థానాలకు మహిళలకు రిజర్వ్ చేయవచ్చని అధికార వర్గాలు వెల్లడించాయి. లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే నిబంధనను 2023లో రాజ్యాంగాన్ని సవరించడం ద్వారా తీసుకువచ్చారు, కానీ ఇది నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ పూర్తయిన తర్వాత అమల్లోకి వస్తుంది. అధికార వర్గాల సమాచారం ప్రకారం, లోక్‌సభ సీట్ల సంఖ్యను ప్రస్తుత 543 నుండి 816కు పెంచుతారు, ఇందులో 273 సీట్లు మహిళలకు రిజర్వ్ చేయబడతాయి. ప్రతిపాదిత 2027 జనాభా లెక్కల ఆధారంగా కాకుండా, 2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుంది. రాష్ట్ర శాసన సభలకు కూడా ఇదే విధమైన ప్రక్రియ చేపట్టబడుతుంది, అక్కడ సీట్లు దామాషా పద్ధతిలో రిజర్వ్ చేయబడతాయి. షెడ్యూల్ కులాలు లేదా షెడ్యూల్ తెగల విషయంలో జనాభా ఆధారంగా మహిళలకు, అలాగే మహిళలకు రిజర్వ్ చేయగల నియోజకవర్గాలను నిర్ణయించగల పునర్విభజన ప్రక్రియతో పాటు, రొటేషన్ పద్ధతి ద్వారా కూడా నియోజకవర్గాలను నిర్ణయించవచ్చు. 2023 సెప్టెంబర్‌లో, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నారీ శక్తి వందన్ బిల్లుకు తన ఆమోదం తెలిపారు. ఈ చట్టాన్ని అధికారికంగా రాజ్యాంగం (106వ సవరణ) చట్టం అని పిలుస్తారు. ఒక రాజ్యాంగ సవరణ బిల్లు, సాధారణంగా మహిళా రిజర్వేషన్ చట్టంగా పిలువబడే నారీ శక్తి వందన అధినియమ్‌ను సవరించనుండగా, మరో సాధారణ బిల్లు నియోజక వర్గాల పునర్విభజన చట్టాన్ని సవరిస్తుంది. పార్లమెంటు ఆమోదం పొందిన తర్వాత, ప్రతిపాదిత చట్టాలు 2029 మార్చి 31న అమల్లోకి వస్తాయి. ఇవి రాబోయే లోక్‌సభ ఎన్నికలు, అలాగే ఒడిశా, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, ఆంధ్రప్రదేశ్‌లలో జరిగే అసెంబ్లీ ఎన్నికలలో మహిళలకు సీట్లు రిజర్వ్ చేయడానికి సహాయపడతాయి.

## అఖిలపక్షానికి మోడీ ఎందుకు రాలేదు!

**పార్లమెంట్‌లో ఖర్గే, రిజిజుల మధ్య వాగ్వాదం**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:** పార్లమెంట్ వేదికగా అధికార, ప్రతిపక్షాల మధ్య మరోసారి మాటల యుద్ధం జరిగింది. పశ్చిమాసియా సంక్షోభంపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశానికి ప్రధాని మోదీ హాజరుకాకపోవడాన్ని రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే తీవ్రంగా ప్రశ్నించారు. దీనిపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు గట్టిగా బదులివ్వడంతో సభలో కాసేపు వేడి రాజుకుంది. పశ్చిమాసియా ఉద్రిక్తతలపై మీరు అఖిలపక్ష సమావేశం పెట్టారు. ఆ సమావేశానికి ప్రధానమంత్రి ఎందుకు రాలేదని ఖర్గే ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ఇంధన ధరల పెరుగుదల వంటి కీలక అంశాలపై చర్చకు రాకుండా, ప్రభుత్వం తన అజెండాను ప్రతిపక్షాలపై రుద్దుతోందని ఆయన ఆరోపించారు. తాము ప్రతినిధులను పంపినా ప్రధాని రాలేదని, కేవలం ఉపన్యాసాలు వినడానికి తాము రావాలా అని నిలదీశారు. ఖర్గే వ్యాఖ్యలపై కిరణ్ రిజిజు ఘాటుగా స్పందించారు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ప్రతిపక్షాలు రాజకీయం చేయడం దురదృష్టకరమని అన్నారు. అదే అఖిలపక్ష సమావేశానికి లోక్‌సభ, రాజ్యసభలోని ప్రతిపక్ష నేతలు ఎందుకు హాజరు కాలేదని ఆయన ఎదురు ప్రశ్నించారు. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా చమురు ధరలు పెరుగుతున్నాయి. దీని ప్రభావంతో దేశంలో గ్యాస్, పెట్రోల్ ధరలు పెరగొచ్చని విపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. వ్యూహరచన కోసం ప్రభుత్వం సర్వపక్ష భేటీని ఏర్పాటు చేసింది. అయితే ఈ సమావేశానికి ప్రధాని గైర్హాజరు కావడం రాజకీయ దుమారానికి కారణమైంది.



రాజ్యసభ ఉపనేత పదవి నుంచి

## రాఘవ్ చద్దా తొలగింపు

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 2:** ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) రాజ్యసభ సభ్యుడైన రాఘవ్ చద్దాపై ఆ పార్టీ చర్యలు చేపట్టింది. 2023 నుంచి రాజ్యసభలో ఉప నేతగా ఉన్న ఆయనను ఆ పదవి నుంచి తొలగించింది. పంజాబ్ ఎంపీ అశోక్ మిట్టల్‌ను రాజ్యసభలో ఆప్ డిప్యూటీ లీడర్‌గా ఆ పార్టీ నియమించింది. ఈ మార్పునకు సంబంధించి అధికారిక లేఖను రాజ్యసభ సచివాలయానికి ఆప్ పంపినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అలాగే సభలో మాట్లాడటానికి రాఘవ్ చద్దాకు సమయం కేటాయించకూడదని కూడా ఆ లేఖలో పేర్కొన్నట్లు తెలిసింది. ఆప్ తీసుకున్న ఈ కీలక నిర్ణయంపై రాఘవ్ చద్దా మౌనం వహించారు. ఈ నేపథ్యంలో ఆ పార్టీలో చీలిక ఏర్పడిందనే వదంతులు మరింత తీవ్రమయ్యాయి. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా, ఇతర నేతలను నిర్దోషులుగా ఢిల్లీ కోర్టు ఫిబ్రవరిలో ప్రకటించింది. అయితే రాఘవ్ చద్దా దీనిపై స్పందించలేదు. అలాగే పార్టీ కార్యాలయంలో కేజ్రీవాల్ ప్రసంగించిన సమావేశంతో పాటు జంతర్ మంతర్ వద్ద జరిగిన జనసభ వంటి కీలక పార్టీ కార్యక్రమాలకు కూడా ఆయన గైర్హాజరయ్యారు. ఈ నేపథ్యంలో రాఘవ్ చద్దా పార్టీకి దూరంగా ఉంటున్నట్లు అనుమానాలు వ్యక్తమయ్యాయి.

## పర్వతారోహకులకు రహస్య ఫుడ్‌పాయిజన్

**రూ.186 కోట్ల కుంభకోణంపై నేపాల్ పోలీస్ దర్యాప్తు**

**ఖాట్మండు, ఏప్రిల్ 2:** ప్రపంచంలోనే ఎత్తయిన శిఖరంగా ప్రఖ్యాతిగాంచిన మౌంట్ ఎవరెస్ట్ పర్వతారోహకులకు సంబంధించి సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. పర్వాతారోహకులు ట్రెక్కింగ్ చేస్తున్నప్పుడు తీసుకొనే ఆహారాన్ని రహస్యంగా ఫుడ్ పాయిజన్ చేస్తున్నారని తేలింది. కొంతమంది ఒక నెట్‌వర్క్‌లా ఏర్పడి ఈ కుట్రకు పాల్పడుతున్నారని, అత్యవసర పరిస్థితిని సృష్టించి భారీగా సొమ్ము చేసుకుంటున్నారని నేపాల్ పోలీసులు అభియోగాలు మోపారు. ఎవరెస్ట్ పర్వతారోహకులు తీసుకునే ఆహారం లో బేకింగ్ సోడా మోతాదును పెంచుతున్నారు. దాంతో వారు జీర్ణకోశ సమస్యలకు గురవుతున్నారు. ఎత్తు కారణంగా ఇలాంటి సమస్యలు తలెత్తుతుంటాయని ట్రెక్కర్లను వారు నమ్మిస్తుంటారు. అప్పుడే వారి భయాన్ని సొమ్ము చేసుకోవడం మొదలవుతుంది. వారిని అత్యవసరంగా ఆస్పత్రులకు తరలించేందుకు హెలికాప్టర్లను రప్పిస్తారు. ఎంత డబ్బయినా చెల్లించేలా అప్పటికే బాధితులను ఒప్పిస్తారు. పక్కాగా జరుగుతున్న ఈ కుట్రలో కొందరు షెర్పాలు, ట్రెక్కింగ్ ఏజెన్సీలు కలిసి పనిచేస్తున్నాయి. తర్వాత నకిలీ వైద్యం, ఫ్లైట్ పత్రాలు చూపించి బీమా సంస్థల నుంచి డబ్బులు పొందుతున్నారని అధికారులు పేర్కొన్నారు. తర్వాత బీమా సొమ్మును షెర్పాలు, హెలికాప్టర్ కంపెనీలు, ట్రెక్కింగ్ ఏజెన్సీలు, నకిలీ పత్రాలు ఇచ్చిన ఆసుపత్రులు పంచుకుంటున్నాయని వెల్లడించారు. ఈ మోసం విలువ 20 మిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో సుమారు రూ.186 కోట్లు అని అంచనా వేశారు. పర్వతాల్లో సహాయక చర్యలు చేపట్టే సంస్థలకు చెందిన ఆరుగురు ఎగ్జిక్యూటివ్‌లను ఈ ఏడాది జనవరిలో అరెస్టు చేసిన తర్వాత ఈ స్కామ్ గురించి వెలుగులోకి వచ్చింది. ఇప్పటివరకు 32 మందిని నేపాల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నేపాల్ పర్యాటకంలో ఎంతో కీలకమైన, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఎవరెస్ట్ ట్రెక్కింగ్‌లో జరుగుతున్న మోసాన్ని అక్కడి న్యాయస్థానం తీవ్రంగా పరిగణించింది. ఈ నెట్‌వర్క్‌లో భాగమైన వారికి భారీ స్థాయిలో జరిమానా విధించాలని డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి. పర్యాటకుల విషయంలో ఇలాంటి స్కామ్‌లు వెలుగుచూడటం ఇది తొలిసారి కాదు. అందుకే ఈ మోసాల కారణంగా పలు అంతర్జాతీయ బీమా సంస్థలు ఎవరెస్ట్ విజిటర్లకు ఇన్సూరెన్స్ కవరేజ్ ఇవ్వడం నిలిపివేశాయి. దీనిపై అక్కడి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా కఠిన శిక్షలు లేకపోవడమే కారణమనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

## ఎన్నికల్లో గెలిస్తే ఉద్యోగాల్లో మహిళలకు 50శాతం రిజర్వేషన్

**కేరళం ఎన్నికల్లో ఎల్డీఎఫ్ మేనిఫెస్టో విడుదల**




**తిరువనంతపురం, ఏప్రిల్ 2:** అసెంబ్లీ ఎన్నికలలో తాము విజయం సాధిస్తే ఉద్యోగాల్లో మహిళలకు 50 శాతం కోటా కేటాయిస్తామని లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్డీఎఫ్) ప్రకటించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ గురువారం పార్టీ మ్యానిఫెస్టోను విడుదల చేశారు. సంక్షేమం, అభివృద్ధి, మహిళా సాధికారత లక్ష్యంగా 60 పాయింట్లతో రెండు వాల్యూమ్‌లుగా దీన్ని రూపొందించారు. కాగా 140 స్థానాలున్న కేరళలో 9న ఎన్నికలు జరగనున్నాయి. నెలవారీ పింఛన్ రూ.3 వేలకు పెంచనున్నట్లు ప్రకటించారు. అత్యంత పేదరికంలో ఉన్న ఐదు లక్షల కుటుంబాలను ఆదుకుంటామని, బలహీన వర్గాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, వృద్ధులకు, రోగులకు మెరుగైన సంరక్షణ అందిస్తామని, చదువుకున్న విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్లు కల్పిస్తామన్నారు. నైపుణ్య శిక్షణ ప్రోగ్రామ్‌లు విస్తరిస్తామని, బ్యాక్ టూ క్యాంపస్ పేరుతో నిరుద్యోగులకు నైపుణ్యాలు అందిస్తామని, 50 శాతం ఉద్యోగాలు మహిళలకు కేటాయిస్తామని తెలిపారు. మహిళలు ఉద్యోగాలు చేసుకునేందుకు వీలుగా సురక్షిత ప్రయాణ సదుపాయం కల్పిస్తామని తెలిపారు. శిశు సంరక్షణ, నైపుణ్యాల్లో శిక్షణ ఇప్పించడం, విద్యావంతులైనవారు చేపట్టే వ్యాపారాలకు వడ్డీ లేని రుణాలు అందించడం లాంటివి కూడా మ్యానిఫెస్టోలో ఉన్నాయి.

## మంటల్లో పశ్చిమాసియా

హార్ముజ్ భద్రత మీరే చూసుకోండి...

### పశ్చిమాసియాపై ఆధారపడిన దేశాలకు ట్రంప్ అల్టిమేటమ్



**వాషింగ్టన్, ఏప్రిల్ 2:** హార్ముజ్ జలసంధిలో భద్రతను పశ్చిమాసియాపై ఆధారపడిన దేశాలే చూసుకోవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ వల్లే చమురు ధరలు పెరుగుతున్నాయని, అంతర్జాతీయ వాణిజ్య నౌకలపై దాడులకు ఆ దేశమే కారణమని తీవ్రంగా ఆరోపించారు. గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ పిచ్చి ఉగ్రదాడులకు పాల్పడటం వల్లే గ్యాసోలిన్ ధరలు పెరిగాయి. ఇలాంటి ఇరాన్‌ను అణ్వాయుధాల విషయంలో ఎప్పటికీ నమ్మలేమని ట్రంప్ అన్నారు. హార్ముజ్ జలసంధి గుండా చమురు రవాణా చేసే దేశాలు ఇకపై భద్రతా భారాన్ని మోయాలని ఆయన తేల్చిచెప్పారు. ఆ మార్గాన్ని వాళ్లే చూసుకోవాలి. దాన్ని వాళ్లే కాపాడుకోవాలి. చాలా దేశాలు ఈ వివాదంలో జోక్యం చేసుకోకుండా కేవలం లబ్ధి పొందుతు న్నాయని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇతర దేశాలకు ఆయన రెండు మార్గాలను సూచించారు. మొదటిది, అమెరికా నుంచి చమురు కొనండి. రెండోది, కాస్త ధైర్యం తెచ్చుకుని ఆ జలసంధికి వెళ్లి దాన్ని మీకోసం మీరే రక్షించుకోండని ట్రంప్ అన్నారు. ప్రస్తుతం అమెరికా ప్రపంచంలోనే నంబర్ వన్ ఇంధన ఉత్పత్తిదారు అని, సౌదీ అరేబియా, రష్యా కంటే కూడా ఎక్కువ ఉత్పత్తి చేస్తోందని తెలిపారు. పశ్చిమాసియా నుంచి తమకు చమురు అవసరం లేదని, హార్ముజ్ ద్వారా తాము దాదాపుగా దిగుమతులు చేసుకోవడం లేదని స్పష్టం చేశారు.

### అమెరికా ప్రజలతో మాకు ఎలాంటి శతృత్వంలేదు

**ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ బహిరంగ లేఖ**

**టెహ్రాన్, ఏప్రిల్ 2:** అమెరికా ప్రజలతో తమకు ఎలాంటి శత్రుత్వం లేదని, ఇజ్రాయెల్ కోసం అమెరికా ప్రభుత్వం తమతో ప్రాక్సీ యుద్ధం చేస్తోందని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా ప్రజలను ఉద్దేశించి ఆయన రాసిన బహిరంగ లేఖలో ఈ కీలక ఆరోపణలు చేశారు. ఇరాన్, అమెరికాఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో తమ దేశ వైఖరిని స్పష్టం చేసే ప్రయత్నం చేశారు. అమెరికా ప్రజలతో సహా మరే ఇతర దేశ ప్రజలపైనా ఇరాన్ ప్రజలకు శత్రుభావం లేదు. తమ చరిత్రలో అనేక విదేశీ జోక్యాలను, ఒత్తిళ్లను ఎదుర్కొన్నప్పటికీ, ఇరాన్ ప్రజలు ఎల్లప్పుడూ ప్రభుత్వాలను, ప్రజలను వేరుగానే చూశారని పెజెష్కియాన్ తన లేఖలో పేర్కొన్నారు. ఇరాన్ తన ఆధునిక చరిత్రలో ఎన్నడూ ఆక్రమణలకు లేదా విస్తరణవాదానికి పాల్పడలేదని ఆయన స్పష్టం చేశారు. ఇరాన్‌ను ఒక ముప్పుగా చిత్రీకరించడం అనేది పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ చేస్తున్న నేరాల నుంచి ప్రపంచ దృష్టిని మళ్లించడానికి పన్నిన వ్యూహమని ఆరోపించారు. ఇజ్రాయెల్ తన చట్టవిరుద్ధ ప్రయోజనాల కోసం ఆఖరి అమెరికన్ సైనికుడు, ఆఖరి అమెరికన్ పన్ను చెల్లింపుదారుడి డాలర్ వరకు పోరాడాలని చూస్తోంది. ప్రస్తుత అమెరికా ప్రభుత్వ ప్రాధాన్యం నిజంగా అమెరికా ఫస్టేనా అని ఆయన ప్రశ్నించారు.

### దెబ్బతిన్న దేశాన్ని సమష్టిగా పునరుద్ధరించుకుందాం: ఖమేనీ



**టెహ్రాన్, ఏప్రిల్ 2:** జియోనిస్ట్ అమెరికా, ఇజ్రాయిల్ శక్తులు ఎలాంటి రెచ్చగొట్టే చర్యలు లేకుండానే దాడులు చేసి విధ్వంసం సృష్టించాయని, ఈ దాడిలో ధ్వంసమైన మౌలిక సదుపాయాలను పునరుద్ధరించి దేశాన్ని పునర్నిర్మించేందుకు దేశవ్యాప్తంగా కృషి చేయాలని ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ పిలుపునిచ్చారు. ఇస్లామిక్ రిపబ్లిక్ డే, జాతీయ ప్రకృతి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన ఈ సందేశం ఇచ్చినట్లు ఆ దేశ ప్రభుత్వ మీడియా సంస్థ ప్రెస్ టీవీ వెల్లడించింది. ఇటీవలి ఘర్షణల తర్వాత దేశ భవిష్యత్ శ్రేయస్సు కోసం జాతీయ ప్రయత్నాలు సాగాలని ఆయన స్పష్టం చేశారు. దివంగత అయతొల్లా అలీ ఖమేనీ కుమారుడైన మొజ్తబా ఖమేనీ, శత్రువుల దాడులు కేవలం ప్రజలనే కాకుండా దేశ భూభాగాన్ని, సహజ పర్యావరణాన్ని కూడా లక్ష్యంగా చేసుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. క్రూరమైన అమెరికా, జియోనిస్ట్ శత్రువులు తమ అనాగరిక చర్యలలో ఎలాంటి మానవ, నైతిక పరిమితులు పాటించడం లేదు. ఇలాంటి సమయంలో దేశం అంతర్గత అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఆయన వ్యాఖ్యానించినట్లు పిలుపునిచ్చారు. భవిష్యత్తు కోసం చేపట్టే ప్రతి ప్రయత్నం ఎంతో విలువైందని, అవసరమని ఆయన నొక్కిచెప్పారు. ఫిబ్రవరి 28న ప్రారంభమైన ఈ ఘర్షణల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి ఆయన తన సందేశంలో నివాళులర్పించారు. ముఖ్యంగా దేశంలోని దక్షిణ నగరమైన మినాబ్‌లోని ఒక బాలికల పాఠశాలపై జరిగిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ దాడిలో 186 మంది విద్యార్థినులు మరణించినట్లు ప్రెస్ టీవీ నివేదించింది. పిల్లలను చంపే రాక్షస అమెరికా, జియోనిస్ట్ దుర్మార్గులు పాఠశాలలోని పసిమొగ్గలను కిరాతకంగా బలిగొన్నారని ఖమేనీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

### అబద్ధాలతో అనవసరంగా ఇరాన్‌పై అమెరికాయుద్ధం

**బ్రెజిల్ అధ్యక్షుడు లులా డిసిల్వా ఆరోపణలు**

**సియారా (బ్రెజిల్), ఏప్రిల్ 2:** ఇరాన్‌తో అనవసర యుద్ధానికి దిగేందుకు అమెరికా ఒక అబద్ధాన్ని సృష్టించిందని బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డా సిల్వా తీవ్ర ఆరోపణలు చేశారు. ఇరాన్ అణ్వాయుధాలను కలిగి ఉందని లేదా వాటిని తయారు చేయడానికి ప్రయత్నిస్తోందని అమెరికా చెబుతున్నది పచ్చి అబద్ధమని ఆయన స్పష్టం చేశారు. బ్రెజిల్‌లోని సియారా రాష్ట్రంలో జరిగిన ఒక ఇంటర్వ్యూలో లూలా ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో ఇరాక్‌లో కూడా సామూహిక విధ్వంసక ఆయుధాలు ఉన్నాయంటూ అబద్ధాలు చెప్పి అమెరికా యుద్ధానికి దిగిందని, కానీ ఆ ఆయుధాలు ఎన్నడూ కనుగొనలేదని ఆయన గుర్తుచేశారు. ఇదంతా కేవలం ఒక సాకు మాత్రమే యుద్ధం ఎప్పుడూ దేనినీ పరిష్కరించలేదని లూలా పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వివాదంపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి హేతుబద్ధంగా ఆలోచించి, జోక్యం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ యుద్ధం వల్ల తమ దేశంపై ప్రత్యక్ష ప్రభావం పడుతోందని లూలా ఆవేదన వ్యక్తం చేశారు. హార్మూజ్ జలసంధి మూసివేతతో బ్రెజిల్‌లో డీజిల్ ధరలపై తీవ్ర ఒత్తిడి పెరిగిందన్నారు.

### ఇరాన్‌తో యుద్ధం.. ఒత్తిడిలో అమెరికా సైనికులు?

**వాషింగ్టన్, ఏప్రిల్ 2:** నెల రోజులకుపైగా కొనసాగుతోన్న ఇరాన్ యుద్ధంతో అమెరికా సైనికులు ఒత్తిడికి గురవుతున్నారు. పశ్చిమాసియాలో మోహరింపులపై ఆందోళనగా ఉన్నారు. ఆ భయాల నుంచి బయటపడేందుకు, సేద దీరేందుకు భారీగా డబ్బులు వెచ్చిస్తున్నారంటూ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ విడుదల చేసిన ఓ వీడియో నెట్టింట్లో చక్కర్లు కొడుతోంది. 'సైనిక స్థావరాలను సమీపంలో ఉన్న మా క్లబ్ వద్దకు భారీగా సైనికులు వస్తున్నారు. వారంతా ఒత్తిడిలో కనిపిస్తున్నారు. వచ్చేవారం మేం వెళ్తున్నామంటూ యుద్ధం గురించి చెబుతున్నారు. వారిలో చాలా చిన్నవయసు వారున్నారు. వారిని చూస్తుంటే ఎంతో ఉద్వేగంగా అనిపించింది' అని ఆ ఇన్‌ఫ్లుయెన్సర్ వెల్లడించారు. పశ్చిమాసియాలో అమెరికా మోహరింపులు పెంచుతున్న వేళ ఈ వీడియో వెలుగులోకి వచ్చింది.

## బొగ్గు స్మగ్లింగ్ స్కాం...

## ఐప్యాక్ కార్యాలయాల్లో అధికారుల సోదాలు




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:** రాజకీయ కన్సల్టెన్సీ ఐప్యాక్ కార్యాలయా ల్లో గురువారం దర్యాప్తు సంస్థ ఇడి సోదాలు చేపట్టింది. పశ్చిమబెంగాల్ బొగ్గు స్మగ్లింగ్ కేసుకు సంబంధించి ఈ తనిఖీలు నిర్వహిస్తోంది. హైద రాబాద్, బెంగళూరు, ఢిల్లీల్లోని ఐప్యాక్ కార్యాలయాల్లో ఏకకాలంలో అధికారులు సోదాలు చేపడుతున్నారు. ఈ కన్సల్టెన్సీ డైరెక్టర్లలో ఒకరైన రిషిరాజ్ సింగ్‌కు చెందిన ప్రాంగణంపై కూడా దర్యాప్తు సంస్థ దృష్టిసారించింది. బొగ్గు స్మగ్లింగ్‌కు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో కొంతకాలంగా సోదాలు జరుగుతున్నాయి. కొన్ని నెలల క్రితం బెంగాల్‌లో జరిగిన ఈ రైడ్స్ చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. సోదాలు జరుగుతున్న సమయంలో పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఐప్యాక్ చీఫ్ ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో ఆయన ఇంటిపై కూడా తనిఖీలు జరగడం గమనార్హం. సోదాల సమయంలో బెంగాల్ ప్రభుత్వం నుంచి ఆటంకాలు ఎదురయ్యాయని ఇడి ఆరోపించింది. ఆ వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది. ఇదిలా ఉంటే 2019 లోక్‌సభ ఎన్నికల తర్వాత నుంచి టిఎంసితో కలిసి ఐప్యాక్ పనిచేస్తోంది. బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ ఈ పరిణామాలు చర్చనీయాంశంగా మారాయి.

## సిఎం పదవికి నితీశ్ రాజీనామా

### 10న ఎంపిగా ప్రమాణం



**పాట్నా, ఏప్రిల్ 2:** బీహార్ సీఎంగా ఉన్న నితీష్ కుమార్ రాజ్యసభకు ఎన్నికైన బీహార్ సీఎం తన సీఎం పదవికి రాజీనామా చేయబోతున్నారు. రాజ్యసభ సభ్యుడిగా ఈ నెల 10న ప్రమాణ స్వీకారం చేస్తారు. నితీష్ కుమార్‌తోపాటు కొత్తగా ఎన్నికైన సభ్యులందరూ అదే రోజు ప్రమాణ స్వీకారం చేస్తారు. రాజ్యసభలో ప్రమాణానికి ఈ నెల 9న నితీష్ ఢిల్లీ వెళ్తారు. ఈనెల 10న ప్రమాణం అనంతరం, ఏప్రిల్ 12న బీహార్ రాజధాని పాట్నాకు తిరిగొస్తారు. ఆ తర్వాత ఆయన తన సీఎం పదవికి రాజీనామా చేస్తారు. ఆలోపు కొత్త సీఎంను ఎన్నుకుంటారు. కొత్త సీఎం ఆధ్వర్యంలో బీహార్ నూతన ప్రభుత్వం ఈ నెల 14న కొలువుదీరే అవకాశం ఉంది. నితీష్ సీఎం పదవి నుంచి తప్పుకోనున్నప్పటికీ, ఆయన భద్రత విషయంలో మాత్రం రాజీపడటం లేదు. రాష్ట్ర హోం శాఖ ఈ విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. నితీష్ రాజ్యసభ ఎంపీ అయినప్పటికీ, ఆయనకు సీఎంలకు ఇచ్చే జడ్+ సెక్యూరిటీని కొనసాగించాలని నిర్ణయించింది. ఇప్పటికే దీనిపై స్పెషల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆదేశాలు జారీ అయ్యాయి. జేడీయూ చీఫ్‌గా ఉన్న నితీష్ పదవికి రాజీనామా చేయడం పార్టీ వర్గాల్లో కొంత గందరగోళానికి దారితీసింది. నితీష్ తర్వాత ఎవరు సీఎం పదవి చేపడతారు అనే చర్చ కొనసాగుతోంది. ఈ విషయంలో ఎన్‌డీయే కూటమిగా ఉన్న ప్రభుత్వంలో బీజేపీ అభ్యర్థి సీఎం అవుతారని సమాచారం. ప్రస్తుతం డిప్యూటీ సీఎంగా ఉన్న సామ్రాట్ చౌదరి (బీజేపీ) సీఎం రేసులో ఉన్నారు. కేంద్ర మంత్రి నిత్యానందరాయ్ పేరు కూడా వినిపిస్తోంది. త్వరలో బీజేపీ కార్యనిర్వాహక సమావేశం అనంతరం సీఎంను ఎన్నుకునే అవకాశం ఉంది. కేంద్ర బీజేపీ నాయకుల సూచన మేరకే రాష్ట్రంలో నిర్ణయాలుంటాయి. బీజేపీ గతంలో ప్రభుత్వంలో భాగస్వామ్యంగా ఉంది. 20 ఏళ్లుగా కూటమిలో ఉన్నా ఎప్పుడూ నేరుగా అధికారం చేపట్టలేదు. ఈసారి మాత్రం బీజేపీ అభ్యర్థి సీఎం పదవి చేపట్టబోతున్నారు.




గురువారం తిరుచ్చిలో నామినేషన్ దాఖలు చేస్తున్న టివికె అధినేత విజయ్

## 'జననాయగన్' విడుదలపై కుట్ర: విజయ్

**చెన్నై, ఏప్రిల్ 2:** కోలీవుడ్ నటుడు విజయ్ నటించిన సరికొత్త చిత్రం 'జన నాయగన్'. ఈ సినిమా విడుదల విషయంలో కొంతకాలంగా సందిగ్ధత నెలకొన్న సంగతి తెలిసిందే. తమిళనాడు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ సినిమా విడుదలను ఉద్దేశించి ఆయన కీలక ఆరోపణలు చేశారు. విడుదల విషయంలో కుట్ర జరుగుతోందన్నారు. తనకు న్యాయం కావాలని డిమాండ్ చేశారు. 'కరూర ఘటన ఒక ఉమ్మడి కుట్ర అని చాలామంది చెబుతున్నారు. మీకు న్యాయం జరగలని నేను ఎలా అయితే కోరుతున్నానో.. నాకు కూడా న్యాయం కావాలని కోరుతున్నా' అని విజయ్ అన్నారు. తన సినిమా 'జననాయగన్' విడుదల విషయంలో ఏదో జరుగుతోందని ఆరోపించారు. ఎల్పీజి సిలిండర్ల కొరతపై స్పందిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్ర విమర్శలు చేశారు. 'తన కుటుంబానికి ఏదైనా సమస్య వస్తే ముఖ్యమంత్రి స్టాలిన్ వెంటనే ఢిల్లీ విమానం ఎక్కేస్తారు. ఎల్పీజి సిలిండర్ల సంక్షోభాన్ని పరిష్కరించడానికి ఆయన దేశ రాజధానికి వెళ్లరా?' అని ప్రశ్నించారు. నటుడిగా ఎంతోమంది అభిమానులను సొంతం చేసుకున్న విజయ్ తమిళగ వెట్రి కళగం (టివికె) పార్టీని స్థాపించి.. తొలిసారి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గాల నుంచి ఆయన బరిలోకి దిగనున్నారు. తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గంలో గురువారం ఆయన నామినేషన్ దాఖలు చేశారు.

### ఆగ్నేయాసియా దేశాల్లో ఇరాన్ యుద్ధ ప్రభావం

## చమురు, గ్యాస్ ధరలు రెట్టింపు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** పశ్చిమాసియా యుద్ధ ప్రభావం ప్రపంచమంతా విస్తరిస్తున్నది. ఆగ్నేయాసియాలో ఇంధన అత్యవసర పరిస్థితి ప్రారంభమైంది. ఈ క్రమంలో మార్చి 24న ఫిలిప్పీన్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్ జాతీయ ఇంధన ఎమర్జెన్సీని ప్రకటించారు. నెల రోజుల వ్యవధిలో పెట్రోల్ ధరలు 50 శాతానికి పైగా పెరిగాయి. ఇదే కాలానికి డీజిల్ ధరలు ఇంచుమించు రెట్టింపయ్యాయి. దీంతో అధ్యక్షుడు మార్కోస్ ఒక కమిటీని ఏర్పాటు చేసి పెరిగిన ధరల ప్రభావం ఏయే రంగాలపై పడింది, ప్రైవేట్ రంగం శిలాజ ఇంధన వాడకం తగ్గింపుపై అన్వేషించాల్సి మార్గాలపై నివేదిక ఇవ్వాలని కోరారు. 30 రోజుల పాటు బియ్యం ధరపై గరిష్ఠ పరిమితిని విధించాలని యోచిస్తున్నట్టు ప్రభుత్వం తెలిపింది. చమురుపై ప్రభుత్వ పన్నులు రద్దు చేయాలన్న విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నది. ప్రభుత్వం విధించిన ఆంక్షలు, పరిమితుల పట్ల రవాణా, మరికొన్ని రంగాల కార్మికులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా కంబోడియాలో చమురు ధరలు 68 శాతం పెరిగాయి. దీంతో ప్రభుత్వం చమురుపై పన్నులు తొలగించడమే కాక, ఇంధన పరిరక్షణ చర్యలు చేపట్టాలంటూ రాష్ట్రాలను ఆదేశించింది. అసలే అప్పుల్లో కూరుకుపోయి ఉన్న లావోస్ దేశం అత్యధికంగా చమురు దిగుమతులపైనే ఆధారపడి ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో అక్కడ పాఠశాలలు మూడు రోజులు మాత్రమే తెరిచేలా ఆదేశాలు అమలు చేస్తున్నది. ఎలక్ట్రిక్ కార్ల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు సర్వీస్ ఫీజును తగ్గించింది. గ్యాస్ ఆధారంగా నడిచే వాహనాలను ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయవద్దని ప్రభుత్వ సంస్థలకు ఆదేశాలు జారీ చేసింది. వియత్నాంలో అక్కడి ప్రభుత్వం ఏప్రిల్ 15 వరకు కొన్ని చమురు పన్నులను సున్నా శాతానికి తగ్గించేసింది. ఉద్యోగులు వర్క్ ఫ్రం హోమ్ చేయాలని ఆదేశించింది. ఇంధనాన్ని పొదుపుగా వాడుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లో నిల్వ చేయవద్దని థాయ్‌లాండ్ ప్రధాని పౌరులకు విజ్ఞప్తి చేశారు. ఇంధన సరఫరాలను బలోపేతం చేసుకోవడానికి ఆస్ట్రేలియా, సింగపూర్ సంయుక్తంగా చర్యలు ప్రారంభించాయి. ఆస్ట్రేలియా ఇదే తరహా ప్రయత్నాలను మలేషియాతో కూడా కొనసాగిస్తున్నది. చమురు కోసం ప్రపంచ వ్యాప్తంగా తీవ్రమైన పోటీ నెలకొంది. సముద్రంలో రష్యా చమురుపై అమెరికా ఆంక్షలు ఎత్తివేయడంతో ఈ ప్రాంతంలోని అనేక దేశాలు దానిని కొనుగోలుకు ఆసక్తి చూపాయి. కాగా, తమ నౌకలు హర్ముజ్ జలసంధి మీదుగా ఎలాంటి ఆటంకాలు లేకుండా వచ్చేందుకు ఇరాన్‌తో తాము ఒక ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్టు థాయ్ ప్రధాని అనుథిన్ చర్న్‌విరకుల్ ప్రకటించారు.

# గ్రామాల్లో మహిళా భవనాల నిర్మాణం వేగవంతం

## 8,193 గ్రామాల్లో స్థలాల గుర్తింపు

## 6,261 భవనాలకు అనుమతులు

## 5,017 బిల్డింగ్‌లకు అంచనాలు సిద్ధం

## సర్వేపల్లిలో ప్రారంభమైన తొలి భవనం

**హైదరాబాద్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో గ్రామీణ మహిళల సాధికారతకు బలమైన మౌలిక వసతులు కల్పించేదిశగా మహిళా సంఘాల (ఎస్‌హెచ్‌జి) భవనాల నిర్మాణం శరవేగంగా కొనసాగుతోంది. ఇందిరా మహిళా శక్తి పథకం కింద ఈ కార్యక్రమం ఓ యజ్ఞంలా గ్రామాలన్నింటిలో అమలవుతోంది. ప్రతీ గ్రామ పంచాయతీలో మహిళా భవనాల నిర్మాణానికి కనీసం 200 గజాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశాలు జారీ చేసింది. దీంతో రాష్ట్రంలోని 12,728 పంచాయతీలకు గాను ఇప్పటికే 8,193 స్థలాలను గుర్తించారు. అందులో 6,261 భవనాలకు కలెక్టర్ల నుంచి అనుమతులు లభించగా, 5,017 భవనాల నిర్మాణాలకు అంచనాలు సిద్ధ మయ్యాయి. ప్రస్తుతం జిల్లాల వారీగా పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మహిళా సంఘాల భవనాలను వేగంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క పర్యవేక్షణలో పంచాయతీరాజ్, గ్రామీ ణాభివృద్ధి శాఖ డైరెక్టర్ దివ్యాదేవరాజన్ ప్రత్యేక చొరవతో సెర్ప్, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మధ్య సమన్వయానికి ప్రత్యేక యంత్రాంగం ఏర్పా టు చేశారు. దీంతో మహిళా భవనాల నిర్మాణం కోసం స్థలాల గుర్తింపు నుంచి అనుమతులు, అంచనాలు, నిర్మాణం వరకు అన్ని దశల్లో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ములుగు జిల్లాలో పలు గ్రామాల్లో మంత్రి సీతక్క మహిళా భవనాలకు శంకుస్థాపనలు చేశా రు. అలాగే యాదాద్రి భువనగిరి జిల్లాలో ఆత్మకూరు మండలం సర్వేపల్లి గ్రామంలో ఎస్‌హెచ్‌జి భవనం ప్రారంభమైంది. రంగారెడ్డి జిల్లాలో కేశంపేట మండలం ఆల్వాల్ గ్రామపంచాయతీలో కూడా భవనం పూర్తయింది. ఈ మహిళా భవనాలు గ్రామీణ మహిళలకు ఆత్మగౌరవానికి, ఆర్థిక స్వావలంబనకు, పరస్పర ఐక్యతకు ప్రతీకలుగా నిలవనున్నాయి. మహిళా సంఘాల సమా వేశాలు, శిక్షణా కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి, ఆదాయ వనరుల పెంపు కార్యకలాపాలకు కేంద్రాలుగా మారనున్నాయి. అవసరమైతే మహిళలు తయారు చేసే ఉత్పత్తుల విక్రయ కేంద్రాలుగా కూడా వినియోగించుకునే అవకాశం ఉంటుంది.

### ఆర్థిక బలోపేతానికి కేంద్రాలుగా మహిళా భవనాలు: మంత్రి సీతక్క

ప్రతీ గ్రామంలో మహిళలకు బలమైన వేదిక కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం. ఎస్‌హెచ్‌జి భవనాలు మహిళల ఆర్థిక, సామాజిక బలోపేతానికి కేంద్రాలుగా మారతాయి. మహి ళలు స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించు కోవడా నికి, ఒకచోట చేరి నిర్ణయాలు తీసుకునే వేదికగా ఉప యోగపడనున్నాయి. నిర్దిష్ట కాలంలో భవనాల నిర్మాణాన్ని పూర్తి చేసి మహిళలకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి సీతక్క అన్నారు.

# విద్యుత్ షాక్‌తో మరణిస్తే రూ.8 లక్షలకు పరిహారం పెంపు

### ఈ నెల నుండే అమల్లోకి..

### రూ.7,635 కోట్ల ట్రూఅప్ చార్జీలకు ఆమోదం

### డిస్కంలకు విద్యుత్ నియంత్రణ కమిషన్ ఆదేశాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి ప్రమాదంలో మరణించిన బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసానిచ్చేందుకు ప్రస్తుతం ఇస్తున్న పరిహారాన్ని పెంచుతూ తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్ నిర్ణయించింది. ప్రస్తుతం విద్యుత్ షాక్‌తో మృతి చెందిన కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారాన్ని అందిస్తుండగా, దానికి అదనంగా మరో రూ.3 లక్షలు పెంచింది. దీంతో కరెంట్ షాక్‌తో చనిపోయిన కుటుంబాలకు రూ.8లక్షల చొప్పున పరిహారాన్ని చెల్లించాలని రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలకు విద్యుత్ నియంత్రణ కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ఈ పెంపు ఈ నెల నుంచి అమల్లోకి రావాలని ఆదేశించింది. ఇది బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసాను కల్పించనుంది. ఈ పెంపును ఈ నెల నుంచి అమల్లోకి తీసుకురావాలని డిస్కంలకు సూచించినట్టు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ కమిషన్ స్పష్టం చేసింది. వినియోగదారుల పొరపాటు వల్ల ప్రమాదం జరిగినా ఇవే నిబంధన వర్తిస్తాయని పేర్కొంది. ప్రమాదం జరిగిన రెండు నెలల్లోనే బాధితులకు పరిహారం అందేలా చూడాలని, లేని పక్షంలో డిస్కంలు వివరణ ఇవ్వాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. కాగా గతంలో అనుమతించిన దానికన్నా వ్యయం రూ.7,635 కోట్ల అదనంగా పెరిగడంతో ట్రూ అప్ ఛార్జీలకు విద్యుత్ నియంత్రణ కమిషన్ ఆమోదం తెలిపింది. అయితే ఈ డబ్బును కరెంటు బిల్లుల వసూళ్ల ద్వారా తీసుకోవద్దని తామే నిర్ణయం తీసుకుని తర్వాత చెపుతామని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కమిషన్ దృష్టికి తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో రైతు డిస్కం ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో అది ముగిసేంత వరకు ట్రూ అప్ ఛార్జీలపై నిర్ణయాన్ని వాయిదా వేస్తున్నట్టు ఈఆర్సీ స్పష్టం చేసింది. పర్మిషన్ తీసుకున్న లోడుకన్నా ఎక్కువ కరెంటును యూజ్ చేసే హైటెన్షన్ వినియోగదారుల నుంచి అదనపు సొమ్ము వసూలు చేయడాన్ని సమర్థించినప్పటికీ, దీనిపై వాళ్లకు ఎలాంటి అవగాహన కల్పించకుండా అమల్లోకి తెచ్చినందున తొలి 2 నెలలు వసూలు చేసిన అదనపు బిల్లును తిరిగివ్వాలని డిస్కంలను ఆదేశించింది. రాబోయే 6 నెలల బిల్లుల్లో ఆ మొత్తాన్ని క్లియర్ చేయాలని రాష్ట్ర విద్యుత్ నియంత్రణ కమిషన్ స్పష్టం చేసింది.

## నేటి ప్రజావాణి 7వ తేదీకి వాయిదా

**హైదరాబాద్ (బేగంపేట) ఏప్రిల్ 2, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో నేడు (3ఏప్రిల్) నిర్వహించాల్సిన సీఎం ప్రజావాణీ కార్యక్రమం ఈ నెల 7వతేదీ మంగళవారానికి వాయిదా వేసారు. గుడ్‌ఫ్రైడే కారణంగా 3న జర గాల్సిన సిఎం ప్రజావాణి కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు స్టేట్ నోడల్ అధికారి దివ్యదేవరాజన్ ఒక ప్రకటనలో తెలియజేసారు. దరఖాస్తుదారులు ఈ మార్పును గమనించి ఏప్రిల్ 3వతేదీ (శుక్రవారం) కాకుండా ఏప్రిల్ 7వ తేదీ (మంగళవారం)న ప్రజావాణీ కార్యక్రమానికి హాజరై తమ దరఖాస్తులు అంద జేయవచ్చని స్టేట్ నోడల్ అధికారి ప్రకటనలో తెలియజేసారు.

## ప్రశాంతంగా ప్రారంభమైన జెఇఇ మెయిన్ సెషన్-2 పరీక్షలు

### నేడు 5 నుంచి 8 పరీక్షల అభ్యర్థులకు అడ్మిట్ కార్డులు జారీ

**హైదరాబాద్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:** జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్ సెషన్-2 పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఇందుకు సంబంధించిన అడ్మిట్ కార్డులను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ) మార్చి 30న విడుదల చేసిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 2, 4 తేదీల్లో జరగనున్న పరీక్షలకు సంబంధించిన అడ్మిట్ కార్డుల్ని ఎన్‌టిఏ అధికా రిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. గురువారం దేశ వ్యాప్తంగా పేపర్-1 పరీక్షకు అభ్యర్థులు హాజరయ్యారు. ఈ నెల 4న జరిగే పేపర్-1ను రెండు షిఫ్టుల్లో నిర్వహించనున్నారు. మొదటి షిఫ్టును ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించ నుండగా.. రెండో షిఫ్ట్‌ను మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించనున్నారు. ఏప్రిల్ 5, 6, 7, 8 తేదీల్లో నిర్వహించే పరీక్షకు సంబంధించిన అడ్మిట్ కార్డులను నేడు విడుదల చేసే అవకాశం ఉంది. ఈ ఏడాది జనవరిలో జేఈఈ మెయిన్ సెషన్-1 పరీక్షలు జరగగా ఇప్పటికే వాటి ఫలితాలను సైతం విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఏప్రిల్ 2 నుంచి 8 వరకు సెషన్-2 పరీక్షలు జరగనున్నాయి.

## 76 మంది విద్యా శాఖ సిబ్బందికి షోకాజ్ నోటీసులు



కలెక్టర్ రిజ్వాన్‌బాషా షేక్

**గద్వాల ఏప్రిల్ 2, ప్రభాత వార్త:** జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశా లల్లో ఎఫ్.ఆర్.ఎస్ (ఫేస్ రికగ్నైజ్ సిస్టం) హాజరు విధానం సక్రమంగా నిర్వ హించక పోవడం వలన 76 మంది విద్యాశాఖ సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలలో అమలవుతున్న ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ హాజరు నమోదుపై సమగ్రంగా పరిశీలించగా, పలుచోట్ల ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది ఎఫ్.ఆర్.ఎస్ యాప్‌లో హాజరు సక్రమంగా నమోదు చేయకపోవడం గమనించారు. ఈ నేపథ్యంలోనే కలెక్టర్ జిల్లా పరిధిలోని 61 పాఠశాలలకు చెందిన 76 మంది బోధన, బోధనేతర సిబ్బందిపై చర్యలు తీసుకుంటూ వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. సంబంధిత సిబ్బంది తమ సంజాయిషీని మూడు రోజుల లోపు సమర్పించాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రభుత్వం నిర్దేశించిన విధి విధానాలను కచ్చితంగా పాటించడంతో పాటు, ప్రతి రోజూ ఎఫ్.ఆర్.ఎస్ ద్వారా హాజరును తప్పనిసరిగా సమయానికి నమోదు చేయాలని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. భవిష్యత్తులో ఇటువంటి నిర్లక్ష్యం పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ తీవ్రంగా హెచ్చరించారు. జిల్లాలో విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో భాగంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు.

# హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ రోడ్లలో స్కామ్‌లేదు

### నిప్పలాంటి మనిషిని నేను

### మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**హైదరాబాద్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:** నేను నిప్పు లాంటి మనిషిని ఏ అక్రమాలకు తావులేదు, తెలంగాణ రోడ్ల అభివృద్ధి, హ్యామ్ టెండర్ల విషయంలో తనపై, ప్రభుత్వంపై మాజీమంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి చేస్తున్న అవినీతి ఆరో పణలను ఆర్ అండ్ బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఖండించారు. సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఎప్పుడూ అవినీతికి తావివ్వలేదని ఇదీ నా వ్యక్తిత్వం అని మంత్రి స్పష్టం చేశారు. 'నేను నిప్పు లాంటి వ్యక్తిని. నా రాజకీయ జీవితంలో ఇప్పటి వరకు నాపై ఎలాంటి అవినీతి మరకలు లేవు. కనీసం ఆరోపణలు కూడా లేవు. అలాంటిది నా శాఖపై బురద చల్లాలని చూడటం హాస్యా స్పదం' అని కోమటిరెడ్డి ఆవేదన చెందారు. ప్రశాంత రెడ్డికి రోడ్ల నిర్మాణం. నిబంధనల గురించి అవగాహన లేదని కోమటిరెడ్డి ఎద్దేవా చేశారు. 'రోడ్ల గురించి, టెండర్ల ప్రక్రియ గురించి వేముల ప్రశాంత్ రెడ్డికి కనీస జ్ఞానం లేదని విమర్శించారు. గత పదేళ్లలో రాష్ట్రంలో రోడ్లను అధ్వాన్నంగా మార్చిన వారు ఇప్పుడు మాపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ పద్ధతిలో చేపడుతున్న రోడ్డు పనుల్లో భారీ స్కామ్ జరుగుతుందన్న విమర్శలను ఆయన ఖండించారు. హ్యామ్ రోడ్ల టెండర్లలో ఎలాంటి అవినీతి జరగలేదని, అంతా పారదర్శకంగా జరుగుతోందని వివరించారు. ఈ టెండర్లన్నీ కేంద్ర ప్రభుత్వానికి చెందిన నేషనల్ హైవేస్ అథారిటీ నిబంధనల ప్రకారమే ఖరారు చేసినట్లు స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదని, తప్పుడు ప్రచారాలు నమ్మవద్దని ప్రజలను కోరారు.

# సిఎం రేవంత్‌రెడ్డికి రైతు కమిషన్ కృతజ్ఞతలు

### పారాక్వాట్ నిషేధంపై రైతు కమిషన్ హర్షం

### తెలంగాణ మాదిరిగా దేశవ్యాప్తంగా నిషేధం విధించాలి

**హైదరాబాద్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం పారాక్వాట్ గడ్డి మందును నిషేధించడం హర్షించదగిన పరిణామమని రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. ఈ అంశంపై చర్చించేందుకు గురువారం రైతు కమిషన్ కార్యాలయంలో కమిషన్ చైర్మన్, సభ్యులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అత్యంత విషపూరితమైన పారాక్వాట్ నిషేధించడానికి రాష్ట్ర ప్రభుత్వం బుధవారం జీవో విడుదల చేయడం సంతోషకరమన్నారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డికి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు రైతు కమిషన్ బృందం ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపింది. అత్యంత విషపూరితమైన పారాక్వాట్ వల్ల వందలాది మంది రైతులు తమ ప్రాణాలను కోల్పోయారని ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గడ్డి, కలుపు మందులను నిషేధించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్, రైతు సంఘాల నేతలు రైతు కమిషన్ దృష్టికి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. దీంతో రంగంలోకి దిగిన రైతు కమిషన్ క్షేత్ర స్థాయిలో పర్యటించి, నిపుణులతో రౌండ్ టేబుల్ సమావేశాలను ఏర్పాటు చేసింది. విషపూరితమైన పారాక్వాట్‌ను నిషేధించాలని ప్రభుత్వాన్ని కమిషన్ కోరింది. రైతు కమిషన్ సూచన మేరకు అసెంబ్లీలో ప్రభుత్వం తీర్మానం పెట్టడం, బుధవారం జీవో విడుదల చేయడం సంతోషకరమని ఛైర్మన్ కోదండరెడ్డి అన్నారు. రాష్ట్రంలో గడ్డి మందు నిషేధించడంతోపాటు దేశంలో కూడా నిషేధించడానికి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయడం కూడా శుభ పరిణామమని తెలిపారు. ఇక రైతులు కూడా విషపూరితమైన గడ్డి కలుపు మందుల వైపు వెళ్లొద్దని కమిషన్ చైర్మన్, సభ్యులు కోరారు. ప్రాణాలకు హాని చేయని, నేలను పాడుచేయని కలుపు మందులను వాడాలని సూచించారు. వీలైతే కలుపు తీసే యంత్ర పరికరాలు వినియోగిస్తే మంచిదన్నారు. ఈ సమావేశంలో కమిషన్ చైర్మన్ కోదండరెడ్డితోపాటు సభ్యులు కేవీఎన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, భవానీరెడ్డి, భూమి సునీల్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ కోదండరెడ్డిని కమిషన్ సభ్యులు శాలువాతో సత్కరించారు

# ఫెయిలైన ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీకి ప్రత్యేక తరగతులు

### ఫలితాలు వెలువడిన మరుసటి రోజు నుంచే క్లాసులు ప్రారంభం

**హైదరాబాద్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివి ఇంటర్‌లో ఫెయిలైన విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల కోసం ప్రత్యేకంగా తరగతులను నిర్వహించాలని ఇంటర్ విద్య శాఖ భావిస్తోంది. ఈ నెల 10న గానీ 11న ఇంటర్ ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ఫలితాల్లో ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేకంగా స్పెషల్ క్లాసులను తీసుకోవాలని ఇంటర్ విద్య శాఖ భావిస్తోంది. ఫెయిలైన మొదటి సంవత్సరం విద్యార్థులతో పాటు, సెకండియర్ విద్యార్థులకు కూడా స్పెషల్ క్లాసులు తీసుకొని ఉత్తీర్ణతా శాతాన్ని పెంచుకోవాలని ఇంటర్ విద్య శాఖ నిర్ణయించింది. అందులో భాగంగా ఫలితాలు వెలువడిన మరుసటి రోజు నుంచే ఈ స్పెషల్ క్లాసులను నిర్వహించనున్నారు.

ఇప్పటికే రాష్ట్రంలోని జూనియర్ కాలేజీలకు సెలవులు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఇంటర్ జవాబుపత్రాల మూల్యాంకనం కూడా పూర్తయిన నేపథ్యంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు సెలవులు ఉన్నప్పటికీ జూనియర్ లెక్చరర్లను ప్రత్యేక తరగతుల కోసం రావల్సి ఉంటుందని ఇప్పటికే మౌఖికంగా తెలియజేసినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఈ నెల 10న గానీ 11న గానీ ఇంటర్ ఫలితాలు వెలువడిన మరుసటి రోజు నుంచి ప్రత్యేక తరగతులను నిర్వహించనున్నారు.
రాష్ట్రంలో ఇంటర్ పరీక్షలు ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు జరిగిన విషయం తెలిసిందే. వారిలో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులు సుమారు 1.80 లక్షల మంది విద్యార్థులు ఇంటర్ వార్షిక పరీక్షలకు హాజరయ్యారు. ఇంటర్ పరీక్షల ఫలితాలను ఈ నెల 10న విడుదల చేయడానికి ఇంటర్ బోర్డు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ నెల 10న ఫలితాలు విడుదల చేయకపోతే 11న గానీ లేదంటే 13న గానీ ఫలితాలను ప్రకటించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

ఇంటర్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనాన్ని మార్చి 15 నుంచి 20 కేంద్రాల్లో ప్రారంభించారు. ఈ నెల 1తో మూల్యాంకన ప్రక్రియ ముగిసింది. ఫలితాలకు సంబంధించిన క్రోడీకరణ పనులకు ఇంటర్ బోర్డు అధికారులకు కనీసం 8 రోజులు పట్టే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 9 నాటికి ఫలితాల క్రోడీకరణ పనులు సైతం పూర్తి కానున్నాయి. ఆ తరువాత ఈ నెల 10న ఫలితాలను విడుదల చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఫలితాల విడుదలకు సంబంధించి ప్రభుత్వ పెద్దల అందుబాటును దృష్టిలో పెట్టుకొని ఈ నెల 10న ఫలితాల విడుదలకు అవకాశం ఉన్నట్టు తెలిసింది. 10న జరగకపోతే 11న గానీ లేకపోతే 13న ఇంటర్ ఫలితాలు విడుదలయ్యే అవకాశం ఉంది.

# పిఆర్సీ నివేదిక విడుదలలో జాప్యం చేయొద్దు

### ప్రభుత్వానికి టిజిఇజెఎసి డిమాండ్

**హైదరాబాద్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల వేతనాల సవరణకు సంబంధించిన పీఆర్సీ నివేదిక విడుదలలో ఆలస్యం చేయొద్దని తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. పీఆర్సీ నివేదికను వెంటనే విడుదల చేయాలని టీజీఈజేఏసీ డిమాండ్ చేసింది. నివేదికను వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ టీజీఈజేఏసీ చైర్మన్ మారం జేగదీష్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాస్ గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకి లేఖ రాశారు. 2023లో ఏర్పాటు చేసిన పీఆర్సీ కమిటీ ఇప్పటికే ఉద్యోగ సంఘాల అభిప్రాయాలను సేకరించి సమీక్ష పూర్తి చేసినప్పటికీ, ఇప్పటివరకు నివేదిక విడుదల కాలేదని దానిమూలంగా ఉద్యోగుల్లో అసంతృప్తి పెరుగుతోందని జేఏసీ తన లేఖలో పేర్కొంది. పెరుగుతున్న ద్రవ్యోల్బణం కారణంగా ఉద్యోగుల ఆదాయం, ఖర్చుల మధ్య భారీ అంతరం ఏర్పడిందన్నారు. పిల్లల విద్య, వైద్యం, గృహ రుణాల ఈఎంఐలు వంటి అవసరాలను తీర్చుకోవడం కష్టమైందని, చాలా మంది ఉద్యోగులు నెలకు సుమారు రూ.20 వేల వరకు లోటుతో జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పీఆర్సీ సిఫార్సులు 2024 ఏప్రిల్ నాటికే రావాల్సి ఉన్నప్పటికీ, ఆలస్యం కారణంగా ఉద్యోగులు తమ హక్కులను కోల్పోతున్నారని జేఏసీ అభిప్రాయపడింది. ఆలస్యం చేయకుండా వెంటనే నివేదికను విడుదల చేసి అమలు చేయాలని, గడువును మరింత పొడిగించవద్దని ప్రభుత్వానికి రాసిన లేఖలో జేఏసీ కోరింది.

# రేపటితో ముగియనున్న ఎప్‌సెట్ దరఖాస్తు గడువు

### ఇప్పటి వరకు 2.70 లక్షల దరఖాస్తులు

### అపరాధ రుసుంతో మే 2 వరకు అవకాశం

**హైదరాబాద్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు నిర్వహించే ఈఏపి(ఎప్) సెట్-2026కి సంబంధించిన దరఖాస్తు గడువు రేపటి(ఏప్రిల్ 4)తో ముగియనుంది. అపరాధ రుసుంతో మే 2 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ఇప్పటి వరకు 2.70 లక్షలకిపైగా దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటి వరకు ఇంజనీరింగ్‌కి 1.90 లక్షల దరఖాస్తులు రాగా, అగ్రికల్చర్, ఫార్మసీకి 79వేల దరఖాస్తులు వచ్చాయి. ఫిబ్రవరి 14న నోటిఫికేషన్ జారీ చేయగా.. ఫిబ్రవరి 19 నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించడం ప్రారంభించారు.

రేపటి(ఏప్రిల్ 4) వరకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా దరఖాస్తులను స్వీకరించనున్నారు. అపరాధ రుసుం రూ. 10వేలతో మే 2 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. పరీక్ష ఫీజు ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ అభ్యర్థులకు రూ. 500 కాగా.. ఇతరులకు రూ. 900గా నిర్ణయించారు. రెండు పరీక్షలకు హాజరయ్యే ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ అభ్యర్థులకు రూ. 1000 కాగా, ఇతరులకు రూ. 1800గా నిర్ణయించారు. ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఏప్రిల్ 4 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు.

రూ. 250 అపరాధ రుసుంతో ఏప్రిల్ 10 వరకు, రూ. 500తో ఏప్రిల్ 15 వరకు, రూ. 2500తో ఏప్రిల్ 20 వరకు, రూ. 5000 అపరాధ రుసుంతో ఏప్రిల్ 24 వరకు స్వీకరించనుండగా.. అపరాధ రుసుం రూ. 10వేలతో మే 2 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. అగ్రికల్చర్ పరీక్షలను మే 4, 5 తేదిల్లో నిర్వహించనుండగా.. మే 9 నుంచి 11 వరకు ఇంజనీరింగ్ పరీక్షలను నిర్వహించనున్నారు.

# దోపిడీ, అన్యాయరహిత సమాజ కాంక్షతో పోరాడిన త్యాగశీలి

### సర్వాయి పాపన్న వర్ధంతి సందర్భంగా ఘన నివాళి

### పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:** దోపిడీ అన్యాయరహిత సమాజ నిర్మాణ కాంక్షతో పోరాడిన త్యాగశీలి సర్దార్ సర్వాయి పాపన్న అని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ కొనియాడారు. గాంధీ భవన్‌లో గురువారం సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని చిత్రపటానికి టిపిసిసి కల్లు గీత కార్మిక చైర్మెన్ నాగరాజు, టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ కుమార్ రావులు పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. టిపిసిసి చీఫ్ మాట్లాడుతూ ప్రజల స్వాభిమానం కోసం పోరాడిన మహా యోధుడు, సామాజిక న్యాయం కోసం జీవితాన్ని అంకితం చేసిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి సందర్భంగా ఆయన ఆలోచన విధానంతో యువత స్ఫూర్తి పొందాలని కోరారు. పాపన్న దోపిడీ, అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప నాయకుడని టిపిసిసిచీఫ్ అన్నారు. సామాన్య ప్రజల హక్కుల కోసం ఆయుధం ఎత్తి, అణగారిన వర్గాలకు అండగా నిలిచిన ఆయన ధైర్యసాహసాలు తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. సామాజిక సమానత్వం, స్వాభిమానం కోసం పాపన్న చేసిన త్యాగాలు చిరస్మరణీయమని, ఆయన చూపిన మార్గంలో నడవడం ద్వారా మాత్రమే నిజమైన ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయగలమని అన్నారు. యువత ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని సమాజ సేవలో ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో టిపిసిసి జనరల్ సెక్రటరీ అల్లం భాస్కర్, టిపిసిసి కల్లు గీత కార్మిక వైస్ చైర్మన్లు దుర్గేష్, భాస్కర్ గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ భాస్కర్ గౌడ్ తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# లాసెట్, పిజి లాసెట్ దరఖాస్తు గడువు పెంపు

### 10 వరకు అవకాశం.. అపరాధ రుసుంతో మే 13 వరకు స్వీకరణ

**హైదరాబాద్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు లా కాలేజీల్లో 3 సంవత్సరాలు, 5 సంవత్సరాల లా కోర్సులో చేరడానికి నిర్వహించే లాసెట్-2026కి సంబంధించిన దరఖాస్తు గడువును పొడిగించారు. ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 10 వరకు స్వీకరించనున్నట్టు అధికారులు ప్రకటించారు. ఇప్పటి వరకు సుమారు 43వేల దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ ఫిబ్రవరి 8న జారీ చేయగా.. ఫిబ్రవరి 10 నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నారు. ఎల్ఎల్ఎంలో చేరడానికి నిర్వహించే పీజీ లాసెట్-2026 దరఖాస్తులను కూడా ఈ నెల 10 వరకు అపరాధ రుసుం లేకుండా స్వీకరించనున్నారు. అపరాధ రుసుం లేకుండా ఏప్రిల్ 1 వరకు ఉన్న దరఖాస్తు గడువును అభ్యర్థుల విజ్ఞప్తుల మేరకు ఈ నెల 10 వరకు పొడిగిస్తున్నట్టు లాసెట్ అధికారులు ప్రకటించారు. అపరాధ రుసుంతో మే 13 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. లా సెట్‌కి దరఖాస్తు ఫీజును జనరల్ అభ్యర్థులకు రూ. 900గా నిర్ణయించగా, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ అభ్యర్థులకు రూ. 600గా నిర్ణయించారు. ఇక పీజీ లాసెట్ ఫీజును జనరల్ వారికి రూ 1100గా నిర్ణయించగా.. ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ అభ్యర్థులకు రూ. 900గా నిర్ణయించారు. మే 3 నుంచి 8 వరకు దరఖాస్తుల్లో ఉన్న తప్పులను సరిచేసుకోవడానికి ఎడిట్ సౌకర్యం కల్పించారు. మే 12 నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. మే 18న ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు, తిరిగి 12.30 గంటల నుంచి 2 గంటల వరకు 3 సంవత్సరాల లా కోర్సులో చేరడానికి పరీక్షను నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటల నుంచి 5.30 గంటల వరకు 5 సంవత్సరాల లా కోర్సుతోపాటు, ఎల్ఎల్ఎంలో చేరడానికి పరీక్షను నిర్వహిస్తారు. మే 23న ప్రాథమిక కీని విడుదల చేసి, మే 25 వరకు ప్రాథమిక కీపై అభ్యంతరాలను స్వీకరిస్తారు. జూన్ 5న ఫలితాలను విడుదల చేయనున్నారు.

# స్థానిక చట్టసభలే గ్రామ సభలు

### సభ తీర్మానం ద్వారానే ప్రభుత్వ పథకాలు : మంత్రి సీతక్క

**హైదరాబాద్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:** ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన గ్రామ సభలు విజయవంతంగా పూర్తయ్యాయి. గ్రామ స్థాయిలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు నిర్వహించిన ఈ గ్రామ సభలకు ప్రజలు విశేషంగా స్పందించి ఉత్సా హంగా పాల్గొ న్నారు. ప్రతీ గ్రామంలో విధిగా గ్రామ సభలు నిర్వహించారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, సిఎస్ రామకృష్ణారావు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ డైరెక్టర్ దివ్య దేవరాజన్‌తోపాటు ఉన్నతాధికారులు పాల్గొని గ్రామస్థులతో ప్రత్యక్షంగా మమేకమయ్యారు. ములుగు జిల్లాలో మంత్రి సీతక్క పలు గ్రామ సభల్లో పాల్గొని లబ్దిదారుల అభిప్రాయలు తెలుసుకున్నారు. గ్రామ సభల ఉద్దేశాన్ని వివరించారు. పలు గ్రామాల్లో మహిళా భవనాల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ప్రజల జీవితాలను స్పష్టమైన మార్పు తీసుకురావడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, స్థానిక చట్టసభలే గ్రామ సభలని, గ్రామ సభ తీర్మానం ద్వారానే ప్రభుత్వ పథకాలు అమలు చేస్తామన్నారు. సమస్యలను పరిష్కరించుకుంటూ గ్రామాలను అభివృద్ధి పథంలో దూసుకుపోవడానికి గ్రామ సభలు దోహదపడతాయని తెలిపారు. గ్రామాల అభివృద్ధిలో గ్రామంలోని ప్రతి ఒక్కరు పాలుపంచుకోవాలని, ప్రతి మహిళను మహిళా సంఘాలలో చేర్పించడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ సభలు విజయవంతం చేసిన పంచాయతీ రాజ్, జిల్లా అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన గ్రామ సభలకు సుమారు 15 లక్షల మంది ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వివిధ శాఖలకు చెందిన 75 వేల మంది అధికారులు పాల్గొని లబ్ధిదారుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. మహిళా సాధికారతకు ప్రతీకగా 3.76 లక్షల మంది మహిళా స్వయం సహాయక బృందాల సభ్యులు సభల్లో చురుకుగా పాల్గొన్నారు. వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారులు 4.66 లక్షల మంది హాజరై తమ అనుభవాలను పంచుకున్నారు.



మంత్రి సీతక్క ఆదేశాల మేరకు రాష్ట్రంలోని 12,450 గ్రామ పంచాయతీల్లో ఫిర్యాదు బాక్సులు ఏర్పాటు చేసి ప్రజల సమస్యలను నేరుగా స్వీకరించే వ్యవస్థను బలోపేతం చేశారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన ఈ గ్రామ సభల్లో గ్రామాల్లో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను అధికారులు సమగ్రంగా వివరించారు. లబ్ధిదారుల అభిప్రాయాలను తెలుసుకొని, వారి సమస్యలను నమోదు చేశారు. పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యం వంటి పథకాల వల్ల తమకు కలిగిన మేలు గురించి లబ్ధిదారులు భావోద్వేగంతో వివరించడం విశేషం. ఇప్పటికే అమలులో ఉన్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, రాబోయే రోజుల్లో అమలు చేయబోయే పథకాలపై కూడా చర్చించారు. ఇంకా పథకాల లబ్ధి పొందని అర్హులైన పేదలు తమ దరఖాస్తులను గ్రామ పంచాయతీ కార్యదర్శి వద్ద సమర్పించాలని అధికారులు తెలిపారు. గ్రామాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, కొత్త దరఖాస్తుల స్వీకరణలో గ్రామ సభలు కీలక వేదికగా నిలుస్తున్నాయని అధికారులు తెలిపారు. ప్రజల సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని మరింత సమర్థవంతమైన పాలన అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

## ప్రధాని మోడీతో బండి సంజయ్ భేటీ

### కరీంనగర్ కార్పొరేషన్‌ను కైవసం చేసుకోవడంపట్ల ప్రధాని సంతోషం

**హైదరాబాద్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రధానమంత్రి నరేంద్రమోడీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌ను బిజెపి కైవసం సాధించిన విషయాన్ని ఈ సందర్భంగా వీరి మధ్య ప్రస్తావనకు రాగా ప్రధాని మోడీ సంతోషం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో కేంద్ర నిధులు, అభివృద్ధి నినాదంతోనే ప్రజల్లోకి వెళ్లామని విషయాన్ని ఈ సందర్భంగా బండి సంజయ్ ప్రధాని దృష్టికి తీసుకొచ్చారు. దీంతోపాటు మోడీ గిఫ్ట్ పేరుతో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ స్కూళ్లలో టెన్త్ విద్యార్థులందరికీ ఉచితంగా బ్రాండెడ్ సైకిళ్లను అందించిన అంశాన్ని ప్రస్తావించారు. నూతనంగా గెలిచిన కరీంనగర్ కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధుల పక్షాన ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని ప్రజలకు నిరంతరం సేవ చేయడంలోనే తృప్తి ఉంటుంది. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు కృషి చేయాలని, అట్టడుగు వర్గాల ప్రజలకు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంలో నిర్విరామంగా పనిచేయాలని ప్రధాని సూచించారని తెలిపారు.



సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బిసి నేతలు

## సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ స్ఫూర్తితో బిసిలు రాజ్యాధికార సాధనకు కృషి చేయాలి

### బిసి నేతల పిలుపు

**హైదరాబాద్(సైఫాబాద్), ఏప్రిల్ 2, ప్రభాతవార్త:** ప్రథమ బహుజన రాజ్య స్థాపకుడు, భారత తొలితెలుగు విప్లవవీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పోరాటస్ఫూర్తితో రాబోయేది బహుజనుల రాజ్యమని, ఇందుకోసం బహుజనులంతా ఐక్యంగా రాజ్యాధికార సాధన కోసం కృషి చేయాలని పలువురు బిసి నాయకులు పిలుపునిచ్చారు. అత్యధిక జనాభా కలిగిన బిసిలకు పాలకులు రాజ్యాధికారంలో వాటా కల్పించకుండా అన్యాయం చేస్తున్నారని నాయకులు ఆరోపించారు. గౌడ సంఘాల సమన్వయ కమిటీ, బిసి పొలిటికల్ ఫ్రంట్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 316వ వర్ధంతి సభలో బిసి నాయకులు ప్రసంగించారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చేసిన బహుజన రాజ్యాధికార పాలన, పోరాటాలు, సేవలు చరిత్రలో భవిష్యత్ తరాలకు ఆదర్శంగా ఉండేందుకు ఆయన విగ్రహాన్ని 50, 60 అడుగుల ఎత్తులో ట్యాంక్‌బండ్‌పైన ఆగస్టు 18లోగా ప్రతిష్టించాలని వారు డిమాండ్ చేశారు. మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ మహిళల రిజర్వేషన్‌లలో బిసి మహిళలకు సబ్‌కోటా కల్పించాలని, కేంద్రంలో బిసి మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బిసి ఇంటలెక్చువల్ ఫోరం ఛైర్మన్ చిరంజీవులు మాట్లాడుతూ బిసిలంతా జాతి ఐక్యత గురించి ఆలోచించాలన్నారు. అరుణోదయ సాంస్కృతిక సంస్థ అధ్యక్షురాలు విమలక్క మాటాడుతూ చత్రపతి శివాజీ, సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ సమకాలికులని, కాని శివాజీ చరిత్ర వెలుగులోకి వచ్చినంతగా పాపన్నగౌడ్ చరిత్ర రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఫ్యూచర్ సిటీలో అభివృద్ధి పనులపై సిఎస్ చర్చ



అభివృద్ధి పనులను సమీక్షిస్తున్న సిఎస్ రామకృష్ణారావు

**కందుకూరు, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కే. రామకృష్ణారావు గురువారం సమగ్ర సమీక్ష నిర్వహించారు. కందుకూరు మండలం మీర్కాన్‌పేట్ పరిధిలోని పవర్‌గ్రిడ్ సమీపంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎనర్జీ విభాగం స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్ ఐఎఎస్, ఎఫ్‌సీడీఏ కమిషనర్ కే. శశాంక్ ఐఎఎస్, జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి, మహేశ్వరం జోన్ డీసీపీ కె. నారాయణరెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు. ఫ్యూచర్ సిటీ పరిధిలో జరుగుతున్న కీలక అభివృద్ధి పనులపై సీఎస్ విస్తృతంగా సమీక్షించారు. ముఖ్యంగా ఎఫ్‌సీడీఏ కార్యాలయ భవన నిర్మాణం, స్కిల్ యూనివర్సిటీ నిర్మాణ పనులు, రతన్ టాటా గ్రీన్ ఫీల్డ్ రోడ్డు ప్రాజెక్టు, భవిష్యత్తులో ఏర్పాటు చేయనున్న ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ భవన సముదాయం తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. అనంతరం ఫ్యూచర్ సిటీ భవన సముదాయాన్ని ప్రత్యక్షంగా పరిశీలించిన సీఎస్, ప్రాజెక్టు పరిధిలోకి వచ్చే ప్రాంతాల వివరాలు, రోడ్డు కనెక్టివిటీ, మౌలిక సదుపాయాల ప్రణాళికలపై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను వీక్షించారు. ఈ సందర్భంగా సంబంధిత అంశాలపై ఎఫ్‌సీడీఏ కమిషనర్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ అధికారులు, అలాగే రెవెన్యూ, విద్యుత్, పోలీస్ శాఖల స్థానిక అధికారులు పాల్గొన్నారు.

## ధర్మపురిలో ప్రమాదం.. ముగ్గురు దుర్మరణం

### మరో 8 మందికి గాయాలు

**ధర్మపురి,ప్రభాతవార్త.** మరో పది నిమిషాల్లో తమ ఇండ్లకు చేరుకొని,కుటుంబ సభ్యులతో కలిసి నిద్రించాల్సిన యువకులు రోడ్డు ప్రమాదానికి గురై, అక్కడికక్కడే ముగ్గురు యువకులు మరణించిన విషాద సంఘటన బుధవారం రాత్రి ధర్మపురి పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ధర్మపురి కి చెందిన మాదాసు అమర్ నాథ్, అబ్బాపూర్ గ్రామానికి చెందిన పడాల రిశ్వంత్(16), రేచపల్లి గ్రామానికి చెందిన కోల మయాంక్ (15) అనే ముగ్గురు స్నేహితులు కలిసి జగిత్యాల్లో ఉంటున్న తమ స్నేహితులను కలవడానికి బుధవారం ఉదయం జగిత్యాల్ వెళ్లారు. సదరు ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంపై రాత్రివేళ తిరుగు ప్రయాణమయ్యారు. ధర్మపురి శివారుకు చేరుకోగానే ధర్మపురి నుండి జగిత్యాల వైపు వెళ్తున్న సిమెంట్ లోడ్ తో ఉన్న ఏపీ15 బి ఎస్ 8585 నంబర్ గల లారీ వేగంగా యువకులు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టగా ముగ్గురు యువకులు బైక్ పై నుండి పడిపోయి అక్కడికక్కడే మరణించారు. ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన అనంతరం లారీ అదుపుతప్పి రోడ్డుపై వెళ్తున్న ఆటోను ఢీకొట్టగా, ఆటోలో ప్రయాణిస్తున్న 8 మంది హనుమాన్ భక్తులకు గాయాలు కాగా, వారిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ పారిపోగా, లారీ నడిపిన డ్రైవర్ మహారాష్ట్రకు చెందిన సయ్యద్ ఖాసీం బాసుమియా గా గుర్తించినట్టు స్థానిక సి ఐ రాం నర్సింహారెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు సి ఐ తెలిపారు. రాష్ట్ర ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గురువారం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి, రగడ సానుభూతిని తెలిపారు.

## కుళ్లిన గొర్రె, మేక మాంసం అవయవాలు విక్రయిస్తున్న ముఠా గుట్టురట్టు

### 12 టన్నుల నిల్వలు స్వాధీనం

### ఒకరు ఆరెస్ట్, పరారీలో మరొకరు

**హైదరాబాద్ (కార్వాన్), ఏప్రిల్ 2, ప్రభాతవార్త:** ప్రజల ఆరోగ్యాన్నిపణంగా పెట్టి కుళ్ళిన,నిల్వ ఉంచిన గొర్రె,మేక మాంసం, కలేజా తదితర అవయవాలు విక్రయిస్తున్న ఒక భారీ నెట్‌వర్క్ ముఠాను హైదరాబాద్ కమిషనర్ టాస్క్ ఫోర్స్(గోల్కొండ టీమ్),హెచ్‌ఫాస్ట్, మంగళ్‌హాట్ పోలీసులు సంయుక్తంగా ఛేదించారు. మంగళ్‌హాట్‌లోని ఏటూజెడ్ షీప్ అండ్ గోట్ ఆఫ్ఫుల్‌ఖి స్టోర్‌పై దాడి చేసి సుమారు 12 టన్నుల కుళ్ళిన మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు.దీని విలువ సుమారు రూ.10,లక్షల రూపాయలు ఉంటుందని పేర్కొన్నారు. నిందితుడు స్టోర్ మేనేజర్ రఫీ అహ్మద్52 అదుపులోకి తీసుకున్నారు.స్టోర్ యజమాని మొహమ్మద్ అఫ్రోజ్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని ఇతనిపై గతంలో జి.హెచ్.ఎం.సి జరిమానా విధించడంతో పాటు, మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదై ఉన్నాయన్నారు. కేసు వివరాలు వెల్లడిస్తూ... నిందితుడు రఫీ అహ్మద్, యజమాని అఫ్రోజ్ సహాయంతో ఇతర రాష్ట్రాల నుండి హోల్‌సేల్ మార్కెట్ నుండి తక్కువ ధరకు కుళ్ళిన, పాడైపోయిన గొర్రె, మేక అవయవాలను సేకరించేవాడని, ఈ మాంసాన్ని మంగళ్‌హాట్, అమాన్ నగర్ కాలనీలోని తమ స్టోర్‌లో నిల్వ చేసేవారన్నారు. మాంసం కుళ్లిపోకుండా, దుర్వాసన రాకుండా ఉండేందుకు డీప్ ఫ్రీజర్లలో నిల్వ ఉన్న నీటితో నింపిన ప్లాస్టిక్ టబ్బులలో ఎక్కువ కాలం నిల్వ ఉంచేవారని,ఈ కుళ్ళిన మాంసాన్ని తాజా మాంసంగా నమ్మించి హోటళ్లకు, శుభకార్యాలకు, ఇతరత్ర ఈవెంట్లకు సరఫరా చేసేవారని,ఇలాంటి పాడైపోయిన మాంసాన్ని తినడం వల్ల ప్రజలకు తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు.నిందితులపై మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్‌లో పలు సెక్షన్ ల క్రింద కేసు నమోదు చేశారు.ఈ ఆపరేషన్ హైదరాబాద్ సిటీ టాస్క్ ఫోర్స్ అడిషనల్ డిసిపి అందె శ్రీనివాసరావు పర్యవేక్షణలో గోల్కొండ జోన్ టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఆర్.వెంకటేష్,మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాఘవేంద్ర, ఎస్.ఐలు కె.వెంకటరమణ,టి అనుష తదితర సిబ్బంది పాల్గొన్నారు.



కుళ్లిన గొర్రె, మేక మాంసం, గురుదా, కలేజా తదితర అవయవాలు

## 18న మక్తల్ మున్సిపాలిటీ ఆరో వార్డుకు పోలింగ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్2:** మక్తల్లో బిజెపి అభ్యర్థి ఎరుకలి మహాదేవప్ప మరణం వల్ల వాయిదా పడిన మక్తల్ మున్సిపాలిటీ ఆరో వార్డు ఎన్నికకు షెడ్యూల్ విడుదలైంది. ఈ నెల 18వ తేదీ పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించి, ఈ నెల 20వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర ఎన్నికల సంఘం(ఎస్ఐసి) నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 2 నుంచి 6 వరకు బిజెపి అభ్యర్థి నామినేషన్ స్వీకరించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ.రాణి కుముదిని తెలిపారు. ఈనెల 7న నామినేషన్ పరిశీలన, 8న అప్పీల్‌కు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈనెల 18వ తేదీన ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించి, ఈ నెల 20వ తేదీన ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఓట్ల లెక్కింపు పూర్తయిన వెంటనే ఫలితాలు ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. ఏదైనా కారణాలతో రీ పోలింగ్ అవసరమైతే మరుసటి రోజు అంటే ఈ నెల 19న పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.



## పౌల్ట్రీ రంగంలో నష్టపోయేది కోళ్లను పెంచే రైతు మాత్రమే

### రిటైల్ దుకాణదారుల వల్లే వినియోగదారులకు భారం: బిఐసిసి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 2:** పౌల్ట్రీ రంగం మూడు స్థాయి వ్యవస్థలో పనిచేస్తుందని, బ్రాయిలర్ చికెన్ ఉత్పత్తిదారులు, హోల్సేల్ వ్యాపారులు, రిటైల్ దుకాణదారులు ఉంటారని, కానీ కోళ్లను పెంచిన రైతు, చికెన్ తినే వినియోగదారులు నిజంగా నష్టపోయేవారని, అయితే మధ్యలో ఉన్నవారు లాబాలు పొందుతున్నారని బ్రాయిలర్ ఇంటిగ్రేషన్ కోఆర్డినేషన్ కమిటీ తెలిపింది. చికెన్ రిటైల్ దుకాణదారుల తీరు వల్లే వినియోగదారులపై భారంగా మారిందని పేర్కొంది. పూర్తిగా నష్టం లేకుండా, తక్కువ పెట్టుబడితో, ఎటువంటి రిస్కు లేకుండా నడిచే వ్యాపారం ఉందంటే అది చికెన్ రిటైల్ దుకాణమే.చికెన్ రిటైల్ దుకాణదారులు సమ్మె చేస్తామని హెచ్చరిస్తున్నారని, కంపెనీలు తమ లాభాల వాటాను పెంచాలని కోరడం సరైంది కాదని పేర్కొంది.. ప్రతి రోజు విక్రయించే ప్రతి కిలోపై సమంజసమైన లాభం ఉంటుంది. ఉదాహరణకు: ఈ రోజు లైవ్ బర్డ్ ధర రూ. 130/ (130 ఇంటు 1,65 = 214.5). కానీ పేపర్లో ప్రకటించిన స్కిన్లెస్ చికెన్ రిటైల్ ధర రూ.259/ కాబట్టి వ్యత్యాసం రూ.44.5/, అంటే ప్రతి కిలోపై స్థూల మార్జిన్ ఇది అని పేర్కొంది. ఇంటిగ్రేషన్ కంపెనీలకు, చికెన్ రిటైల్ దుకాణదారులకు మధ్య ఎటువంటి ప్రత్యక్ష సంబంధం లేదు.హోల్సేల్ వ్యాపారులు, చికెన్ రిటైల్ దుకాణదారుల మధ్య మాత్రమే ప్రత్యక్ష సంబంధం ఉంటుందని తెలిపింది..రైతు / ఇంటిగ్రేషన్ కంపెనీ పెట్టుబడి భారం, రిస్క్, సంభావ్య నష్టాలన్నీ వీరు భరిస్తారు.హోల్సేల్ వ్యాపారి కొన్ని రిస్కులు, కార్యాచరణ సవాళ్ళను ఎదుర్కొంటారు. చికెన్ రిటైల్ దుకాణదారులకు ఎటువంటి రిస్క్ లేదా నష్టం ఉండదని పేర్కొంది. మార్కెట్ ధరలు ఎంత తగ్గినా, ఏ హెచ్చుతగ్గులు వచ్చినా వారి మార్జిన్‌కు ఏ నష్టమూ కలగదని వివరించింది. పౌల్ట్రీ రంగం అన్ని ఇతర వ్యాపారాల నుండి భిన్నంగా ఉంటుంది. పౌల్ట్రీ రంగంలో చివరికి నష్టపోయేవారు రైతులు భారీ పెట్టుబడులతో తమ షెడ్లలో చికెన్ ఉత్పత్తి చేసే ఇంటిగ్రేటర్లు మాత్రమేనని తెలిపింది.

## నేటి నుంచి పిసిసి చీఫ్ మహేష్‌కుమార్ జిల్లాల పర్యటన

**హైదరాబాద్,ఏప్రిల్ 2,ప్రభాతవార్త:** టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ శుక్రవారంనుంచి రెండు రోజులు జిల్లాల పర్యటన చేపట్టనున్నారు. నాలుగు జిల్లాలలో డిసిసి కార్యవర్గ సమావేశాలుశుక్రవారం నుంచి ఈ రెండు రోజుల్లో జరుగబోతున్నాయి. శుక్రవారం డిసిసి అధ్యక్షులు రఘు నాథరెడ్డి అధ్యక్షతన జరగనున్నది. మంచిర్యాల జిల్లా కార్యవర్గ సమావేశంలో టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ఈ సమావేశంలో జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి వివేక్, ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు పాల్గొంటారు. సమావేశం అనంతరం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా డిసిసి అధ్యక్షులు ఆత్రం సుగుణ అధ్యక్షతన జరగనున్న కార్యవర్గ సమావేశంలో పాల్గొంటారు. శనివారం ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో డిసిసి అధ్యక్షులు నరేష్ జాదవ్ అధ్యక్షతన కార్యవర్ధ సమావేశంలో పాల్గొంటారు. అనంతరం అక్కడ నుంచి నిర్మల్ జిల్లా డిసిసి అధ్యక్షులు ఎమ్మెల్యే బొజ్జు అధ్యక్షతన జరగనున్న నిర్మల్ జిల్లా డీసీసీ కార్యవర్గ సమావేశంలో పాల్గొంటారు.

## గిరిజన గ్రామాల్లో సోలార్ వెలుగులు - రాష్ట్ర విద్యుత్ శాఖ ఉత్తర్వులు

**హైదరాబాద్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని మారుమూల గిరిజన గ్రామాల్లో సోలార్ వెలుగులు ప్రసరింప చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా తొలుత ములుగు జిల్లాలోని గుత్తికోయ గ్రామాల్లో సోలార్ వెలుగులు నింపేందుకు సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విద్యుత్ సౌకర్యం లేని మారుమూల ఆవాసాలకు స్టోరేజ్ ఆధారిత సోలార్ విద్యుత్ వ్యవస్థలను ఏర్పాటు చేసేందుకు తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీజీ రెడ్కో)కు అనుమతినిస్తూ రాష్ట్రవిద్యుత్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ములుగు జిల్లాలోని 85 మారుమూల గుత్తికోయ ఆవాసాలను ఈ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. ఈ గ్రామాల్లోని మొత్తం 2020 కుటుంబాలకు ఈ సోలార్ సిస్టమ్స్ ద్వారా విద్యుత్ సరఫరా అందనుంది. ఈ సోలార్ పలకాలు ఏర్పాటు తదితర పనుల కోసం మొత్తం రూ. 17.36 కోట్లను కేటాయించింది. రాష్ట్ర పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ పంపిన ప్రతిపాదనలను పరిశీలించిన విద్యుత్ మంత్రిత్వశాఖ, ఆర్థిక శాఖ అంగీకారంతో ఈ మేరకు ఉత్తర్వులను విడుదల చేసింది. ఈ ప్రాజెక్టు అమలుతో విద్యుత్ లేక ఏళ్ల తరబడి చీకటిలో కొట్టుమిట్టాడుతున్న అటవీ ప్రాంతాల్లోని మారుమూల గిరిజన గ్రామాలు అంధకారం నుండి సోలార్ కాంతుల్లోకి రానున్నాయి.

## మారిన ఎస్‌ఏ-2 టైమ్‌టేబుల్

### 8వ తేదీ నుంచి 18 వరకు పరీక్షలు

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఏప్రిల్ 02:** రాష్ట్రంలో 1వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు నిర్వహించే సమ్మేటీవ్ అసెస్‌మెంట్(ఎస్‌ఏ)-2 పరీక్షల షెడ్యూల్‌లో మార్పు చేశారు. ఈ నెల 10 నుంచి ప్రారంభం కావల్సి ఉన్న ఎస్‌ఏ-2 పరీక్షలను ఈ నెల 8 నుంచి ప్రారంభించనున్నట్టు ఎస్‌సీఈఆర్‌టీ ప్రకటించింది. తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ(టాస్) పరీక్షల నేపథ్యంలో గతంలో ప్రకటించినట్టుగా ఎస్‌ఏ-2 పరీక్షలను ఈ నెల 10 నుంచి 20 వరకు కాకుండా.. ఈ నెల 8 నుంచే ప్రారంభించి 18 వరకు కొనసాగించనున్నట్టు ప్రకటించింది. 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు, 8వ తరగతి విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి 11.45 గంటల వరకు పరీక్షలను నిర్వహిస్తారు. ఇక 9వ తరగతి విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎస్‌ఏ-2 పరీక్షలను నిర్వహించనున్నారు. ఎస్‌సీఈఆర్‌టీ సూచించిన మార్పు షెడ్యూల్‌ను రాష్ట్రంలోన్ని అన్ని పాఠశాలలు అమలు చేయాలని పాఠశాల విద్య డైరక్టర్ నవీన్ నికోలస్ డీఈవోలను ఆదేశించారు.





బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయం

## బడంగ్‌పేట్ మున్సిపాలిటీలో 122 కోట్లు పక్కదారి?

### పారిశుధ్యం, ఇంజినీరింగ్ పనుల్లో నిధుల దుర్వినియోగం

### అవినీతి ఆఫీసర్లపై జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ వేటు

### డిసి సరస్వతిసహా మరో తొమ్మిది మంది అధికారుల సస్పెన్షన్

**హైదరాబాద్ (సరూర్‌నగర్) ఏప్రిల్ 2 ప్రభాతవార్త:** గతేడాది డిసెంబర్ లో జీహెచ్‌ఎంసీలో విలీనమైన బడంగ్ పేట మున్సిపాలిటీలో అవినీతి అక్రమాలకు పాల్పడిన అధికారులపై వేటు పడింది. డిప్యూటీ కమిషనర్ సహా 10 మంది అధికారులను సస్పెండ్ చేస్తూ జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఉత్తర్వులు జారీ చేశారు. పారిశుద్ధం, ఇంజినీరింగ్ పనుల్లో 122 కోట్ల రూపాయల నిధులు దుర్వినియోగం జరిగినట్లు విజిలెన్స్ విచారణలో తేలడంతో ఆర్వీ కర్ణన్ సంబంధిత అధికారులను సస్పెండ్ చేశారు. విలీనానికి ముందే రికార్డులు మాయం చేశారని, విధానపరమైన ఉల్లంఘనలు జరిగినట్లు గుర్తించారు. కౌన్సిల్ ఆమోదం, ప్రత్యేక అధికారి అనుమతి లేకుండానే రెండేళ్లలో రూ.122 కోట్ల నిధులు పక్కదారి పట్టినట్లు సమాచారం. ప్రస్తుతం బడంగ్‌పేట్ సర్కిల్-16 డిప్యూటీ కమీషనర్‌గా పని చేస్తున్న పి.సరస్వతి, గతంలో బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్‌గా పని చేసిన జి.రఘు (ప్రస్తుతం డిటిఅండ్‌సిపి బిల్డ్‌నౌ సెల్), డిఇఇలు వెంకన్న, జ్యోతి, ఎ.యాదయ్య, ఎఇఇ వినీల్‌కుమార్ గౌడ్, సానిటరీ ఇన్స్‌పెక్టర్ వంకాయల యాదగిరి, మేనేజర్/అసిస్టెంట్ మున్సిపల్ కమీషనర్లు జి.శ్రీధర్‌రెడ్డి, డి.నాగేశ్వర్‌రావులతో పాటు స్టేట్ ఆడిట్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ప్రీ ఆడిట్ ఆఫీసర్ ఎన్.వెంకట్‌లు సస్పెండ్ అయిన వారిలో ఉన్నారు. ఇంజనీరింగ్, సానిటేషన్ పనుల్లో భారీ అవినీతికి పాల్పడి కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని కొల్లగొట్టారని విచారణ జరిపిన అధికారుల నివేదికలు అందడంతో కమీషనర్ కఠిన చర్యలు తీసుకున్నారు. పనులు చేయకుండానే బిల్లులు, గతంలో చేసిన పనులకే మళ్లీ టెండర్ నోటిఫికేషన్లు ఇవ్వడం, ఇష్టారాజ్యంగా అనుమతులు జారీ చేయడం తదితర ఆరోపణలపై ఎసిబి విచారణ చేసింది. ఆ తర్వాత జిహెచ్‌ఎంసి కమీషనర్ ఆదేశాల మేరకు రంగంలో దిగిన విజిలెన్స్ అధికారులు కొన్ని రోజుల పాటు బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోనే మకాం వేసి రికార్డులు, ఫైళ్లు, ఎంబిలను క్షుణ్ణంగా పరిశీలన జరిపారు. అయితే విచారణలో కొన్ని ముఖ్యమైన ఫైళ్లు కనిపించకపోవడంతో మాయం చేశారని సంగతిని గుర్తించారు. ఎట్టకేలకు విచారణ పూర్తి చేసిన అధికారులు నివేదికలు సమర్పించడంతో ఇక ఏమాత్రం ఉపేక్షించకుండా కమీషనర్ సస్పెన్షన్ల వేటు వేశారు. సస్పెండ్‌కు గురైన అధికారుల్లో కొందరు బడంగ్‌పేట్ సర్కిల్‌లో పని చేస్తుండడం మరి కొందరు వేరే చోట్ల పని చేస్తుండడం గమనార్హం.

## మంత్రి తుమ్మలతో ఫ్లోరిడా విశ్వవిద్యాలయ ప్రతినిధుల భేటీ

### డిజిటల్, సుస్థిర వ్యవసాయంపై సంయుక్త భాగస్వామ్యానికి ప్రతిపాదన

### ప్రత్యేక పంటల సాగు, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుపై చర్చ

**హైదరాబాద్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:** తెలంగాణలో వ్యవసాయరంగ అభివృద్ధిపై రాష్ట్ర వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో ఫ్లోరిడా విశ్వవిద్యాలయ ప్రతినిధులు చర్చించారు. ఈ మేరకు ఫ్లోరిడా యూనివర్సిటి సహజ వనరులు, పర్యావరణ విభాగం డైరెక్టర్ డా. కె. రమేష్‌రెడ్డి నాయకత్వంలోని ప్రతినిధుల బృందం మంత్రితో సచివాలయంలో గురువారం సమావేశమైంది. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, ఫ్లోరిడా విశ్వవి ద్యాలయం కలిసి పరిశోధన, విస్తరణ, విద్యా రంగాల్లో సంయుక్త భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. తెలంగాణ డిజిటల్ - సుస్థిర వ్యవసాయ వ్యవస్థల కేంద్రం స్థాపనపై కూడా చర్చించారు. డిజిటల్ వ్యవసాయం, ఎఐ ఆధారిత వ్యవస్థలు, రిమోట్ సెన్సింగ్, డ్రోన్ టెక్నాలజీ వంటి ఆధునిక పద్ధతులను వ్యవసాయరంగంలో ప్రవేశపెట్టే అవకాశం ఉందని సమావేశం నిర్ణయించింది. వాతావరణ మార్పులకు అనుగుణమైన పంటలు అభివృద్ధి, నేల ఆరోగ్య సంరక్షణ, నీటి వినియోగ సమర్థత పెంపు వంటి అంశాలపై ప్రతినిధులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ప్రత్యేకంగా తెలంగాణలో స్ట్రాబెర్రీ, బ్లూబెర్రీ వంటి అధిక విలువ పంటల సాగు, అలాగే వాటికి సంబంధించిన ప్రాసెసింగ్ టెక్నాలజి పరిశ్రమల స్థాపన ద్వారా రైతులకు అధిక ఆదాయం అందించే అవకాశాలపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. తెలంగాణలో ఫుడ్ ప్రాసెసింగ్, విలువ ఆధారిత పరిశ్రమలను అభివృద్ధి చేసి, రైతులకు మార్కెట్ అవకాశాలను విస్తరించే దిశగా కలిసి పనిచేయాలని ప్రతినిధులు సూచించారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని సాంకేతికంగా బలోపేతం చేయడం, రైతుల ఆదాయం పెంచడం దిశగా ఇలాంటి అంతర్జాతీయ భాగస్వామ్యాలు కీలక పాత్ర పోషిస్తాయని ఈ సందర్భంగా మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల అమలుకు సంబంధించి టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

## ఖజానాకు రూ.15 వేల కోట్ల రిజిస్ట్రేషన్ల ఆదాయం

### ఈ యేడాది రూ.19 వేల కోట్లకు పెంచిన ఆర్థిక శాఖ

**హైదరాబాద్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త :** తెలంగాణలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ద్వారా రాష్ట్ర ఖజానాకు వచ్చే ఆదాయంలో పెరుగుదల చోటు చేసుకుంది. మార్చితో ముగిసిన 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా ప్రభుత్వ ఖజానాకు మొత్తంగా రూ.15,262.27 కోట్లు ఆదాయం వచ్చినట్లు ఆర్థిక అధికారవర్గాలు తెలిపాయి. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం కంటే రిజిస్ట్రేషన్ల ఆదాయంలో వృద్ధి నమోదైంది. గత 2024-25 ఆర్థిక సంవత్సరంలో వచ్చిన రూ.14,214తో పోలిస్తే 2025-26లో 7.46 శాతం మేర రూ.1,048కోట్లు అదనంగా రిజిస్ట్రేషన్ల ఆదాయం ఖజానకు చేరుకుంది. ఇక ఈ సారి రిజిస్ట్రేషన్లు అయిన డాక్యుమెంట్ల సంఖ్య తగ్గినా ఆదాయ పెరగడం గమనార్హం. 2024-25లో 17.45లక్షల రిజిస్ట్రేషన్ల డాక్యుమెంట్లు నమోదు కాగా, ఈ ఏడాది 2025-26లో ఆ సంఖ్య 17.15లక్షలకు పరిమితమైంది. రూ.కోటి నుంచి రూ.5 కోట్ల లోపు విలువజేసే ఫ్లాట్లు, విల్లాల కొనుగోళ్ల పెరగడమే ఇందుకు కారణమని అధికారులు భావిస్తున్నారు. కాగా ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా రూ.19 వేల కోట్ల ఆదాయ లక్ష్యాన్ని రాష్ట్ర ఆర్థిక శాఖ నిర్దేశించింది.

## మోడీ నాయకత్వంలో అభివృద్ధి దిశగా దేశం

### బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారి శాంతికుమార్

**హైదరాబాద్, మార్చి 2 ప్రభాతవార్త:** కాంగ్రెస్, బిఆర్ ఎస్ పార్టీల నుంచి భారతీయ జనతా పార్టీలో చేరడం సంతోషకరంగా ఉందని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారి శాంతికుమార్ అన్నారు. బుధవారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో వనపర్తి జిల్లా షాపురం, అప్పిరెడ్డిపల్లె గ్రామాల నుంచి నాయకులు, యువత పెద్దఎత్తున భారతీయ జనతా పార్టీలో చేరారు. బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారి శాంతికుమార్ సమక్షంలో ఈ చేరికలు జరిగాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి పోరెడ్డి కిషోర్, వనపర్తి జిల్లా అధ్యక్షుడు డి. నారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శులు పెద్దిరాజు, నివాస్, ఖిలా ఘనపురం మండల అధ్యక్షుడు బుచ్చిబాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుడ్డన్న, పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారి శాంతికుమార్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం రూ. 6 లక్షల కోట్ల అప్పుల్లో ఉన్నప్పటికీ, కాంగ్రెస్ పార్టీ ఈ విషయం తెలిసే గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆరు తప్పుడు వాగ్దానాలు చేసి, అవి అమలు చేయలేమని తెలిసీ ప్రజలను మభ్యపెట్టి గెలిచింది. గెలిచిన తర్వాత కూడా అబద్ధాలు చెబితేనే ప్రజలకు నచ్చుతాయి అన్నట్టుగా బూటకపు, మాయమాటలు చెప్పడం, ఒక్క వాగ్దానాన్ని కూడా నెరవేర్చకపోవడం కాంగ్రెస్ పార్టీ నైజంగా మారిందన్నారు.

అందుకే ప్రజలను మోసం చేసిన బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల అసలు స్వరూపాన్ని గుర్తించిన నాయకులు, కార్యకర్తలు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సుపరిపాలనను, సంక్షేమాన్ని విశ్వసిస్తూ ఈరోజు భారతీయ జనతా పార్టీలో చేరుతున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోనే భారతదేశం అభివృద్ధి చెందుతుందన్నారు.

## సినీథియేటర్లలో రెంటల్ పద్ధతి రద్దు.. కొత్తగా పర్సంటేజ్ సిస్టం

**హైదరాబాద్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని సినిమా థియేటర్ల రెంటల్ పద్ధతిపై ఏర్పడిన వివాదానికి ఫుల్‌స్టాప్ పడింది. ప్రధానంగా సినిమా ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్ల మధ్య దశాబ్దాలుగా రెంటల్ వివాదం నడుస్తోంది. ఈ రెంటల్ విషయంలో ఇరు వర్గాల మధ్య విబేధాలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ లోని థియేటర్ల యాజమాన్యాలు ఓ చారిత్రాత్మక నిర్ణయాన్ని తీసుకున్నాయి. ఇకపై థియేటర్లకు నిర్ణీత అద్దె చెల్లించే రెంటల్ విధానానికి బదులుగా దాని స్థానంలో పర్సంటేజీ సిస్టమ్ అమలు చేయాలని నిర్ణయించాయి. ఈ కొత్త విధానం ప్రకారం థియేటర్లకు వచ్చే వసూళ్లలో వాటాను పంచుకునే పద్ధతి అందుబాటులోకిరానుంది. ఈ కొత్త విధానానికి సంబంధించి రాష్ట్రంలోని 23 ప్రధాన థియేటర్ల యాజమాన్యాలు తమ అంగీకారం తెలిపాయి. ఈ మార్పు ఈ నెల 3వ తేదీ నుండి అధికారికంగా అమలులోకి రానుంది. దీంతో చిత్ర పరిశ్రమలో పంపిణీదారులు ఎదుర్కొంటున్న ఆర్థిక భారం గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న రెంటల్ విధానం ప్రకారం సినిమా రిజల్ట్‌తో (కలెక్షన్లు) సంబంధం లేకుండా డిస్ట్రిబ్యూటర్లు థియేటర్లకు భారీగా అద్దెలు చెల్లించాల్సి వచ్చేది. సినిమా ఫ్లాప్ అయితే పంపిణీదారులు భారీగా నష్టాల పాలై నిలువునా మునిగిపోయేవారు. కానీ, తాజా పర్సంటేజీ విధానంలో థియేటర్ వసూళ్లలో కొంత శాతం యాజమాన్యానికి, డిస్ట్రిబ్యూటర్లకు దక్కుతుంది.

## బిఆర్ఎస్ దోచుకుంటే సైలెంటుగా ఉన్న కేంద్రం.. ఇప్పుడైనా తెలంగాణ అభివృద్ధికి సహకరించాలి

### లోక్‌సభలో భువనగరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 2,ప్రభాతవార్త:** బిఆర్ఎస్ పాలకులు గత పదేళ్ళుదోచుకొంటుంటే మౌనంగా ఉన్న కేంద్రం ఇప్పుడు కాంగ్రెస్ హయాంలో తెలంగాణ అభివృద్ధికి సహకరిచాలని లోక్‌సభలో భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం చామల కిరణ్‌కుమార్ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బుధవారం లోక్ సభలో మాట్లాడిన అంశాలపై కౌంటర్ ఇచ్చారు. మూసీ పునరిజ్జీవం,తెలంగాణ అప్పులపై మాట్లాడిన కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం కారణంగా నది కాలుష్యంపెరిగిందని ఆరోపించారు. హైదరాబాద్ నగరంలో మూసీ నది ప్రక్షాళనకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందనీ ఆయన వివరించారు. ప్రపంచ బ్యాంకులో 500 మిలియన్ డాలర్ల లోన్ కోసం ప్రిలిమినరీ ప్రపోజల్ రిపోర్టును రెడీ చేశామనీ తెలిపారు.

# ఆట

## డస్సెన్ రిటైర్మెంట్



**జోహన్నెస్ బర్గ్:** దక్షిణాఫ్రికా స్టార్ ఆటగాడు రస్సీ వాన్ డెర్ డస్సెన్ రిటైర్మెంట్ ప్రకటించాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటిస్తున్నట్లు సోషల్ మీడియా వేదికగా వెల్లడించాడు. కెరీర్‌లో తనకు సహకరించిన దక్షిణాఫ్రికా బోర్డుకు, సహచర ఆటగాళ్లకు, కోచ్‌లకు డస్సెన్ కృతజ్ఞతలు తెలిపాడు. 37 యేళ్ల రస్సీ వాన్ డెర్ డస్సెన్... దక్షిణాఫ్రికా తరఫున 71 వన్డేలు ఆడి ఆరు సెంచరీలతో 2657 పరుగులు... 57టీ20లలో 1406 పరుగులు సాధించాడు. అలాగే 18 అంతర్జాతీయ టెస్టుల్లో ఆడిన డస్సెన్.. 5 అర్ధసెంచరీలు సహా 905 రన్స్ చేశాడు. ఐపీఎల్‌లో డస్సెన్ తన వంతు పాత్ర పోషించాడు. 2022 ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ జట్టుకు ఆడాడు. సౌతాఫ్రికా లీగ్‌లో కేప్ టౌన్ తరఫున ప్రాతినిధ్యం వహించాడు.



## ఈడెన్‌లో సన్‌రైజింగ్



**కోల్‌కతా:** ఈడెన్ గార్డెన్స్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ మెరిసింది. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ 200 ప్లస్ పరుగులు సాధించి ఎట్టకేలకు విజయం అందుకుంది. కోల్‌కతా నైట్ రైడర్స్‌ను దాని సొంతగడ్డపై65రన్స్‌తో ఓడించి ఐపీఎల్‌లో గెలుపు బోణీ కొట్టింది.

227 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన నైట్‌రైడర్స్ ఆరంభం ధాటిగా మొదలైంది. డేవిడ్ పెయిన్ వేసిన తొలి ఓవర్లో అల్లెన్ 4,4,6,6, 4తో 25 రన్స్ సాధించాడు. కేవలం 7బంతుల్లోనే 26 రన్స్ చేసిన అల్లెన్‌ను దూబే అవుట్ చేశాడు. రహానే(8),కామరూన్ గ్రీన్2), అంకుల్(0) నిరాశ పరిచారు. అభిషేక్ బౌలింగ్‌లో రెండు సిక్స్‌లతో జోరు చూపిన రఘువంశ్ 29 బంతుల్లో 52 రన్స్ చేశాడు. రింకూ సింగ్ 25 బంతుల్లో 35రన్స్‌తో రాణించాడు. మిగతా బ్యాట్స్‌మెన్ విఫలమవడంతో నైట్‌రైడర్స్ 16 ఓవర్లలో 161రన్స్‌కు ఆలౌటైంది. బ్యాటింగ్‌లో రాణించిన నితీష్ కుమార్ బౌలింగ్‌లోనూ కీలక సమయంలో రింకూసింగ్, అంకుల్ వికెట్లను తీశాడు. ఎస్ఆర్‌హెచ్ ఫీల్డర్లు రెండు రనౌట్లు చేశారు. ఇతర ఎస్ఆర్‌హెచ్ బౌలర్లలో జయ్ దేవ్ ఉనద్కత్ 3, మలింగ రెండు వికెట్లు తీశారు.

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన సన్ రైజర్స్‌కు ఓపెనర్లు అభిషేక్ శర్మ(21 బంతుల్లో 48), ట్రావిస్ హెడ్(21 బంతుల్లో 46) మెరుపు ఆరంభం ఇచ్చారు. తొలి ఓవర్‌లో ఆచితూచి ఆడిన ఈ ఇద్దరూ ఆ తర్వాత ఆకాశమే హద్దుగా చెలరేగారు. ముజర్బానీ వేసిన రెండో ఓవర్లో ట్రావిడ్ రెండు ఫోర్లు, అభిషేక్ సిక్స్‌తో జూలు విదిల్చారు.ఇక అరోరా ఓవర్లోనైతే ట్రావిస్ రెండు సిక్స్‌లు, ఓ ఫోర్‌తో 21 రన్స్ సాధిస్తే.. వరుణ్ చక్రవర్తికి అభిషేక్ చుక్కలు చూపాడు. సిక్స్‌తో మొదలుపెట్టి.. 6, 4, 4,4... ఇలా 25 రన్స్ సాధించాడు. ఆరో ఓవర్లో ట్రావిస్ ఫోర్, సిక్స్ బాదిన ట్రావిస్‌ను కార్తీక్ అవుట్ చేశాడు. వీరిద్దరు తొలి వికెట్‌కు 82 పరుగులు అందించారు. ట్రావిస్ అవుటైనా అభిషేక్ జోరు తగ్గలేదు. నరైన్ బంతుల్లో ఫోర్, సిక్స్ బాదాడు. మరోఎండ్‌లో కార్తిక్‌బౌలింగ్‌లో ఇషాన్ వరుస మూడు ఫోర్లతో అలరించాడు.జోరుగా సాగుతున్న ఎస్ఆర్‌హెచ్ ఇన్నింగ్స్‌కు మజర్బానీ బ్రేక్ వేశాడు. ఒకే ఓవర్లో మజర్బానీ 2 వికెట్లు, అంకుల్ రాయ్ ఓ వికెట్ తీయడంతో 7 పరుగుల తేడాతో ఎస్ఆర్‌హెచ్ మూడు వికెట్లు కోల్పోయింది.

ఈ దశలో క్రీజ్‌లోకి వచ్చిన క్లాసెన్(35 బంతుల్లో 52), నితీష్ కుమార్ (24 బంతుల్లో 39) భారీ హిట్టింగ్‌లకు వెళ్లకుండా స్కోరును ముందుకు నడిపారు. అయిదోవికెట్‌కు 82 పరుగులు జోడించి ఎస్ఆర్‌హెచ్ స్కోరును 200 పరుగులు దాటించారు. చెరో ఓ 4 ఫోర్లు, ఓ సిక్స్ బాదారు. చివరి మూడు ఓవర్లలో 42 పరుగులు సాధించడంతో ఎస్ఎస్ఆర్ స్కోరు 20 ఓవర్లలో 8 వికెట్లకు 226 పరుగులకు చేరుకుంది. కేకేఆర్ బౌలర్లలో ముజర్బానీ 4 వికెట్లు, అరోరా 2 వికెట్లు పడగొట్టారు.

### అభిషేక్ శర్మ సిక్సర్ల సెంచరీ

సన్‌రైజర్స్ విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ.. ఐపీఎల్‌లో సిక్సర్ల సెంచరీ పూర్తి పూర్తిచేశాడు. నైట్‌రైడర్స్‌పై నాలుగు సిక్స్‌లు బాదిన అభిషేక్... ఎస్ఆర్‌హెచ్ తరఫున ఈ ఘనత సాధించిన రెండో ఆటగాడిగా నిలిచాడు. వార్నర్ ఎస్ఆర్‌హెచ్ తరఫున 143 సిక్సర్లు బాదాడు. వార్నర్, అభిషేక్ తర్వాతి స్థానాల్లో క్లాసెన్ (89), కేన్ విలియమ్సన్ (64), ట్రవిస్ హెడ్ (50) ఉన్నారు.

## అండమాన్‌లో తొలి సర్ఫింగ్ జాతీయ పోటీలు



**అండమాన్:** అండమాన్‌లో ఏప్రిల్ 9 నుంచి జాతీయ సర్ఫ్ అండ్ సుప్ ఛాంపియన్‌షిప్ జరగనుంది. నాలుగు రోజుల పాటు జరిగే ఈ పోటీలతో దేశీయ సర్ఫింగ్ సీజన్ ప్రారంభం కానుంది. జపాన్‌లో జరిగే ఆసియా క్రీడల్లో పాల్గొనే భారత ఆటగాళ్లకు ఇది చక్కని వేదికగా నిలవనుందని భారత సర్ఫింగ్ ఫెడరేషన్ పేర్కొంది. లిటిల్ అండమాన్ ప్రో 2026లో మేటి సర్ఫింగ్ క్రీడాకారులందరూ బరిలోకి దిగనున్నారు. వీరి ప్రదర్శనకు అండమాన్ దీవుల్లోని బట్లర్ బే బీచ్ వేదిక కానుంది. దేశంలోనే అత్యంత స్వచ్ఛమైన తీరప్రాంతాల్లో ఒకటైన బట్లర్ బే బీచ్‌లో తొలిసారి సర్ఫింగ్ పోటీలు జరుగుతాయి.

## పోలీస్ ఫుట్‌బాల్ ఫైనల్లో ఒడిశా, అసోం రైఫిల్స్



**హైదరాబాద్, మార్చి 2(వార్త క్రీడా ప్రతినిధి):** 74వ బి.ఎన్.ముల్లిక్ స్మారక అఖిల భారత పోలీస్ ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్ మహిళల ఫైనల్లో ఒడిషా, అసోం రైఫిల్స్ జట్లు ప్రవేశించాయి. హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ గ్రౌండ్‌లో జరిగిన మొదటి సెమీఫైనల్లో ఒడిషా 2-0 గోల్స్ తేడాతో సీఐఎస్ఎఫ్‌పై గెలుపొందింది. మరో సెమీఫైనల్లో అసోం రైఫిల్స్ 3-1 గోల్స్ తేడాతో ఎస్ఎస్‌బి జట్టును ఓడించింది. కాగా పురుషుల విభాగంలో సీఐఎస్ఎఫ్5-1తో అండమాన్ నికోబార్‌పై, అసోం రైఫిల్స్ 2-1తో మణిపూర్‌పై, ఒడిషా 7-5తో ఢిల్లీపై, ఐటీబిపి 4-2తో ఎస్ఎస్‌బిపై, గోవా 1-0తో బిఎస్ఎఫ్‌పై, సీఆర్‌పిఎఫ్ 1-0తో రాజస్థాన్‌పై,కేరళం 3-0తో పంజాబ్‌పై, సిక్కిం 4-1తో మిజోరంపై గెలుపొంది క్వార్టర్ ఫైనల్ చేరాయి.




## చేపాక్‌లో సిఎస్‌కె బ్యాటింగ్‌కు పరీక్ష



**చెన్నై:** ఐపీఎల్‌లో నేడు జరిగే ఆసక్తికర పోరులో చెన్నై సూపర్ కింగ్స్, పంజాబ్ కింగ్స్ జట్లు తలపడనున్నాయి. రాజస్థాన్ చేతిలో ఓడిన సీఎస్‌కే సొంత గ్రౌండ్లో విక్టరీతో గెలుపు బోణీ చేయాలని చూస్తోంది. మరోవైపు తొలి మ్యాచ్‌లో గుజరాత్‌ను చిత్తుచేసిన పంజాబ్ కింగ్స్... అదే జోష్‌ను ఈ మ్యాచ్‌లో నూ కొనసాగించి రెండో గెలుపు అందుకోవడంపై ఫోకస్ పెట్టింది.

అయిదుసార్లు ఛాంపియన్ సీఎస్‌కే... తొలి మ్యాచ్‌లో బ్యాటింగ్‌లో బోల్తా కొట్టింది. సీఎస్‌కేకు తొలిసారి ఆడుతున్న టీమిండియా ఓపెనర్ సంజూ శాంమ్సన్‌తో పాటు నిరాశపరిచిన కెప్టెన్ రుతురాజ్, యంగ్ గన్ ఆయూష్ మాత్రే, మాథ్యూ షార్ట్, శివమ్ దూబే ... ఈ మ్యాచ్‌లో కుదురుకుంటారన్న ఆశాభావంతో ఉంది. వీరు పరుగుల వేటలో పడితే పంజాబ్ కింగ్స్ బౌలర్లకు చుక్కలే. సూపర్ ఆల్‌రౌండర్ జేమీ ఓవర్టన్ చక్కని ఫామ్‌లో ఉండడం సీఎస్‌కేకు కలిసివచ్చే అంశం. మాట్ హెన్రీ, ఖలీల్ ఆహ్మద్, నూర్ ఆహ్మద్, కంబోజ్ రూపంలో సీఎస్‌కే బౌలింగ్ ప్రత్యర్థిని కట్టడిచేయాల్సి ఉంటుంది.

ఇటు పంజాబ్ కింగ్స్ బ్యాటింగ్ కూడా తమ తొలి మ్యాచ్‌లో తడబడింది. స్వల్ప స్కోరును చేధించడానికి ఆపసోపాలుపడింది.కూపర్ కానలీ (72నాటౌట్) క్రీజ్‌లో నిలబడకపోతే పరిస్థితి మరోలా ఉండేది. గత సీజన్‌లో అద్భుతంగా రాణించిన ఓపెనర్లు ప్రియాన్ష్ ఆర్యా, ప్రభ సిమ్రాన్ సింగ్ నుంచి ఆ జట్టు మెరుపు ఆరంభాన్ని ఆశిస్తోంది. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్, నెహల్ వధేరా, మార్కస్ స్టోయినిస్‌లతో కూడిన మిడిల్ ఆర్డర్ గాడిన పడాల్సి ఉంది. బౌలింగ్‌లో మాత్రం మెరుగ్గా ఉంది. తొలి మ్యాచ్‌లో భారత పేస్ అటాకర్ అర్షదీప్ సింగ్ భారీగా పరుగులిచ్చినా...మిగతా బౌలర్లు ప్రత్యర్థిని చక్కగా కట్టడి చేశారు. ముఖ్యంగా స్పిన్నర్లు చాహల్, విజయ్‌లపై మరోసారి పంజాబ్ భారీ ఆశలు పెట్టుకుంది. రెండు జట్లలోనూ మ్యాచ్ ఫినిషర్లు ఉండడంతో చెపాక్‌లో పరుగుల వరద పారనుంది.

**హెడ్ టు హెడ్**

సీఎస్‌కే, పంజాబ్ కింగ్స్ జట్లు 32 సార్లు తలపడ్డాయి. ఇరు జట్లు సమవుజ్జీగా ఉన్నాయి. చెరో 16 మ్యాచ్‌ల్లో గెలుపొందాయి.

**పిచ్ రిపోర్ట్**

సీఎస్‌కే ఈ ఐపీఎల్‌లో సొంత గ్రౌండ్‌లో తొలి సారి మ్యాచ్ ఆడబోతోంది. చెన్నై చెపాక్ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంది. స్పిన్నర్లకు కొంత సహకారం లభించినా... భారీ స్కోర్లు నమోదయ్యే అవకాశం ఉంది. బంతి బ్యాట్‌పైకి చక్కగా వస్తుంది. దీంతో బ్యాట్స్‌మెన్ దాటిగా ఆడగలరు. ఇటీవలి టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లో జింబాబ్వేపై టీమిండియా 254 రన్స్ చేసింది.

**చెన్నై సూపర్ కింగ్స్ తుది జట్టు(అంచనా):** సంజు సామ్సన్ (వికెట్ కీపర్), రుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), ఆయుష్ మాత్రే, మాథ్యూ షార్ట్, శివమ్ దూబే, కార్తిక్ శర్మ, జేమీ ఓవర్టన్, నూర్ అహ్మద్, మాట్ హెన్రీ, అన్షుల్ కంబోజ్, ఖలీల్ అహ్మద్; **ఇంపాక్ట్ ప్లేయర్:** సర్ఫరాజ్ ఖాన్/రాహుల్ చాహర్

**పంజాబ్ కింగ్స్ తుది జట్టు(అంచనా):** ప్రభ్‌సిమ్రాన్ (వికెట్ కీపర్), కూపర్ కానలీ, శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), వధేరా,శశాంక్ సింగ్, స్టోయినిస్, మార్కో జాన్సెన్, బార్ట్‌లెట్, విజయకుమార్ వైశాఖ్, అర్ష్‌దీప్ సింగ్, యుజ్వేంద్ర చాహల్; **ఇంఫాక్ట్ ప్లేయర్:** ప్రియాన్ష్ ఆర్యా

## లక్ష్యాలను అధిగమించిన పరోక్ష పన్నుల వసూళ్లు

### రూ.15.52 లక్షల కోట్లు వసూలయినట్లు ఆర్థికశాఖ వెల్లడి


వాణిజ్యం




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:** దేశంలో పరోక్ష పన్ను వసూళ్లు లక్ష్యాలను అధిగమించాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో 101.2 శాతం అంచనాలను అందుకున్నట్లు తెలిపారు. మొత్తంగా చూస్తే జిఎస్టీ, కస్టమ్స్, ఎక్సైజ్ సుంకాలు పన్నుల రూపంలో రూ.15.52 లక్షలకోట్లు వసూలయినట్లు ఆర్థికశాఖప్రకటించింది. కస్టమ్స్ సుంకాల వసూళ్లు 102శాతంగా ఉన్నాయి.ఎక్సైజ్ సుంకాలు వసూళ్లు కూడా 101శాతం లక్ష్యాలు సాధించినట్లు వెల్లడించింది. పరోక్షపన్నులు ఈ ఆర్థిక సంవత్సరంలో క్రమేపీ పెరుగుతూ వచ్చాయని 2021నుంచి చూస్తే 10.82 లక్షలకోట్లనుంచి 15.లక్షలకోట్లవరకూ వసూళు జరిగాయి. తాజాగా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.1.52 లక్షల కోట్లకు చేరినట్లు తేలింది.

రానున్న ఆర్థికసంవత్సరానికి రూ.17.50 లక్షలకోట్లు బడ్జెట్‌లో అంచనాలున్నాయి. పరోక్షపన్నుల్లో జీఎస్టీయే ఎక్కువ వాటాతో ఉంది. పన్నువసూళ్లలో పెరుగుదలవల్ల ప్రభుత్వం ఆర్థికలోటును కట్టడిచేసుకునే వెసులుబాటు కలుగుతోంది. 2026 ఆర్థిక సంవత్సరంలో ఆర్థికలోటు జిడిపిలో 4.4శాతంగా ఉంటుందని అంచనావేసారు. దేశీయంగా వినియోగ వ్యయం పెరగడం, పన్ను యంత్రాంగంలో కఠిన కార్యాచరణ, లీకేజిల కట్టడి, ఆన్‌లైన్ నిర్వహణ వంటివే రాబడులు పెరిగేందుకు దోహదం చేసాయి. అయితే పాన్‌మసాలా పై విధించిన సెస్ మాత్రం అంచనాలు అందుకోలేదు. హెల్త్, నేషనల్ సెక్యూరిటీ సెస్సు విధించారు. 40శాతం జీఎస్టీ రేటుకు అదనంగా ఈ ఏడాది ఫిబ్రవరినుంచి ఈసెస్సు వసూలుచేస్తోంది.ఈ సెస్సురూపంలో రూ.2330కోట్లు రాగలవని అంచనావేస్తే కేవలం 63శాతం లక్ష్యాలు మాత్రమే చేరుకోగలిగింది. కొత్తగా ప్రవేశ పెట్టిన పన్నులు కావడం వల్లనే ఈ తగ్గుదల సహజమేనని అధికారులు చెపుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సెస్సుల రూపంలోరూ.14 వేలకోట్లు వసూలు చేయాలని కేంద్రం లక్ష్యం విధించింది.

## బులియన్ మార్కెట్‌లో ధరల పతనం



**ముంబయి, ఏప్రిల్ 2:** బంగారం, వెండి ధరలు గురువారం పతనం అయ్యాయి. ముడిచమురుదరలు పెరగడం, గ్లోబల్‌కమోడిటీ మార్కెట్లలో కూడా పెరుగుదల నమోదుచేయడంతోపాటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తొలిసారిగా జాతినుద్దేశించి చేసిన ప్రసంగం వివరాలు బులియన్ మార్కెట్‌పై ప్రభావం చూపించాయి. మల్టీకమోడిటీ ఎక్స్ఛేంజి ఎంసిఎక్స్‌లో పసిడిధరలు 4.3శాతం తగి అంటే రూ.6608 తగ్గిరూ.1,47,100గా నడిచింది. వెండిధరలు కూడా 7.8శాతం తగ్గింది. అంటే కిలో ఒక్కొంటికి రూ.19,001తగ్గి రూ.2,24,500గా ఇంట్రాడేలో నమోదయింది. గ్లోబల్‌మార్కెట్లలో బంగారం 3.4శాతం పతనం అయి ఔన్స్ ఒక్కొంటికి 4648 డాలర్లకు చేరింది.వెండిధరలు కూడా 6.2శాతం తగ్గి ఔన్స్ఒక్కొంటికి 71.39 డాలర్లుగా నడిచింది. బ్రెంట్ ముడిచమురు 7.6శాతం పెరిగి బ్యారెల్‌కు 108.81 డాలర్లుగా ఉన్నాయి. డబ్ల్యుటిఐ ముడిచమురు బ్యారెల్‌కు 107.18 డాలర్లుగా ఉంది. కాగా దేశీయ స్పాట్ మార్కెట్‌లో 24కేరట్ల బంగారం పది గ్రాములకు రూ.1,48,970గాను 22 కేరట్ల బంగారం రూ.1,36,550గాను, 18 కేరట్లు రూ.1,11,730గాను కొనసాగాయి. అదేవిధంగా వెండిధలు కూడా తగ్గాయి. కిలో ఒక్కొంటికి రూ.2.55 లక్షలుగా కొనసాగింది. దేశంలోని ప్రధానమెట్రో నగరాలన్నింటిలోనూ ఇవే ధరలు స్పాట్ మార్కెట్‌లో కొనసాగాయి.

## నష్టాలనుంచి సెన్సెక్స్ నిఫ్టీ రికవరీ



**ముంబయి, ఏప్రిల్ 2:** దేశీయ స్టాక్ మార్కెట్లు ఇన్వెస్టర్లకు అనూహ్య ఫలితాలు చూపించాయి. ఉదయం ప్రారంభంలో నష్టాల ఊబిలో కూరుకుపోయిన సూచీలు, ట్రేడింగ్ ముగిసే సమయానికి అనూహ్యంగా పుంజుకుని లాభాల బాట పట్టాయి. ఆద్యంతం ఉత్కంఠగా సాగిన నేటి మార్కెట్ విశేషాలు ఇలా ఉన్నాయి. భారీ నష్టాల నుంచి పైపైకి ఎగబాకాయి.గురువారం ఉదయం మార్కెట్లు ప్రారంభం కావడమే భారీ నష్టాలతో మొదలయ్యాయి. అంతర్జాతీయ ప్రతికూల పవనాలు, ముడిచమురు ధరల పెరుగుదల భయాల మధ్య సెన్సెక్స్ ఒకానొక దశలో ఏకంగా 1,526 పాయింట్ల మేర పతనమై ఇన్వెస్టర్లను వణికించింది. అయితే.. మధ్యాహ్నం తర్వాత పరిస్థితి తలకిందులైంది. కనిష్ట స్థాయిల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు కోలుకున్నాయి. చివరకు సెన్సెక్స్ 185.23 పాయింట్ల లాభంతో 73,319 వద్ద, నిఫ్టీ 33.70 పాయింట్ల స్వల్ప లాభంతో 22,713 వద్ద స్థిరపడ్డాయి. ఐటీ షేర్ల జోరు, రూపాయి పటిష్టతకు తోడు మార్కెట్ల రికవరీలో ఐటీ రంగం కీలక పాత్ర పోషించింది. హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, టీసీఎస్ వంటి దిగ్గజ సంస్థల షేర్లలో భారీగా కొనుగోళ్లు జరిగాయి. వీటికి తోడు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అండగా నిలిచింది. మార్కెట్లో రుచి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, బైక్ హాస్పిటాలిటీ, బాంబే సూపర్ హైబ్రిడ్ సీడ్స్ వంటి కంపెనీలు టాప్ గెయినర్లుగా నిలిచాయి. మరోవైపు ఏషియన్ పెయింట్స్, సన్‌ఫార్మా, ఎన్టీపీసీ, రిలయన్స్ వంటి బడా సంస్థల షేర్లు స్వల్ప నష్టాలను చవిచూశాయి.

## ఇంధన సర్‌ఛార్జిలు పెంచిన ఇండిగో

**ముంబయి, ఏప్రిల్ 2:** విమానాల్లో వినియోగించే ఇంధన ధరలు ఇటీవల భారీగా పెరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విమానయాన సంస్థ ఇండిగో కీలక నిర్ణయం తీసుకున్నది. టిక్కెట్లపై వసూలు చేసే ఫ్యూయల్ ఛార్జీలను భారీగా పెంచింది. దేశీయ, అంతర్జాతీయ టిక్కెట్లపై కనిష్ఠంగా రూ.275, గరిష్ఠంగా రూ.10 వేల వరకు పెంచింది. ఈ ఛార్జీలు రేపటి నుంచి (ఏప్రిల్ 2) అమల్లోకి వస్తాయని ఇండిగో సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. విమానాలకు ఉపయోగించే ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్) సవరించిన రోజునే ఇండిగో విమానయాన టిక్కెట్ల ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ఇంధన ధరలు పెరుగుతున్న విషయం తెలిసిందే. గత నెల రోజుల్లో ఏటీఎఫ్ ధరలు రెట్టింపు కంటే ఎక్కువగా పెరిగాయని, దీనివల్ల విమానయాన సంస్థ నిర్వహణ వ్యయాలపై ఇది గణనీయమైన ప్రభావాన్ని చూపుతోందని ఇండిగో తెలిపింది. ఇంధన ధరల పెరుగుదలను పూర్తిగా భర్తీ చేయడానికి విమాన ప్రయాణ ఛార్జీలను భారీగా సవరించవలసి ఉంటోందని పేర్కొంది. ప్రయాణికులపై అధిక భారం పడకుండా స్వల్ప మొత్తంలో బదిలీ చేశామని తెలిపింది. ఈ ధరలు నేటి అర్ధరాత్రి నుంచి అమలులోకి వస్తాయని వెల్లడించింది.

## డాలర్ వర్సెస్ రూపాయి 93.21




**ముంబయి, ఏప్రిల్ 2:** భారత రూపాయి మారకం విలువ గురువారం మరింత పటిష్టపడింది. గడచిన 12 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా ఒక్కరోజే పెద్ద మొత్తంలో లాభపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 1.7 శాతం బలపడి 93.21 వద్ద స్థిరపడింది. ఒకేరోజు ఏకంగా 157 పైసలు పటిష్టం అయిందని ఫోరెక్స్ నిపుణులు వెల్లడించారు. కరెన్సీ స్పెక్యులేషన్‌ను అరికట్టేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తీసుకుంటున్న కఠిన చర్యలే ఈ పెరుగుదలకు ప్రధాన కారణం. 3 రోజుల సెలవుల తర్వాత మార్కెట్లు తిరిగి ప్రారంభమైన వెంటనే రూపాయి ర్యాలీ కనిపించింది. స్పెక్యులేషన్‌కు అడ్డుకట్ట వేసేందుకు ఆఫ్‌షోర్ డెరివేటివ్ మార్కెట్లపైనా ఆర్బీఐ ఆంక్షలను విస్తరించింది. రెసిడెంట్, నాన్‌రెసిడెంట్ క్లయింట్లకు రూపాయి నాన్‌డెలివరబుల్ ఫార్వర్డ్స్ (ఎన్డీఎఫ్) అందించకుండా బ్యాంకులను నిషేధించింది. రద్దు చేసుకున్న ఫార్వర్డ్ కాంట్రాక్టులను మళ్లీ బుక్ చేసుకునే అవకాశం కంపెనీలకు లేదని స్పష్టం చేసింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంకేతాలు ఇవ్వడంతో చాలా ఆసియా కరెన్సీలు బలహీనపడినా రూపాయి బలపడటం గమనార్హం.

## ఈక్విటీ మ్యూచువల్‌ఫండ్స్‌లో ఐదు కొత్త స్కీమ్స్




**ముంబయి, ఏప్రిల్2:**ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో ఐదు కొత్తపథకాలు,మరో ఎస్ఐఎఫ్ స్కీమ్ కొనుగోళ్లకు అందుబాటులోకి వచ్చాయి.జియో బ్లాక్ రాక్, జెరోధా మ్యూచువల్ ఫండ్స్ వంటి ప్రముఖ అసెట్ మేనేజ్మెంట్ కంపెనీలు తమ పోర్ట్ ఫోలియోలోని ఖాళీలను భర్తీచేస్తూ ఇన్వెస్టర్లను ఆకర్షించేందుకు న్యూ ఫండ్ ఆఫర్స్‌తో వచ్చాయి. చిన్న మొత్తాల్లో పెట్టుబడి పెట్టే వారితో పాటు ఒకేసారి పెద్ద మొత్తంలో ఇన్వెస్ట్ చేసే వారికి సైతం ఇప్పుడు అవకాశం ఉంది. ఈ ఫండ్స్‌లో నెలకు రూ.100, రూ.500, రూ.1000 తోనూ చేరవచ్చు. ఈ 5కొత్త ఫండ్స్‌లో నాలుగు ఇండెక్స్ ఫండ్స్ ఉండగా ఒకటి లార్జ్ క్యాప్ ఫండ్ ఉంది. అలాగే లాంగ్‌షార్ట్ ఫామ్‌లో ఒక ఎస్ఐఎఫ్ స్కీమ్ లాంచ్ అయింది. ఛాయిస్ మ్యూచువల్ ఫండ్స్ మరో రెండు కొత్త ఫండ్స్ లాంచ్ చేసింది. ఛాయిస్ నిఫ్టీ 50 ఇండెక్స్ ఫండ్, ఛాయిస్ నిఫ్టీ నెక్స్ట్ 50 ఇండెక్స్ ఫండ్ స్కీమ్స్ సబ్‌స్క్రిప్షన్ కోసం లాంచ్ అయ్యాయి. ఈ రెండు కొత్త ఫండ్స్ సబ్‌స్క్రిప్షన్ ఏప్రిల్ 2వ తేదీతో ముగుస్తోంది. ఇందులో కనీస పెట్టుబడి రూ.1000గా నిర్ణయించారు. ఆ తర్వాత ఎంతైనా పెట్టుబడి పెట్టవచ్చు. జెరోధా మ్యూచువల్ ఫండ్ నుంచి రెండు ఇండెక్స్ ఫండ్స్ లాంచ్ అయ్యాయి. ఒక ఫండ్ ఏప్రిల్ 6వ తేదీ వరకు, మరొకటి ఏప్రిల్ 15వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయి.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., IslamiaJr.College Compound, MGM Road, Warangal-506002. RNI No.64849 Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act.